- ఆ ముగ్గురు ఎమ్మెల్యేల దారెటు..?
- పోటీలో దిగుతారా... సైలెంట్ అవుతారా.!
- వైసీపీలో ఉంటారా.. బయటకు పోతారా...
- ఆత్మీయ సమావేశాన్ని వాయిదావేసిన మహీధర్
- పోటీకి ప్రయత్నంలోనే వేణుగోపాల్
- వేరే ప్రాంతంలో పదవి ఇచ్చినా నియోజకవర్గంలోనే సుధాకర్



అధికార వైసీపీలో టికెట్ రాని ముగ్గురు ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటి? వారు రాజకీయ భవితవ్యంపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారు? ఇది ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రాజకీయ వర్గాలు, ప్రజల్లో జరుగుతున్న చర్చ. ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉండగా వారిలో దర్శి, ఎస్ఎన్‌పాడు, కందుకూరు శాసనసభ్యులకు మాత్రమే ఆపార్టీ టికెట్ నిరాకరించింది. గెలిచిన అనంతరం ఆపార్టీలో చేరిన చీరాల ఎమ్మెల్యే బలరాంకు బదులు కుమారుడికి సీటు ఇచ్చింది. దీంతో టికెట్ రాని ముగ్గురు ఎమ్మెల్యేల పయనమెటు అన్నది ఆసక్తిగా మారింది.



కింకర్తవ్యం?

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో వైసీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు మినహా మిగిలిన వారికి వారు ప్రాతినిథ్యం వహిస్తున్న స్థానాల్లో కానీ, వేరేచోట కానీ ఆ పార్టీ టికెట్ ఇచ్చింది. టికెట్ రాని ముగ్గురు చివర్లోనయినా అధినేత అవకాశం ఇస్తారన్న నమ్మకంతో ఎదురుచూశారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దర్శి నుంచి మళ్లీ జగన్ అవకాశం ఇవ్వరని ముందుగానే గ్రహించి ఆపార్టీ నుంచే ఎంపీ టికెట్ ఆశించి విఫలమయ్యారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు కూడా ఇక్కడ కాకపోయినా మరో చోటైనా చాన్స్ ఇస్తారని ఎదురుచూశారు. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి మాత్రం అధిష్ఠానంలోని ఒకరిద్దరు నాయకులే చివరిదాకా వేచిచూడండని సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే సీఎం జగన్ మొత్తం నియోజకవర్గాల అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటించటంతో ఆ ముగ్గురికి ఇక వైసీపీ నుంచి పోటీచేసే అవకాశం లేనట్లేనని అంచనా వేస్తున్నారు.

ఒత్తిడిలో మహీధర్


సీనియర్ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తాను తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించే విషయంలో ఒత్తిడికి గురవుతున్నట్లు వెల్లడవుతుంది. చివరి క్షణం వరకు వేచిచూడాలని ఆపార్టీలోని కొందరు నాయకులు సూచించినట్లు సమాచారం. అయితే ముందుగానే పరిస్థితిని గ్రహించిన మహీధర్‌రెడ్డి వేరే పార్టీ నుంచి వచ్చిన ఆహ్వానాలపై కూడా కొంతకాలం దృష్టి సారించారు. ఒకదశలో ఆయన్ను టీడీపీలోకి తీసుకునేందుకు ఆపార్టీ సిద్ధమైంది. ఒకరిద్దరు ముఖ్యనాయకులకు, మహీధర్‌రెడ్డి మధ్య ఫోన్ సంభాషణలు కూడా జరిగినట్లు సమాచారం. ఎవరు వెనకడుగు వేశారనే విషయం పక్కనపెడితే ప్రస్తుతం ఆయన టీడీపీలోకి వెళ్లే అవకాశం లేదని తేలిపోయింది. ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించి ప్రచారాన్ని కూడా ప్రారంభించింది. ప్రస్తుతం నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీపడుతున్న టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సాయిరెడ్డిలతో కూడా మహీధర్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. వారిద్దరూ ఆయన్ను వేర్వేరుగా కలిశారు. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు ఈ పర్యాయం ఎన్నికల సమరానికి దూరంగా ఉంటేనే మంచిదనే అభిప్రాయానికి ఆయన వచ్చినట్లు తెలుస్తోంది. అయితే 2014లో వలే పూర్తిగా దూరంగా ఉండాలా, పోటీలో ఉన్నవారికి మద్దతు ఇవ్వాలా అనే విషయంలో స్పష్టతకు రాలేదని సమాచారం. పూర్తిగా సైలెంట్ కావద్దని అనుచరులు ఆయనపై ఒత్తిడి తెస్తున్నారు. మండలాల వారీగా ఆయన అనుచరులు సమావేశమై ఏం చేయాలో చెప్పమని కోరుతున్నారు. ఆయన పోటీలో లేకపోతే కొందరు టీడీపీలోకి వెళ్లిపోనుండగా, మరికొందరు వైసీపీలోనే ఉండే అవకాశం ఉంది. ఆ మేరకు అభ్యర్థులకు టచ్‌లో కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కందుకూరులో మహీధర్‌రెడ్డి అనుచరులతో ఆత్మీయ సమావేశం ఉంటుందని ప్రకటించారు. అనూహ్యంగా మంగళవారం సాయంత్రం సమావేశం వాయిదా పడిందని మరో ప్రకటన విడుదల చేశారు. దీంతో మహీధర్‌రెడ్డి తన నిర్ణయాన్ని ప్రకటించే విషయంలో ఒత్తిడిలో ఉన్నట్లు అర్థమవుతోంది.

నియోజకవర్గం వీడని సుధాకర్‌బాబు

ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబును శాంతపరిచేందుకు వైసీపీ ఒంగోలు లోక్‌సభ డిప్యూటీ కోఆర్డినేటర్ పదవిని అధిష్ఠానం కట్టబెట్టింది. ఎస్ఎన్‌పాడు బాపట్ల లోక్‌సభ పరిధిలో ఉన్నందున ఆయన్ను ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఉపయోగించుకుంటూ, ఎస్ఎన్‌పాడులో పార్టీ అభ్యర్థికి సహకరించే విధంగా చేయాలని ఆ పార్టీ భావించింది. అయితే వేరే జిల్లాలో అయినా చివర్లో అవకాశం ఇస్తారని భావించిన సుధాకర్‌బాబు జాబితా అనంతరం డీలాపడ్డారు మధ్యలో వైసీపీలోని ఒక ప్రముఖ నాయకుడితో కలిసి టీడీపీలోకి వెళ్లే ఆలోచన కూడా చేసినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం భవిష్యత్ కార్యాచరణపై దృష్టిపెట్టారు. సోమ, మంగళవారాలు కూడా ఆయన మల్లవరం వద్ద ఉన్న స్వగృహంలో అనుచరులతో మంతనాలు జరిపినట్లు తెలిసింది. ఇంతవరకు వైసీపీ అభ్యర్థికి మద్దతు ప్రకటించ లేదు. ఆయన్ను నాగార్జున కూడా వెంటేసుకుని తిరిగేందుకు సిద్ధంగా లేరు. దీంతో తనను కలిసిన అనుచరులకు నాగార్జున గెలుపు కోసం కృషిచేయండని సుధాకర్ బాబు నేరుగా చెప్పకపోవడం గమనార్హం. కర్నూలు జిల్లాలో ఒక దళిత వైసీపీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఆవైపు ఎందుకు దృష్టి పెట్టకూడదని సుధాకర్‌బాబుపై అనుచరులు ఒత్తిడి పెంచుతున్నారు. అయితే ఆయన అంత సాహసం చేయలేకపోవచ్చు కానీ నాగార్జునకు మాత్రం సహకరించరని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పోటీకి ప్రయత్నంలో మద్దిశెట్టి

దర్శి కాకపోతే ఒంగోలు ఎంపీ టికెట్ ఇవ్వాలని జగన్ నుంచి పలువురు ముఖ్యనాయకులు చుట్టూ సిటింగ్ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తిరిగారు. ప్రయత్నం ఫలించలేదు. ఒక దశలో ఈ పర్యాయం పోటీకి దూరంగా ఉండాలని భావించినట్లు తెలిసింది. అయితే నియోజకవర్గంలోని పరిస్థితి దృష్ట్యా వైసీపీ అభ్యర్థి బూచేపల్లికి సహకరించకూడదన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు కూడా వెల్లడైంది. ఆమేరకు ఆయన కుటుంబసభ్యులు, అనుచరుల నుంచి కూడా పూర్తిస్థాయిలో ఒత్తిడి వచ్చింది. అలాగే ఆయన సోదరులు కూడా పోటీకి దూరమైతే రాజకీయంగా నియోజకవర్గంలో గ్యాప్ వస్తుందని, ఏదో పార్టీ నుంచి పోటీలో ఉండాలని ఆయనపై ఒత్తిడి చేశారు. 2009 నాటి సంబంధాలతో ఆయన అప్పటి పీఆర్పీ వ్యవస్థాపకులు చిరంజీవిని కలిసినట్లు సమాచారం. ఆయన సిఫార్సుతో జనసేన నేత పవన్‌కల్యాణ్‌ను కూడా కలిసినట్లు ప్రచారంలో ఉంది. ఇంకోవైపు వ్యాపారపరంగా టీడీపీకి చెందిన ఒక మాజీ ఎంపీతో ఉన్న సన్నిహిత సంబంధాలతో ఆపార్టీలో చేరేందుకు కూడా ప్రతిపాదన పంపినట్లు తెలిసింది. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ద్వారా మద్దిశెట్టి పార్టీలో చేరే విషయం అధిష్ఠానానికి ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ఆ రెండు పార్టీల నుంచి ప్రారంభంలో సానుకూల స్పందన రాలేదని తెలిసింది. ఈ దశలో విదేశాలకు వెళ్లిన వేణుగోపాల్ బెంగళూరు చేరారు. గత రెండు రోజుల నుంచి ఆయన టీడీపీ లేక జనసేన నేతలకు టచ్‌లో ఉన్నారు. విదేశాల్లో ఉన్న ఆయన తమ్ముడు మాత్రం తన అన్న టీడీపీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది. మీరెవరూ వేరే వైపు వెళ్లొద్దని నియోజకవర్గంలోని కొందరు నాయకులకు ఫోన్ చేయడం విశేషం. టీడీపీ కూడా ఐవీఆర్ సర్వేలో రోజుకొక నాయకుడు పేరుతో అభిప్రాయాన్ని తెలుసుకుంటోంది. దీంతో అభ్యర్థి ఎంపికపై ఆపార్టీ కసరత్తు చేస్తున్నందున వేణుగోపాల్ టీడీపీలో చేరే అవకాశం ఉందన్న ప్రచారం ముమ్మరమైంది.



ఇచ్చేది నిజమేనా?

- భరోసా పత్రాలు ఇచ్చి వెనక్కి తీసుకున్నారు
- వాటిలో సగం సచివాలయాల్లోనే..
- వీఆర్వోల బీరువాల్లో ఒరిజినల్ ఇళ్ల పట్టాలు
- లబ్ధిదారుల్లో అనుమానాలు
- ఇంతలో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- వలంటీర్ల ద్వారా గుట్టుగా పంపిణీకి వైసీపీ యత్నం
- రెండు నెలలపాటు వారి సేవలు నిలిపివేసిన అధికారులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 20 : జగనన్న ఇంటి స్థలం పేరుతో పట్టాల పంపిణీకి వైసీపీ నేతలు చేసిన హడావుడి అంతాఇంతా కాదు. ఒంగోలులో 25 వేలమందికి ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పిన ఆపార్టీ నేతలు పంపిణీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించారు. అంతకు ముందు రిజిస్ట్రేషన్ పేరుతో సచివాలయాల్లో సాధారణ విధులన్నీ పక్కనపెట్టి లబ్ధిదారులను పిలిచి మరీ వేలిముద్రలు తీసుకున్నారు. పట్టాల కార్యక్రమానికి స్వయంగా సీఎం హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇంతవరకూ బాగానే ఉంది. ఆతర్వాత లబ్ధిదారులకు తెలిసిన విషయం ఏమిటంటే అవి పట్టాలు కాదు, కేవలం భరోసా పత్రాలు మాత్రమే అని. దీంతో లబ్ధిదారుల్లో వీటిపై పలు అనుమానాలు రావడంతో తిరిగి వారి నుంచి వలంటీర్ల ద్వారా వెనక్కి తీసుకున్నారు. ఒరిజినల్ పట్టాలు వేరే ఉన్నాయి.. తహసీల్దారు సంతకంతో మరలా ఇస్తామని నచ్చచెబుతున్నారు. అయితే ఇప్పుడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో గందరగోళంగా మారింది.

అన్నీ సచివాలయాల్లోనే...

ఒకవైపు భరోసాపత్రాలు కట్టలు కట్టలుగా సచివాలయాల్లో మూలుగుతుండగా, ఖాళీ ఇంటిపట్టాల కట్టలు వీఆర్వోల బీరువాల్లో భద్రంగా దాచేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అసలు తమకు స్థల పట్టాలు వస్తాయా? రావా? అన్న అనుమానం లబ్ధిదారుల్లో నెలకొంది. దీంతో తమ పరిధిలోని వలంటీర్లకు ఫోన్ చేసి అడగ్గా, ప్రస్తుతానికి కార్యాలయంలో ఉన్నాయి. పట్టాలు ఇచ్చే విషయమై తమకు ఎలాంటి ఆదేశాలు లేవని చెప్పడంతో అందరూ ఆందోళనకు గురవుతున్నారు. సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తే మీ పట్టాలు మీ ఇంటికే వస్తాయి ఎలాంటి కంగారు వద్దు అని భరోసా ఇస్తున్నారు. అందిన సమాచారం మేరకు ఇప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా వలంటీర్ల ద్వారా గుట్టుగా కొందరు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిసింది.



జగన్ బొమ్మతో ముద్రించిన మరో పట్టా

రెండు నెలలపాటు వలంటీర్లు విధులకు దూరం

వార్డు వలంటీర్లు అధికారిక విధులకు దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఇప్పటివరకూ అందిస్తున్న ప్రభుత్వ పథకాల సేవల్లో వారి అవసరం లేదని కమిషన్ తేల్చిచెప్పింది. దీంతో మంగళవారం నుంచి వారి సెల్ నెంబర్లు బ్లాక్ చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలు అందించే సేవలు ఇకపై వీరు ప్రజలకు చేరువ చేయడా నికి వీలు లేదని, నాయకుల సేవల్లోనూ ఉండటానికి వీలు లేదని కార్పొరేషన్ కమిషనర్ ఆదేశించారు.

వలంటీర్లపైనే వైసీపీ నేతల దృష్టి

నియోజకవర్గంలో ప్రతి ఇంటి సమాచారం ఇప్పటికే వలంటీర్ల వద్ద ఉంది. దీంతో ఏ ఇంటిలో ఎన్ని ఓట్లు ఉన్నాయి. పథకాలు ఎన్ని అందాయి. ఎవరు ఎటువైపు ఉన్నారనే సమాచారమంతా వలంటీర్ల వద్ద ఉంది. ఈ నేపథ్యంలో వలంటీర్లు దూరమైతే పార్టీకి నష్టం వాటిల్లుతుందని భావించిన వైసీపీ నేతలు వారిని అనధికారికంగా ఉపయోగించుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే నిలిచిపోయిన ఇళ్ల పట్టాలను వీరి ద్వారా గుట్టుగా లబ్ధిదారులకు అందించే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఈ రెండు నెలలు వైసీపీ కోసం పనిచేయండి, అవసరమైనవి అందిస్తామని ప్రలోభాలకు గురి చేస్తున్నారు. దీంతో వలంటీర్లపైనే ఆ పార్టీ నేతల ఆధారపడినట్లు తెలుస్తోంది.

'పది' బార్ కోడింగ్ ప్రారంభం

ఒంగోలు(విద్య), మార్చి 20 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో గోప్యత పాటించేందుకు జవాబుపత్రాలకు బార్ కోడింగ్ ప్రక్రియ బుధవారం స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూల్‌లో ప్రారంభమైంది. ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు, ఎనిమిది మంది అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లను ఇందుకోసం నియమించారు. ఇక్కడ మూల్యాంకానికి వచ్చిన జవాబుపత్రాలు ఏ జిల్లా, ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థి అని తెలియకుండా ఉండేందుకు వాటికి పిన్ చేసిన విద్యార్థి వివరాలన్నీ ఓఎంఆర్ షీట్‌లోని పార్ట్-1ను వేరు చేసి వాటిని ట్రంకు పెట్టెల్లో పెట్టి భద్రపరిచి తాళం వేస్తారు. వీటిని వేరు చేసేందుకు మైనంపాడు జిల్లా విద్యాశాఖ సంస్థ(డైట్) విద్యార్థులను నియమించారు. డీఈవో సుభద్ర, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్‌లు బార్ కోడింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ బార్ కోడింగ్ ప్రక్రియను పూర్తి గోప్యతతో నిర్వహించాలన్నారు. వివరాలు బయటకు పొక్కకుండా చర్యలు తీసుకోవాలని కోడింగ్ ఆఫీసర్లకు సూచించారు.

1 తర్వాతే జీతాలు, పెన్షన్ బిల్లులు

ఒంగోలు (విద్య), మార్చి 20 : జీతాలు, పింఛన్లు ఇతర చెల్లింపులకు సంబంధించిన మార్చి నెల బిల్లులు ఏప్రిల్ 1 తర్వాతే అనుమతించనున్నారు. ఆమేరకు ఖజానా అధికారులను ఆదేశిస్తూ ఆశాఖ డైరెక్టర్ మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ లేదా ఆ తర్వాత చెల్లింపులు జరిగే బిల్లుల ఐడీ 2024 ఆర్థిక సంవత్సరంతో మాత్రమే అనుమతించాల్సి ఉన్నందున మార్చిలో జీతాలు, పింఛన్ల బిల్లులు అనుమతించవద్దని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీతాలు, పింఛన్లు, జీపీఏ జీతాలు, వర్క్‌చార్జ్‌డ్ ఎస్టాబ్లిష్‌మెంట్ జీతాలు, ప్రొఫెషనల్ సర్వీసెస్, ఇతర కాంట్రాక్టు సర్వీసులకు సంబంధించి బిల్లులు, పీడీ అకౌంట్స్, తదితర బిల్లులు ఏప్రిల్ 1 తర్వాతే చెల్లిస్తారు. 2023తో ప్రారంభమయ్యే ఐడీలతో అనుమతించొద్దని ఖజానా శాఖ ఏటీవో, ఎస్టీవో, డీటీవోలను మోహన్‌రావు ఆదేశించారు.

రుణ రగడ

- రైతుల పేరుతో బ్యాంకులో ఓ నేత రుణాలు
- తిరిగి చెల్లించాలంటూ సిబ్బంది నోటీసులు
- ఆందోళనకు దిగిన బాధితులు

నాగులుప్పలపాడు, మార్చి 20 : ఓ రాజకీయ నాయకుడు పలువురి రైతుల పేర్లతో బ్యాంకు నుంచి రుణాలు పొంది తిరిగి చెల్లించకపోవడంతో గందరగోళం నెలకొంది. బ్యాంకు అధికారులు రైతులకు నోటీసులు పంపడంతో వారంతా బ్యాంకు వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. విషయం తెలిసి ఆ నాయకుడి అనుచరులు వచ్చి సర్దిచెప్పడంతో వెనుతిరిగారు. ఈ ఘటన నాగులుప్పలపాడులో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. వేటపాలెంకు చెందిన ఓ రాజకీయ నాయకుడి సోదరుడు, ప్రస్తుతం ఓ కీలక పార్టీకి జిల్లాస్థాయిలో ప్రాతినిథ్యం వహిస్తున్న నాయకుడు ఈ రుణ మేత వెనుక ఉన్నారు. గతంలో మండలంలోని అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం, దాసరివారిపాలెం, కనపర్తి తదితర గ్రామాల్లో తన సామాజికవర్గానికి చెందిన వారిని బినామీలుగా చూపి వారి పేర్లతో కనపర్తి ప్రాంతంలోని భూములకు అప్పటి రెవెన్యూ అధికారుల అండదండలతో రికార్డులను సృష్టించారు. ఆయా భూములకు సంబంధించిన పత్రాలతో 2021లో ఎన్‌జీపాడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఒక్కో రైతుకు రూ.2లక్షల చొప్పున రుణాలు పొందారు. తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని బ్యాంకు అధికారులు పలుమార్లు సంబంధిత రైతులకు నోటీసులు జారీచేశారు. నోటీసులు తీసుకున్న రైతులు సదరు నాయకుని వద్దకు వెళ్లి విషయాన్ని ప్రస్తావించగా త్వరలోనే తిరిగి చెల్లించి మీపై ఒత్తిడి లేకుండా చేస్తానని హామీ ఇచ్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇప్పటికే పలుమార్లు నోటీసులు అందుకున్న రైతులు బుధవారం ఏం చేయాలో అర్థంకాక ఏపీజీబీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆ నాయకుడి అనుచరులు బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు చేరుకొని తీసుకున్న రుణాలను వడ్డీతో సహా గురువారం బ్యాంకుకు తిరిగి జమచేస్తామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగినట్లు తెలుస్తోంది.



సునీతకు ప్రభుత్వం అందజేసిన జగనన్న ఇంటి పట్టా

జగనన్న ఉత్తుత్తి పట్టాలే!

అనర్హత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్‌ను నిలిపేసిన అధికారులు

పామూరు, మార్చి 20 : జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో కొందరికి సచివాలయ సిబ్బంది ఝలక్ ఇస్తున్నారు. పామూరుకు చెందిన పలువురు లబ్ధిదారులకు చిలకపాడు ప్రాంతంలో వేసిన జగనన్న లేఔట్‌లో సుమారు 250 పట్టాలు మంజూరు చేశారు. ఉప్పలపాటి సునీతకు ఆ లేఔట్‌లో ప్లాటు నెంబర్ 38లో ఒకటిన్నర సెంట్లతో కూడిన ఇంటి పట్టాను తహసీల్దార్ సంతకంతో మంజూరు చేశారు. ఆ పట్టాను తీసుకొని సచివాలయ అధికారుల దగ్గరకు వెళితే 'మీకు ఇచ్చిన పట్టా అనర్హత జాబితాలో ఉందని, రిజిస్ట్రేషన్ చేయబోమని' చెప్పడంతో కంగుతింది. వైసీపీ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని బాధిత మహిళ వాపోయింది. అదేవిధంగా గుమ్మళంపాడు లేఔట్‌లో కూడా సుమారుగా 36 మంది లబ్ధిదారులకు విద్యుత్ తీగల కింద పట్టాలు ఇచ్చారని, మరోచోట పట్టాలు మంజూరు చేస్తామని చెప్పి ఇచ్చిన ఇంటి పట్టాలను సైతం తీసుకొని ఇంత వరకు స్థలాలు చూపించలేదని బాధితులు వాపోతున్నారు.



జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరిన 31వ డివిజన్‌కు చెందిన వైసీపీ శ్రేణులు

టీడీపీలోకి వలసల జోరు

- వైసీపీ బేజారు
- ఒంగోలు, ఎస్ఎన్‌పాడు సెగ్మెంట్లలో నిత్యం చేరికలు
- మరింత జోష్‌లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు

ఒంగోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జంట నియోజకవర్గాలుగా ఉండే ఒంగోలు, సంతనూతలపాడులలో టీడీపీ శ్రేణులు జోష్ మీద కనిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే టీడీపీ తన అభ్యర్థులుగా ఒంగోలు నుంచి దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు నుంచి బీఎన్ విజయకుమార్‌ను ప్రకటించడంతో వారు ఎన్నికల ప్రచారంలో స్పీడ్ పెంచారు. అదేసమయంలో నియోజకవర్గాల్లోని పలుప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నారు. నిత్యం భారీ చేరికలు ఉంటుండటంతో శ్రేణులు మరింత జోష్‌తో ముందుకు సాగుతుండగా వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. గత పక్షంరోజులుగా ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతం, ఏదో ఒక సామాజికవర్గం వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతూనే ఉన్నారు. దీంతో స్థానికంగా పార్టీకి అండగా ఉన్న నేతలను సమన్వయం చేసుకుంటూ కొత్తగా పార్టీలోకి వచ్చేవారిని పోటీచేయనున్న అభ్యర్థులు ఆహ్వానిస్తున్నారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన ఎస్ఎన్‌పాడులో సహజంగానే క్షేత్రస్థాయిలో వర్గపోరు అధికంగా ఉంటుంది. అక్కడి పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు. అయితే అర్బన్ వాతావరణం అధికంగా ఉండే ఒంగోలులో అలాంటి వర్గపోరు పెద్దగా ఉండే అవకాశం లేకపోవడంతో ఇక్కడి టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆయా డివిజన్ల నుంచి పార్టీలో చేరేవారిని సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

ఒంగోలులో వలసల పర్వం

ఒంగోలులో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. గత పది రోజులుగా పరిశీలిస్తే ఒక్క చిలకలూరిపేట సభ జరిగిన రోజు మినహా నిత్యం పెద్దసంఖ్యలో టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలిచిన ఆర్యవైశ్యులు, మైనారిటీలు అధికంగా ఒంగోలులో టీడీపీలోకి వస్తున్నారు. కాగా గత రెండు, మూడు రోజులుగా రెండు నియోజకవర్గాలలో పరిశీలిస్తే.. ఒంగోలులో సోమవారం భారీగా టీడీపీలో చేరారు. నగరంలో 15వ డివిజన్ వైసీపీకి చెందిన ఆర్యవైశ్య నాయకులు కనమర్లపూడి హరిప్రసాద్, ఇతరుల నేతృత్వంలో పెద్దసంఖ్యలో జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరారు. అదేరోజు సాయంత్రం మూడో డివిజన్‌లోని ప్రకాశం కాలనీకి చెందిన మైనారిటీ నాయకులు చేరారు. అలాగే బుధవారం నగరంలోని 50వడివిజన్ పరిధిలోని జయప్రకాష్‌కాలనీకి చెందిన వైసీపీ నాయకులు చేరగా వారిని జనార్దన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

సంతనూతలపాడులోనూ భారీగా...

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాన్ని చూస్తే నిత్యం ఏదో ఒక గ్రామం నుంచి బీఎన్ విజయకుమార్ సమక్షంలో టీడీపీలో చేరుతూనే ఉన్నారు. చీమకుర్తి మండలం బూసరపల్లిలో ఎన్ఆర్ఐ తక్కెళ్లపాటి రమేష్ సారథ్యంలో పెద్దసంఖ్యలో చేరికలు జరగ్గా ఈ సందర్భంగా భారీ సభను కూడా నిర్వహించారు. అలాగే బుధవారం రాత్రి ఎస్ఎన్‌పాడు మండలం తక్కెళ్లపాడులో బీఎన్ సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. ఈ పరిణామాలతో తెలుగు తమ్ముళ్లు మరింత ఉత్సాహంతో ఉన్నారు.



బూసరపల్లిలో టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న విజయ్‌కుమార్

కోలాహలంగా బార్ అసోసియేషన్

ఎన్నికలకు నామినేషన్లు

● రేపు ఉపసంహరణ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 20: ఒంగోలు బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్లు కోలహలంగా మధ్య దాఖలు చేశారు. స్థానిక జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో బుధవారం నామినేషన్ల ప్రక్రియ జరిగింది. ఎన్నికల అధికారిగా పీవీఎస్.గుప్తా వ్యవహరించారు. ఈ సారి అధ్యక్ష పదవికి ఐదుగురు నామినేషన్లు దాఖలు చేయగా ఇతర పదువులకు పలువురు పోటీపడ్డారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి బొడ్డు భాస్కరరావు, గొకనకొండ శ్రీనివాసరావు, నాగిశెట్టి మోహన్‌దాస్, నూతలపాటి ఇన్నయ్‌బాబు, పురణి శివవెంకసత్యనారాయణరెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి మోటుపల్లి వీరవెంకటశేషవేణుగోపాల్, సలగల జగ్జీవన్‌రావు, మహిళా రిప్రజంటిప్ పదవికి కాకర్ల ఆదిలక్ష్మి, టి.జ్యోతిలు నామినేషన్లు చేశారు. ప్రధాన కార్యదర్శి పదవికి దువ్వూరి నాగేశ్వరరావు, ఏల్చూరి సురేంద్రబాబు, జాయింట్ సెక్రటరీలుగా చందవరపు సురేష్‌బాబు, సానికొమ్ము రామిరెడ్డి, లైబ్రరీ సెక్రటరీ పదవికి పసుపులేటి గోపాలరావు, పెద్దిరెడ్డి వెంకటేష్, కోశాధికారి పదవికి గోపిశెట్టి లక్ష్మీనారాయణ, ముద్ద హెలినా దీపలత నామినేషన్లు దాఖలు చేయగా స్పోర్ట్స్అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి నాగిశెట్టి సాంబశివరావు నామినేషన్ చేశారు. ఈనెల 22న నామినేషన్ల ఉపసంహరణ, ఈనెల 28వతేదీన జిల్లా కోర్టు ఆవరణలో పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

సువిధ పోర్టల్‌ను

వినియోగించుకోవాలి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో సుబ్బారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 20 : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీల అభ్యర్థులు సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలని ఆర్డీవో జీవీ.సుబ్బారెడ్డి కోరారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సువిధ పోర్టల్‌ను వినియోగించుకొని తమ పార్టీకి కావాల్సిన ప్రచార సంబంధమైన ర్యాలీలు, సభలు, వెహికిల్, మైకులు, లౌడ్ స్పీకర్లు, బెలూన్లు, కరపత్రాలు, రోడ్డు షోలు వంటి వాటికి అనుమతులు పొందవచ్చని తెలిపారు. అనుమతుల కోసం సువిధ పోర్టల్ ద్వారా 48 గంటలకు ముందే అనుమతులు పొందవచ్చని చెప్పారు. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి నగరంలోని ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు విగ్రహాలకు ముసుగులు వేశామన్నారు. వివిధ అంశాలపై ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏవో చిన్నికృష్ణ, ఈడీ ఎం.శ్రీకాంత్, డీటీ కట్టా శ్రీదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు డీఎస్.క్రాంతికుమార్, రసూల్, గుర్రం సత్యనారాయణ, పీవీఆర్.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు



ప్రసంగిస్తున్న లక్ష్మీనరసింహం

ఒంగోలు(విద్య), మార్చి 20: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో పీఎల్ఎస్ఐలో ఉద్యోగావకాశాలపై తృతీయ సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన పి.లక్ష్మీనరసింహం పీఎల్ఎస్ఐ, సెమికండక్టర్ ఇండస్ట్రీలో బీటెక్ పూర్తయిన తర్వాత ఉద్యోగాలు ఎలా సంపాదించుకోవచ్చో వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, విభాగాధిపతి ఎం.అప్పారావు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో 'శ్రీచైతన్య' ప్రతిభ



విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ఒంగోలు(కల్చరల్), మార్చి 20: జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన ఐఎస్‌టీఎస్ఓ రెండవ దశ ఫలితాలలో ఒంగోలు నగరం వీఐపీరోడ్‌లోని శ్రీచైతన్య ఒలంపియాడ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ అపర్ణ శిరీష తెలిపారు. మొత్తం 74 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు, ఇద్దరికి నాల్గవ బహుమతి, నలుగురికి ఐదవ బహుమతి, 20 మందికి కన్సోలేషన్ బహుమతులు లభించాయన్నాయన్నారు. అదేవిధంగా 46మంది విద్యార్థులు బంగారు బహుమతులు సాధించారిని బ్రాంచ్ డీన్ వై.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక స్కూలులో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆర్ఐ అనిల్‌కుమార్, సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ అపర్ణ శిరీష చేతులమీదుగా బహుమతుల ప్రదానం చేశారు.

నివాళులర్పించిన బీఎన్



నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్

మద్దిపాడు, మార్చి 20: నాతాని రామారావు మరణం టీడీపీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం పెదకొత్తపల్లిలో నాతాని రామారావు దశదిన కర్మకు హాజరైన ఆయన రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, నల్లూరి సంజీవరావు, మండవ గోపీనాథ్, నల్లూరి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం వేస్తున్న ఇద్దరు అరెస్టు

టంగుటూరు, మార్చి 20 : మండలంలోని కొణిజేడులో నడుస్తున్న కోడిపందెం స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద ఒక కోడిపుంజు, రూ.2,500 నగదును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల ● 31వ డివిజన్ వైసీపీ నాయకులు భారీగా తెలుగుదేశంలో చేరిక



వడ్డెపాలెంలో పర్యటిస్తున్న దామచర్ల జనార్దన్, టీడీపీ తీర్థం పుచ్చుకున్న జయప్రకాష్‌కాలనీవాసులు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 20: ప్రజల భవిష్యత్తు బాగుండాలన్నా, రాష్ట్రంలో సంక్షేమం సాగాలన్నా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, ఇందుకోసం వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని 31వ డివిజన్‌లోని వడ్డెపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ పర్యటించిన దామచర్ల ప్రజలతో మాట్లాడారు. సైకో పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. ఐదేళ్ళపాటు అన్ని విధాలుగా నష్టపోయిన ప్రజలకు మంచి రోజులు రాబోయుతున్నాయని, సైకో పాలన ముగిసిందని, ఇక రాబోయేది సంక్షేమ పాలనే అని చెప్పారు. ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని, సంక్షేమం సాధించుకోవాలని కోరారు. ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే జరిగిందని, ఇందులో ఎలాంటి సందేహం లేదని దామచర్ల స్పష్టం చేశారు. సుమారు రూ.2600 కోట్లు ఖర్చు చేసి నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైన్‌లు, బ్రిడ్జిలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, పార్కుల అభివృద్ధి, నగరంలో సెంట్రల్ లైటింగ్, ఇతరత్రా అభివృద్ధి పనులు చేశామన్నారు. తెలుగుదేశం హయాంలో పట్టణ పేదల కోసం టిడ్కో ఇళ్ళు నిర్మాణం చేపట్టామన్నారు. దాదాపు 80శాతం పూర్తయిన ఇళ్ళను ఐదేళ్ళుగా వైసీపీ నిర్లక్ష్యంగా వదిలేసిందన్నారు. నేటికి ఒక్క పని పూర్తి చేయలేక, తప్పులు కప్పి పుచ్చుకునేందుకు టీడీపీపై నిందలు వేయడం, అబద్ధాలు చెప్పడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఇప్పటికే అనేకమంది వైసీపీ నుంచి టీడీపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని, అందరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డివిజన్‌లో వైసీపీకి చెందిన తమ్మిశెట్టి వెంకటేష్, తమ్మిశెట్టి బసవయ్య, తమ్మిశెట్టి రాములు, బండారు ప్రసాదు, తమ్మిశెట్టి శ్రీను, తమ్మిశెట్టి రాంబాబు, అనీల్, బండారు వంశీ, బండారు విజయ్, వెంకటేశ్వర్లు, కందిమళ్ళ కృష్ణ, మక్కెళ్ళ దుర్గ, బండారు రామకృష్ణ తదితరులతోపాటు సుమారు మరో 50 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, బండారు మదన్, రాచగర్ల వెంకట్రావు, వల్లెపు వెంకటేశ్వర్లు, వల్లెపు తిరుపతమ్మ, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలాగే 50వ డివిజన్ జయప్రకాష్ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు తుపాకుల శ్రీనివాసులు, బెల్లంకొండ రవి, వలసాని శ్రీనివాసులు, కేశనబోయిన రమణయ్య, పలువురు టీడీపీలో చేరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దామచర్ల కండువాలు కప్పి ఆహ్వానించారు.

రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిన వైసీపీ

ఎస్ఎన్‌పాడు తెలుగుదేశం అభ్యర్థి బీఎన్ ధ్వజం ● పి.తక్కెళ్లపాడులో టీడీపీ తీర్థం పుచ్చుకున్న 170మంది వైసీపీ కార్యకర్తలు



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్, కందుకూరి బాబు

సంతనూతలపాడు, మార్చి 20: గత ఎన్నికల్లో ఒక్క చాన్స్ అంటూ అవకాశమిస్తే ఆంధ్ర రాష్ట్రాన్ని వైసీపీ అధినేత జగన్‌తో పాటు ఆ పార్టీ నాయకులు రావణకాష్టంగా మార్చారని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం మండలంలోని గంగవరంలో టీడీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. తరువాత పి.తక్కెళ్లపాడు గ్రామంలో బాబుషూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం విడిపోయి అగయ్యగోచరంగా మారిన ఆంధ్రప్రదేశ్‌ను నాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఎంగా అహర్నిశలు శ్రమించి నవ్యాంధ్రను ప్రపంచపటంలో నిలబెట్టారన్నారు. నాటి సమయంలో ఎన్నో ప్రైవేట్ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి ఎంతోమంది యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేశారని, అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న అమరావతిని రాజధానిగా ప్రకటించి ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. అయితే ముఖ్యమంత్రి జగన్ మాత్రం రాష్ట్రానికి మూడు రాజధానులు అంటూ విచిత్ర వాదన తెచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి అంటే రాష్ట్రంలో ప్రజలకు బటన్ నొక్కి డబ్బులు వేయడమేనా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. అనంతరం గ్రామంలో కుంచాలరాజు ఆధ్వర్యంలో 170 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీలు కండువాలు వేసి ఆహ్వానించారు.

అనంతరం జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి బాబు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి కోసం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, ప్రధాని మోదీ జట్టు కట్టారన్నారు. ఉమ్మడి కూటమి విజయానికి ప్రజలు సహకరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కూటమిదే విజయమని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నలమోతు శ్రీను, ఆర్.సురేష్, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రచారం చేస్తున్న వలంటీర్లను తొలగించాలి

● సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 20 : రాష్ట్రంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరగాలంటే అధికార పార్టీ ప్రచార కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్న వలంటీర్లను వెంటనే తొలగించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలులోని రంగాభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సుపరిపాలన వేదిక నాయకుడు సుంకర సాయిబాబు, నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు కొల్లా మధు, సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షుడు కంచర్ల సుబ్బారావు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆల్ఫ్రెడ్, కర్నూలు రోడ్డు షాప్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మారెళ్ళ సుబ్బారావుతో కలిసి లక్ష్మణరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ వేతనంతో పని చేస్తున్న వలంటీర్లు ఎన్నికల విధులలో భాగస్వాములు కాకూడదని కేంద్ర ఎన్నికల కమిషన్, హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా స్థానిక అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం నేరంగా పరిగణించి అలాంటి వారిని తొలగించాలన్నారు. ముఖ్యమంత్రి ఫొటోలు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, 104, 108 వాహనాలు, పాస్ పుస్తకాలు, ప్రభుత్వ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ దస్తావేజులతో పాటు సర్వే రాళ్ళు, చివరకు మధ్యాహ్న భోజనంలో అందించే చిక్కీలు, ప్రభుత్వ వైద్యశాలలో రిపోర్టులపై కూడా ఉండటం దురదృష్టకరమన్నారు. వాటన్నింటిని వెంటనే తొలగించాలన్నారు. సుపరిపాలనను అందించే నిజాయితీ పరులైన నేతలను ఓటర్లు ఎన్నుకోవాలని కోరారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ 15 మంది నిజాయితీ పరులైన మేధావులు, రిటైర్డ్ అధికారులతో ఏర్పడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు. అర్హత ఉండి ఓటర్ల జాబితాలో ఓట్లు లేని వారు వచ్చే నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు ఓటుకు వెయ్యి తీసుకుంటే ఐదేళ్లలో రోజుకు 54 పైసలు చొప్పున లభిస్తాయని, అందువల్ల పవిత్రమైన ఓటుహక్కును డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకు అమ్ముకోవద్దని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల అ క్రమాలపై స్పందించేందుకు సిటిజన్ ఫర్ డెమో క్రసీ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 18004250264, అలాగే వాట్సప్ నెంబర్ 879000557లను వినియోగించుకోవాలని ఆయన కోరారు.



ఎనికపాడులో వైసీపీ రంగులతో ఉన్న బల్లలు



మండల పరిషత్ కార్యాలయంలో రాళ్లకు వేసిన రంగులు

అన్నింటా

అధికార పార్టీ రంగులే!

● అధికారుల నుంచి చర్యలు శూన్యం

సంతనూతలపాడు, మార్చి 20: అధికార వైసీపీ యథేశ్చగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తోంది. సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయ, దాని పరిసరాల్లో ఉన్న రాళ్లకు వైసీపీ రంగులు ఉన్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎనికపాడులో వైసీపీ రంగులతో నింపిన బల్లలను సైతం రోడ్డుపైనే అలాగే ఉంచారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. మండలంలోని పలుగ్రామాల్లో వైసీపీ రంగులతో ఉన్న బల్లలకు, ప్రభుత్వకార్యాలయాలకు, గ్రామాల్లో బావులకు ఉన్న వైసీపీ రంగులను తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



మండల పరిషత్ కార్యాలయానికి ఉన్న వైసీపీ జెండా రంగును పోలిన పెయింటింగ్

అవీ..ఇవీ..

1 నుంచి టెన్త్ మూల్యాంకనం

ఒంగోలు(విద్య), మార్చి 20: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి 8వతేదీ వరకు జరుగుతుంది. మొదట ఈనెల 31నుంచి మూల్యాంకనం ప్రారంభమవుతుందని షెడ్యూల్ ప్రకటించారు. తాజాగా ఈ షెడ్యూల్‌ను సవరిస్తూ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు, రామనగర్‌లోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం జరుగుతుంది షామియానాల కింద కాకుండా పక్కాగా ఉన్న తరగతి గదుల్లో, హాళ్ళలోనే మూల్యాంకనం నిర్వహించనున్నారు. అకాల వర్షం, ఇతర ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా ఇబ్బంది లేకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈనెల 31న అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, ఏప్రిల్ 1న చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంటు ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు విధులకు హాజరు కావాలి. వీరికి ఉదయం సెషన్స్‌లో బార్ కోడింగ్‌పై అవగాహన, మధ్యాహ్నం నుంచి మూల్యాంకనం ప్రారంభించాలని ఆదేశించారు.

కారును ఢీకొన్న లారీ.. ఒకరు మృతి



కారును పరిశీలిస్తున్న ఎస్సై బ్రహ్మనాయుడు

నాగులుప్పలపాడు మార్చి 20: కారును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన 216 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపిన వివరాల మేరకు మద్దిపూడి మండలం గుండ్లసముద్రం గ్రామానికి చెందిన కోవెలకుంట్ల శివకృష్ణ, బుధవారం తెల్లవారుజామున కారులో చీరాల నుంచి ఒంగోలుకు వెళ్తూ ఉప్పుగుండూరు సమీపములోని నాగన్నవాగు మూలమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. కారు నడుపుతున్న శివకృష్ణ తీవ్రగాయాలు కావడంతో ఒంగోలులోని కిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శివకృష్ణ మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్బీకే జిల్లా వనరుల కేంద్రంలో కోడ్ అమలు

● ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 20: ఒంగోలులోని ఆర్బీకే జిల్లా వనరుల కేంద్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేశామని ఆత్మ, డీఆర్‌సీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ఆర్బీకే కేంద్రంలో వైసీపీ రంగులు ఉన్నట్లుగా ప్రచురితమైన వార్తపై ఆమె స్పందించారు. అయితే ఆ వార్తలో వాస్తవం లేదన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ రంగులు, లోగోలు ఉన్న రాజకీయ నాయకులు ఫొటోలు కనిపించకుండా చేశామని ఆమె వెల్లడించారు.

జీజీహెచ్‌లో అన్నదానం



ట్రస్టు సభ్యులతో సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 20 : ఒంగోలులోని జీజీహెచ్‌లో సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చేవారి ఆకలి తీర్చేందుకు వచ్చేవారికి, వారి సహాయకులకు ఇంకొల్లుకు చెందిన శ్రీ సాయి వెంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్ట్ తోడ్పాటు అందించింది. ఈ మేరకు ప్రతి సోమవారం, గురువారం వచ్చే దివ్యాంగులు, వినికిడి లోపం, అంధత్వంతో బాధపడేవారికి ఆహారం అందించేందుకు ట్రస్ట్ ప్రతినిధులు ముందుకొచ్చారు. సదరం సర్టిఫికెట్ల కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చేవారికి తమ ట్రస్ట్ తరుపున ఆకలి తీర్చే ప్రయత్నాన్ని చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. అందుకోసం ఇప్పటికే కొనసాగుతున్న శ్రీసత్యసాయి ప్రేమ సేవా ట్రస్ట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు జీజీహెచ్‌లో ట్రస్ట్ తరుపున చేపట్టిన సేవా కార్యక్రమాన్ని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.భగవాన్ నాయక్ ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గోరంట్ల నాగేశ్వరరావు, పద్మ దంపతులు, ముద్దన హరినారాయణ, శ్రీదేవి, సత్యసాయి అధ్యక్షులు తంగిరాల రామిరెడ్డి, ఛైర్మన్ మంత్రి శ్రీరామూర్తి, కోడూరి ప్రసాదరావు, ఆర్ఎంవో హనుమంతరావు, డాక్టర్ అజయ్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 20 : సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారులు డాక్టర్ బి.రవి, జ్యోతి, అర్చనలు కోరారు. బుధవారం ఒంగోలు నగర పాలక సంస్థపరిధిలోని దత్తాత్రేయ కాలనీ, యానాది కాలనీల్లో ఓటుపై అవగాహన కల్పించారు. మే 13వతేదీన జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 20: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురు, శుక్రవారాల్లో నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారు. అలాగే శుక్రవారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో మాగుంట పాల్గొంటారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో క్విస్ విద్యార్థిని ప్రతిభ



భార్గవిని అభినందిస్తున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు(విద్య), మార్చి 20 : ఆలిండియా అంతర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ పోటీల్లో ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని భార్గవి ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం సాధించారు. భార్గవి బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఢిల్లీలోని విరాట్‌లో స్వామి వివేకానంద శుభభారతి యూనివర్శిటీలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీల్లో భార్గవి అద్భుత ప్రతిభ చాటి పతకం సాధించారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో భార్గవిని కళాశాల డైరెక్టర్, ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ మౌళీచంద్ర, ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.231

సంతనూతలపాడు, మార్చి 19: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.231 పలికింది. గుర్వారెడ్డిపాలెం నుంచి 697 పొగాకు బేళ్లు రాగా 640 బేళ్లు అమ్ముడయ్యాయి. 57 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.231లు పలకగా, కనిష్ఠ ధర రూ.220, సరాసరి ధర రూ.228.45 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మల్లవరం దేవాలయంలో వేలం

మద్దిపాడు, మార్చి 20: మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో దేవదాయశాఖ అధికారులు బుధవారం షాపులకు ఈవో దామా సుబ్బారావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారు రెండేళ్లపాటు సరుకులు విక్రయాలు జరుపుకోవచ్చునని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నారా నాగిరెడ్డి, పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, మార్చి 20: మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఒకరికి గాయాలైన సంఘటన గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద బుధవారం జరిగింది. అద్దంకి నుంచి ద్విచక్రవాహనంపై ఒంగోలు వెళుతుండగా కారును అధిగమించబోయి అదుపుతపింది. ఈప్రమాదంలో అద్దంకికి చెందిన పి.శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాగులుప్పలపాడు మార్చి 20: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాసరావు పరిశీలించారు. పోతవరం, బి.నిడమానూరు, చదలవాడ, మద్దిరాలపాడు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బి.నిడమానూరులో పదో తరగతి పరీక్షా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రమోద్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

మద్దిపాడు, మార్చి 20: ఎన్నికల నియమావళిపై సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శంకర్ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మా ఊరి రాజకీయాల్లో మీకేం పని?

మంత్రి కొడుకు సమావేశం నిర్వహిస్తుండగా గొడవపడిన వైసీపీ వర్గీయులు ● కొండపికి చెందిన ఇద్దరిపై దాడి ● కె.ఉప్పలపాడులో ఘటన

కొండపి, మార్చి 20 : మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో ఉన్న కొత్త ఆదిఆంధ్ర కాలనీలో మంత్రి ఆదిమూలపు సురేష్ కొడుకు విశాల్ సమావేశం నిర్వహిస్తున్న సమయంలో వైసీపీ నాయకులు గొడవపడ్డారు. ఇద్దరు యువకులపై మరికొందరు చేయిచేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మంత్రి సురేష్ కొడుకు విశాల్ ఇటీవల మండలంలో పర్యటిస్తున్నారు. గ్రామాల వారీ ఆయా సామాజికవర్గాల వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో కె.ఉప్పలపాడులోని ఇరువర్గాల వైసీపీ నాయకులతో మాట్లాడుకొని గ్రామంలోని పాత ఆదిఆంధ్రకాలనీలో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే కొండపికి చెంది వైసీపీలో కీలకంగా పనిచేస్తున్న ఇద్దరు యువకులు జోక్యం చేసుకొని సమావేశాన్ని కొత్త ఆదిఆంధ్ర కాలనీకి మార్పించినట్లు తెలిసింది. ఆ ఇద్దరిలో ఒకరు సంవత్సరం క్రితం వరకు కొండపిలో డీలర్‌గా పని చేసిన వ్యక్తి కాగా, మరొకరు వైసీపీకి చెందిన యువకుడు. గ్రామంలో జరిగే సమావేశ స్థలాన్ని కొత్త ఆదిఆంధ్రకాలనీకి ఉద్దేశపూర్వకంగా మార్చారని భావించిన పాత ఆదిఆంధ్రకాలనీకి చెందిన వారితో పాటు గ్రామానికి చెందిన మరికొందరు కొండపికి చెందిన యువకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా గ్రామంలో మీరు రాజకీయాలు చేస్తారా? ఇక్కడ మీకేం పని' అని నిలదీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా వాగ్వివాదం చోటుచేసుకొని ఇరువురిపై దాడిచేసినట్లు తెలిసింది. అయితే గొడవ మంత్రి కొడుకు సమావేశం నిర్వహిస్తున్న స్థలానికి కొద్దిదూరంలో జరిగినట్లు చెప్తున్నారు. గ్రామాల వారీ సమావేశాలు నిర్వహిస్తున్న మంత్రి సురేష్ కొడుకు విశాల్‌కు మండలస్థాయి నాయకుడు ఒకరు ముందుగానే తగిన జాగ్రత్తలు చేశారని తెలిసింది.

గ్రామాల్లో పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో గ్రూపులు ఉన్న నేపథ్యంలో ఒక ఊరిలో జరిగే సమావేశాలకు ఇతర గ్రామాల వారిని తీసుకెళ్లవద్దని, ఒక గ్రామం వారు ఇంకో గ్రామ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కొడుకుతోపాటు ఐ ప్యాక్ సభ్యులకు ఆ నాయకుడు సలహా ఇచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ కె.ఉప్పలపాడులో కొండపి యువకులు జోక్యం చేసుకోవడంతో గొడవ జరిగిందని తెలిసింది.

ఓటు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి : పీడీ



మానవహారం చేపట్టిన ఉద్యోగులు, సిబ్బంది

టంగుటూరు, మార్చి 20 : ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని డ్వామా పీడీ బి.అర్జునరావు ఓటర్లకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సూరారెడ్డిపాలెంలో డ్వామా ఆధ్వర్యంలో బుధవారం ఓటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పీడీ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటు వేయాలన్నారు. ప్రతి కేంద్రంలో 100 శాతం పోలింగ్ జరిగేలా సహకరించాలని కోరారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీఎల్వోలంతా ఓట్ల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. ఈసందర్భంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డ్వామా ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ మేనేజర్ పి.వెంకటస్వామి, ఏపీవో సుభాషిణి, డ్వామా అధికారి మధుసూదనరావు, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి : ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని కొండపి పంచాయతీ పరిధిలోని గొడుగులపాలెం అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త కాటూరి ప్రమీల సూచించారు. బుధవారం కేంద్రం పరిధిలోని గర్భిణుల, బాలింతలు, తల్లులకు ఓటుప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియారాణి, సీడీపీవో మాధవీలత పాల్గొన్నారు.

సువిధ పోర్టల్, సి-విజిల్‌పై అవగాహన



సమావేశంలో పాల్గొన్న ఈఆర్వో, తహసీల్దార్లు, నాయకులు

కొండపి, మార్చి 20 : ఎన్నికల నేపథ్యంలో సువిధ పోర్టల్, సి-విజిల్ యాప్‌లపై రాజకీయ పార్టీల నాయకులకు ఈఆర్వో ఎ.కుమార్ అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, పార్టీలు ఏవైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న విషయాలను సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. 85 సంవత్సరాల పైబడిన వారు ఇంటి వద్దే ఓటు వేసే విధానం గురించి పార్టీల నాయకులకు వివరించారు. సమావేశంలో తహసీల్దార్లు బి.కిరణ్‌కుమార్, చక్రవర్తి, సుందరమ్మ, సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్, సీపీఐ మండల కార్యదర్శి ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

తొలిరౌండ్ పొగాకు అమ్మకాలు పూర్తి

కొండపి, మార్చి 20 : కొండపిలోని వేలం కేంద్రంలో తొలిరౌండ్ పొగాకు అమ్మకాలు బుధవారంతో పూర్తయ్యాయని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. రెండో రౌండ్ గురువారం నుంచి మొదలవుతుందన్నారు. అందులో బ్యారన్‌కు 4 బేళ్ల చొప్పున విక్రయాలకు అనుమతించామన్నారు. రైతులు గ్రేడింగ్ సరిగా చేసుకుని బేళ్లను వేలానికి తీసుకువచ్చి గిట్టుబాటు ధరలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇసుక దర్శి కొండపై మంటలు

మార్టూరు, మార్చి 20 : ఇసుక దర్శి కొండపై బుధవారం రాత్రి మంటలు కనిపించాయి. ఈ కొండపై ఎర్ర మట్టిని తవ్విన గుంతలు ఉన్నాయి. ఇంకా చెట్లు చేమలు ఉన్నాయి. అయితే సాయంత్రం ఈ కొండపై మంటలు ప్రజలకు కన్పించాయి. కొండపై ఎవరైనా కావాలనే నిప్పు పెట్టారా లేదా అనుకోకుండా మంటలు చెలరేగాయా అని ప్రజలు అంటున్నారు. రాత్రి సమయానికి కొండకింది నుంచి వ్యాపించిన మంటలు కొండపైకి చెలరేగాయి. మేకలను కొండపైకి మేపుకోవడానికి వెళ్లినవారు పొరపాటున సిగిరెట్ లేదా బీడీని పడేసి ఉంటారా.. ఇంకేమైనా జరిగి నిప్పు రాజుకుందా అని చర్చించుకుంటున్నారు. రాత్రి 8 గంటల సమయంలో మంటలు కన్పించాయి.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

చీరాలటౌన్, మార్చి 20 : రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొనడంతో 65 సంవత్సరముల వృద్ధురాలు మృతిచెందిన సంఘటన బుధవారం చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. ఆ వృద్ధురాలు వంగపువ్వు రంగు జాకెట్, బులుగు రంగుపై ఎరుపు ఆకుపచ్చ రంగు డిజైన్ చీర ధరించి ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

రూ.24.8 లక్షల నగదు పట్టివేత



నగదును సీజ్ చేసిన పోలీసులు

ఒంగోలు క్రైం, మార్చి 20: కూలీలకు జీతాలు ఇచ్చేందుకు తీసుకువెళుతున్న సుమారు రూ.25 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఒంగోలు తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి పార్టికల్ బోర్డ్స్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన సిబ్బంది ఒంగోలు నుంచి కందుకూరు కారులో నగదు తీసుకెళుతుండగా పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించిన పోలీసులు సీజ్ చేశారు. వివరాలలోకి వెళితే.. పార్టికల్ బోర్డ్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన సిబ్బంది హోలీ పండగ సందర్భంగా వారి సొంత ఊర్లకు వెళుతున్నారు. వారికి జీతాలు ఇచ్చేందుకు అక్కడ పని చేసే కారు డ్రైవర్ మంత్రి దిలీప్, గుమాస్తా బుటాడ రామ్‌కుమార్ నగరంలోని ఇండస్ట్రీస్‌కు చెందిన కార్యాలయం నుంచి కందుకూరుకు కారులో రూ.24,87,500 నగదు తీసుకెళుతున్నారు. ఈమేరకు పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి నగదు సీజ్ చేసినట్లు తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి తెలిపారు. అనంతరం ఒంగోలు రూరల్ తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు అప్పగించినట్లు ఆయన చెప్పారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఎస్పీ పరమేశ్వరరెడ్డి

చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలకు చేయాలని ఆదేశం

ఒంగోలు క్రైం, మార్చి 20: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున్న ఎస్ఈబీ అధికారులు అప్రమత్తంగా ఉండి మద్యం, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. బుధవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రవాణా కాకుండా చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. గంజాయి రవాణాను అరకట్టాలని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. నాటు సారా తయారీదారులపై, పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నగదు, బంగారం, వెండి అక్రమ మద్యం ఇతర వస్తువులు తరలింపుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్ఈబీ ఈఎస్ రవికుమార్, సీఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రాభివృద్ధి : ఉగ్ర



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు

పీసీపల్లి, మార్చి 20 : వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. మండలంలోని పెదఅలవలపాడు, పెదయిర్లపాడు, లింగన్నపాలెం గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో దివాలా తీసిందన్నారు. లెక్కకు మించి అప్పులు తెచ్చిన జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి పనులు చేయకుండా తన ఖజానాను నింపుకుని ప్రజలనెత్తిన రుణభారాన్ని మోపారని ఆరోపించారు. వస్తువుల ధరలు విపరీతంగా పెంచి అన్ని వర్గాల ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తే జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని రద్దు చేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానన్న జగన్.. ఆ తర్వాత వ్యాపారిగా మారి నాసిరకం మద్యాన్ని విక్రయిస్తూ పేదల కుటుంబాల్లో చిచ్చురేపుతోందని చెప్పారు. రాష్ట్రంతో పాటు కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి సాధించాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు గడ్డం బాలసుబ్బయ్య, కొల్లా శ్రీరాములు, దేవరపు కొండపనాయుడు, కోటపాటి రామారావు, నాయకులు పువ్వాడి నాగరాజు, నాగార్జున, నాగోతు శ్రీనివాసులు, పువ్వాడి బ్రహ్మయ్య, వడ్డెంపూడి వెంకటసుబ్బయ్య, బండారు వెంకట్రావు, ఇంజనీరు రమణయ్య, వడ్డెంపూడి మాలకొండయ్య రాయుడు, గోపిరెడ్డి నరసింహారెడ్డి, ఓంకారం, ఉప్పుగుండ్ల శివరామయ్య, వెంగళాయపల్లి, గుదేవారిపాలెం, నేరేడుపల్లి సర్పంచ్‌లు కరణం తిరుపతయ్య, కనపర్తి శ్యాంసన్, పల్లా మల్లికార్జున్, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, యేల్చూరి బ్రహ్మయ్య, శివశంకర్, పరిమి మాలకొండయ్య, ములకా నాగేశ్వరరావు, వీరపనేని పెద్దన్న, ఏనుగంటి శ్రీను, ఏనుగంటి వెంకయ్య, నాగేంద్రబాబు, కోటపాటి మాల్యాద్రి, రంగస్వామి పాల్గొన్నారు.

సింగరకొండ తిరునాళ్లకు కోడ్ ఆంక్షలు

ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌లకు అనుమతి లేదు

చీరాల డీఎస్పీ ప్రసాద్

అద్దంకి, మార్చి 20 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున సింగరకొండ తిరునాళ్ల నిర్వహణపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ సూచించారు. శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్ల ఈనెల 25వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ ప్రభలపై ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌లకు అనుమతులు లేవని తెలిపారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే వ్యక్తులు పార్టీల జెండాలను కట్టవద్దని ఆయన సూచించారు. తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు సుమారు 750 నుంచి 800 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న పనులను అధికారులు సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల ఈవోలు సుభద్ర, కోటిరెడ్డి, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, సీఐ కృష్ణయ్య ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

అద్దంకి, మార్చి 20 : అద్దంకి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రి భద్రపరిచేందుకు అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌ను బుధవారం అధికారులు పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీల్ కుమార్, చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, తహసీల్దార్ మహబూబ్ సుభాని, సీఐ కృష్ణయ్య, ఆర్ఐ శంకర్ తదితరులు ఉన్నారు.

రోటావేటర్‌లో పడి రైతుకు గాయాలు

అద్దంకి, మార్చి 20 : దున్నేందుకు సిద్ధమైన రోటావేటర్‌లో పడి రైతు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చినకొత్తపల్లికి చెందిన మానం తిరుపతయ్య తన పొలాన్ని దున్నేందుకు బుధవారం ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్లారు. రోటావేటర్‌తో పొలం దున్నేందుకు సిద్ధమవుతున్న తరుణంలో తిరుపతయ్యకు ఫోన్ రావడంతో మాట్లాడేందుకు తిరుపతయ్య పక్కకు వెళ్లారనుకొని డ్రైవర్ ట్రాక్టర్‌ను ముందుకు కదిలించాడు. దీంతో తిరుపతయ్య రోటావేటర్‌లో పడడంతో గాయపడ్డారు. విజయవాడ సమీపంలోని ఆసుపత్రికి ఒక కాలి పాదాన్ని తొలగించారు. రెండవ కాలి పాదం కూడా నుజ్జునుజ్జయింది.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కారంచేడు(పర్చూరు), మార్చి 20 : కారంచేడు గ్రామంలోని శ్రీ భూ స మేత వేంకటేశ్వరస్వామి వారి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి 26 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా అభయాంజనేయ విగ్రహావిష్కరణ

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 20: యద్దనపూడి మండలం యనమదలలో బుధవారం అభయాంజనేయ స్వామి సుధా విగ్రహ ఆవిష్కరణ వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొండవీటి జ్యోతిర్మయి విచ్చేశారు. స్వామి వారి వి గ్రహ ప్రతిష్ఠ అనంతరం జ్యోతిర్మయి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అన్నమాచార్యుల సంకీర్తనలను పాడి, వాటి గొప్పతనాన్ని భక్తులను అలరించారు. వెంకటేశ్వరస్వామి వారి ప్రాసస్త్యాన్ని వివరించారు.

కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు

● ఆర్డీవో జాన్‌ఇర్విన్

కనిగిరి, మార్చి 20 : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన రాజకీయపార్టీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో జాన్‌ఇర్విన్ చెప్పారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నేతలతో బుధవారం జరిగిన సమావేశంలో ఎన్నికల కోడ్ అమలుతీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ పాటించాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఓట్లు రాబట్టుకునేందుకు కుల, మత, వర్గ భావాలను ప్రజలపై ఉపయోగించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, ఊరేగింపులు, సమావేశాలపై పూర్తి సమాచారంతో ముందుగానే అనుమతి పొందాలన్నారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ ఉన్నందున ఒక పార్టీ వారు మరోపార్టీ వారిని బహిరంగంగా నిందించినా, ప్రాతినిధ్యం వహించే వ్యక్తులకు చెందిన చిత్రపటాలను దహనం కానీ ఆయా పార్టీల జెండాలను అవమానపరిచే విధంగా వ్యవహరించినా తీవ్రంగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒక పార్టీ వారు నిర్వహించే సభలు, సమావేశాలను మరోపార్టీ వారు నేరుగా అడ్డుకున్నా వారిపై కూడా కోడ్ ఉల్లంఘన వస్తుందన్నారు. మైకులతో, ర్యాలీతో ఎలాంటి క్యాంపెయిన్ చేయరాదని చెప్పారు. రాజకీయ పార్టీ గుర్తులతో కూడిన హోర్డింగ్‌లు, బోర్డులు, బ్యానర్లు, జెండాలను బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించకూడదని చెప్పారు. సమావేశంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, వైసీపీ నాయకులు షేక్ అబ్దుల్‌గఫార్, దేవకి వెంకటేశ్వర్లు, వైఎం.ప్రసాద్‌రెడ్డి, బీజేపీ, బీఎస్పీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ గ్రామస్థాయి ఆత్మీయ సమావేశాలు

టంగుటూరు, మార్చి 20 : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి ఆత్మీయ సమావేశాలు గురువారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య హాజరుకానున్నారు. తొలి రోజు కార్యక్రమ షెడ్యూల్‌ను పార్టీ నాయకులు ప్రకటించారు. ఆ ప్రకారం గురువారం ఉదయం 10గంటలకు వాసేపల్లిపాడు, 11గంటలకు వల్లూరు, 12గంటలకు శివపురం, మధ్యాహ్నం 12.30గంటలకు కారుమంచి, 2గంటలకు సూరారెడ్డిపాలెంలో సమావేశాలు జరుగుతాయి. మధ్యాహ్నం 3గంటలకు మల్లవరప్పాడు, 3.30గంటలకు కందులూరు, 4.30గంటలకు మర్లపాడు, 5.30 గంటలకు ఎం.నిడమలూరు, సాయంత్రం 6గంటలకు పొందూరు, రాత్రి 7.30 గంటలకు కొణిజేడులో సమావేశాలు నిర్వహించనున్నారు. టీడీపీ శ్రేణులంతా గ్రామాల్లో అందుబాటులో ఉండి హాజరుకావాలని ఆపార్టీ నియోజకవర్గ నాయకులు కోరారు.

ప్రశాంతంగా పది ఇంగ్లీషు పరీక్ష

ఒంగోలు (విద్య), మార్చి 20: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ఇంగ్లీషు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 424 మంది గైర్హాజరయ్యారు. 29,392 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 28,968 మంది హాజరయ్యారు. పరిశీలకులు ప్రసన్నకుమార్ పొదిలి అల్ఫా, నిర్మలా హైస్కూల్లో, గొట్లగట్టు, పిటకాయగుళ్ల జడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను సందర్శించారు. జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర ముండ్లమూరు జడ్పీ హైస్కూలు, కురిచేడు ఏపీఎస్‌డబ్ల్యు హైస్కూల్, త్రిపురాంతకం హైస్కూల్‌లోని రెండు కేంద్రాలు మేడపి జడ్పీ హైస్కూలు పరీక్షా కేంద్రాల్ని సందర్శించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



ఇంట్లో కాలిపోయిన సామగ్రి

ఒంగోలు క్రైం, మార్చి 20: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిన సంఘటన ఒంగోలు నగరం వంగవూరురోడ్డులో గల హైదరాబాద్ బిర్యానీ పాయింట్ ఎదురు రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగింది. రేకుల షెడ్‌లో అద్దెకు ఉంటూ ఇళ్లలో పనులు చేసుకుంటున్న బీబీజాన్ తన కుమారుడిని చదివించుకుంటూ జీవిస్తుంది. అగ్నిప్రమాదంలో రేకులషెడ్ కాలిపోవడంతో ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, కుమారుడు బాషా సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారుగా రూ.2లక్షల విలువైన సామగ్రి కాలిపోయాయని బాధితులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం మంటలను అదుపు చేసింది.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రాయదుర్గం/ హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి న్యాయస్థానం 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.6 వేల జరిమానా విధించింది. ప్రకాశం జిల్లా నందనవనం గ్రామానికి చెందిన మీదసాల శివకృష్ణ(22) గచ్చిబౌలిలో ఉంటూ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి ఇంటికి సమీపంలో ఉన్న మైనర్ బాలికపై 2014లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు శివకృష్ణను అరెస్ట్ చేసి దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం రాజేంద్రనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి అంజనేయులు 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. అంతేకాకుండా బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు.

27న రంగస్థల దినోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 20: ప్రపంచ రంగస్థ దినోత్సవం ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు శ్రీ నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లిఖార్జునరావు, కనమాల రాఘవు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు ఇతర సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు చందు డాన్స్ అకాడమీ నృత్య ప్రదర్శనలు, అనంతరం భక్త చింతామణి, శ్రీ రామాంజనేయయుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాలలోని వివిధ ఘట్టాల ప్రదర్శన ఉంటాయన్నారు. నగరానికి చెందిన వివిధ ప్రముఖులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని ప్రజలు, నాటకాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమలో లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, చిటితోటి బాబురావు, కొప్పోలు వెంకటేశ్వర్లు, దేవరశెట్టి సింగయ్య, గుంటూరు సత్యనారాయణ, ఆదిపూడి నరేంద్ర, గోదాసు సుబ్బారావు, పిల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఏడు గడ్డివాములు దగ్ధం

చీరాలటౌన్, మార్చి 20 : ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలు కారణంగా ఏడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈఘటన బుధవారం చీరాల పట్టణం హరిప్రసాద్ నగర్‌లో జరిగింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్యవైశ్యులు నా కుటుంబసభ్యులు

టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి

ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముత్తుముల దంపతులు

గిద్దలూరు టౌన్, మార్చి 20 : ఆర్యవైశ్యులతో తాము కుటుంబ సభ్యులుగా ఉంటామని గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పీఆర్‌ఆర్ ప్లాజా సమీపంలోని వాసవి నగర్‌లో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఆయన భార్య పుష్పలీల ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని, పట్టణంలో తాగు నీటి సమస్యను పరిష్కరించానని గుర్తు చేశారు. వ్యాపారాలు చేసుకునే ఆర్యవైశ్యులకు సమస్య వచ్చినపుడు తాను అండగా ఉన్నానని తెలిపారు. స్థానికంగా నివాసం ఉండే తనకు మద్దతుగా నిలిచి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పడుతుందని, తద్వారా గిద్దలూరు ప్రాంతం వ్యాపారపరంగా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో టీడీపీ అధికారంలోకి రాగానే పూర్తవుతుందని, తద్వారా నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీరడంతో పాటు రైతులకు సాగునీరు అందుతుందన్నారు. వైసీపీ సచివాలయ కన్వీనర్ వాడకట్టు రామాంజనేయులుతోపాటు ఆర్యవైశ్యులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ముత్తుముల అశోక్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యులంతా కలిసికట్టుగా పనిచేసి గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్‌రెడ్డిని గెలిపిద్దామని వారంతా పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మవారిశాల గౌరవాధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, ఆర్యవైశ్య నాయకులు ఆరవీటి సత్యం (జిలకర), లక్ష్మీనారాయణ, సుబ్రమణ్యం (టీవీఎస్), నటుకుల శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి


వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఆర్యవైశ్యులకు పార్టీ కండువా కప్పుతున్న అశోక్‌రెడ్డి

దోపిడీ, అరాచక పాలనకు అంతం పలుకుదాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మార్చి 20: రాష్ట్రంలో దోపిడీ, అరాచక పాలనకు అంతం పలుకుదామని మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని ఆయన నివాసంలో మార్కాపురం, తర్లుపాడు మండలాల తెలుగుదేశం పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు తమ పరిధిలోని బూత్‌లలో ప్రతి ఇంటికీ వెళ్లి వైసీపీ అరాచకాలు గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయకపోతే మార్కాపురం ప్రత్యేక జిల్లా రాదని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందుల


మాజీ ఎమ్మెల్యే కందుల సమక్షంలో టీడీపీలో చేరుతున్న ముస్లింలు

బలవంతంగా వైసీపీ కండువాలు వేశారు

● మళ్లీ కందుల సమక్షంలో టీడీపీలో చేరిక

మార్కాపురం రూరల్ : పట్టణంలోని 13వ వార్డుకు చెందిన షేక్ సలాం కుటుంబ సభ్యులను వైసీపీ నాయకులు పిలిచి బలవంతంగా వారికి కండువాలు వేశారని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. అయితే సలాం కుటుంబ సభ్యులు తన వద్దకు వచ్చి మళ్లీ తెలుగుదేశం పార్టీ కండువాలు వేయించుకున్నారని, వారు మొదటి నుంచి టీడీపీతోనే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

కంభం, మార్చి 20 : కంభం మండలంలో నిర్వహిస్తున్న పబ్లిక్ పరీక్షలు, ఓపెన్ సొసైటీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖాధికారులు బి.మాల్యాద్రి, కె.శార్వాణిలు తెలిపారు. బుధవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ పరీక్షలలో కాపీలకు సంబంధించిన కథనాలు పత్రికలలో వచ్చిన నేపథ్యంలో స్క్వాడ్ సభ్యులు, డిప్యూటీ డీఈవో, జిల్లా పరిశీలకులు, ఎంఈవోలు బృందాలుగా ఏర్పాటై మండలంలోని అన్ని కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, ఏమైనా సమస్యలు గుర్తించిన వెంటనే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవోలు మాల్యాద్రి, శార్వాణి

కంభంలో ప్రెస్‌మీట్‌అంటూ జారుకున్నారు

కాగా కంభం మండలం రావిపాడు జడ్పీ హైస్కూలులో జరుగుతున్న ఇంటర్ ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించిన జిల్లా పరీక్షల నిర్వహణ పరిశీలకులు, ప్రత్యేక అధికారి ప్రసన్నకుమార్ బుధవారం రావిపాడు సెంటర్‌ను తనిఖీ చేశారు. అనంతరం కంభం ఎంఈవో ఆఫీసులో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేయండి వస్తున్నానని మండల ఎంఈవోలకు చెప్పడంతో వారు స్థానిక విలేకరులకు సమాచారం ఇచ్చారు. విలేకరులు ఎంఈవో కార్యాలయానికి వచ్చారు. సదరు అధికారి ఎంతసేపటికి రాకపోవడంతో ఎంఈవో మాల్యాద్రి ఫోన్ చేయగా రావిపాడులో ప్రెస్‌మీట్ పెట్టాశాను అని చెప్పడంతో విలేకరులంతా కంభం ఎంఈవో ఆఫీసులో మీ కోసం ఎదురూ చూస్తున్నారని చెప్పగా మీరే ప్రెస్‌మీట్‌లో మాట్లాడండి అని చెప్పారు. దీనిపై స్థానిక విలేకరులు ఎంఈవోలను నిలదీశారు.

15 మంది విద్యార్థులు గైర్హాజరు

త్రిపురాంతకం, మార్చి 20: పదోతరగతి పరీక్షలలో మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో బుధవారం మొత్తం 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. త్రిపురాంతకం జడ్పీ పాఠశాల (ఏ) కేంద్రంలో 184 మందికి 174 మంది, బి కేంద్రంలో 119 కి 117 మంది హాజరయ్యారు, గణపవరం గురుకుల పాఠశాలలో 139 కి 138 మంది విద్యార్థులు, దూపాడు బాలికల గురుకుల పాఠశాలలో 135 కి 134 మంది, మేడపి జడ్పీ పాఠశాల కేంద్రంలో 95 మందికి 94 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కాగా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్ద దోర్నాలలో

పెద్ద దోర్నాల : మండల కేంద్రంలోని 3 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదవ తరగతి ఆంగ్లం పరీక్షకు బుధవారం 9 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు ఎంఈవో మస్తాన్ నాయక్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 257 మంది విద్యార్థులకు గానూ 249 మంది, వసంత జూనియర్ కళాశాలలో 250 మందికి గానూ 249 మంది, రవీంద్ర హైస్కూలులో 153 మందికి గానూ 153 మంది హాజరవ్వగా మొత్తం 660 మందికి గానూ 651 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయినట్లు ఆయన తెలిపారు.


వేదపాఠశాల భవనాలకు ప్రత్యేక హోమాలు చేస్తున్న పీఠాధిపతులు

వేదపాఠశాల భవనాలు ప్రారంభం

పొదిలి, మార్చి 20 : మండలంలోని ఓబులక్కపల్లి గ్రామాన్ని సనాతన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్మాణం జరుపుకుంటున్న నూతన వేదపాఠశాల భవనాలను కంచికామకోటి పీఠాధిపతులు, వేదపండితుల మంత్రోచ్ఛరణతో బుధవారం ప్రారంభించారు. ఈప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఎంతో తోడ్పడుతుందన్నారు. భవన సముదాయాల్లో స్కిల్‌డెవ్‌మెంట్‌తోపాటు వివిధ రకాల క్లాసులు జరపనున్నట్లు వారు తెలిపారు. తొలివిడతగా 6, 7 తరగతులలో పాఠాలు బోధించనున్నట్లు చెప్పారు. మలి విడతలో 6నుంచి 12 తరగతులు వరకు సెంట్రల్ సిలబస్ బోధించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భవనాల వద్ద 27 నక్షత్రాల మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో కంచిపీఠం ప్రతినిధులు గుడా రామ్మోహన్, కోఆర్డినేటర్ ప్రభాకర్, మాచవరం మణి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ సొంత గ్రామంలో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన 50 కుటుంబాలు

పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, మార్చి 20: మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. బుధవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో పుల్లలచెరువు మండలం వెంకటరెడ్డిపల్లె గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 50 కుటుంబాలకు వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మండల మాజీ కన్వీనరు, ఏఎంసీ మాజీ చైర్మన్ సొంత గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ప్రారంభం అవడంతో ఆ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో కనీసం గ్రామంలో తట్ట మట్టి పోయలేదని అన్నారు. మంచి నీటి సమస్య తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు.వైసీపీ పాలనలో దాచుకోవడం, దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య, గజ్జేల్లి భాస్కర్, కె కుమార్, మేడికొండ లక్ష్మీనారాయణ, మానేపల్లి, కవలకుంట్ల సర్పంచులు రమణారెడ్డి ,వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వెంకటరెడ్డిపల్లె గ్రామస్థులకు కండువా వేస్తున్న వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన

గిద్దలూరు, మార్చి 20 : ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని మెప్మా సిటీమిషన్ మేనేజర్ ఎ.ప్రసాద్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు వినియోగించుకుంటామని రిసోర్స్‌పర్సన్లచే ప్రమాణం చేయించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్వయంసహాయక సంఘ సభ్యులు, వారి కుటుంబీకులు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుని పోలింగ్ శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బెల్లం రమాదేవి, కమ్యూనిటీ ఆర్గనైజర్ షైమున్నీసా, డీఈవో వేణుగోపాల్‌రావు, ఎస్‌ఎల్‌ఎఫ్ రిసోర్స్‌పర్సన్స్, టీఎల్‌ఎఫ్ రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.


మార్కాపురంలో మహిళలతో ప్రతిజ్ఞ చేస్తున్న ఏపీఎం రమేష్ బాబు

మహిళలు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

కొమరోల : ప్రతి మహిళ తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీపథకం ఏపీవో మహాలక్ష్మి అన్నారు. స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆవరణలో ఉపాధిహామీపథకం ఐకేపీ ఆధ్వర్యంలో సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎన్‌రోల్ పాటిస్పెట్ అనే కార్యక్రమం ద్వారా మహిళలకు ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళ ఓటును ఒక అయుధంగా చేసుకుని మంచి నాయకున్ని ఎన్నుకునే స్వేచ్ఛ ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. నా ఒక్క ఓటుతో ఏమవుతుందనే నిర్లక్ష్యాన్ని వదిలి ప్రతి ఒక్కరూ ఓటువేయాలన్నారు. అప్పుడే ప్రజాస్వామ్యంలో గుర్తింపు వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో పాండురంగప్రసాదు, వీవోలు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న రిసోర్స్‌పర్సన్స్

మార్కాపురంలో..

మార్కాపురం రూరల్ : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వైకేపీ ఏపీఎం రమేష్ బాబు అన్నారు. మండలంలోని పెద్దనాగులవరంలో ఓటు హక్కుపై గ్రామంలోని మహిళలకు అవగాహన, ర్యాలీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత మహిళతో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వీవోఏ శాంత కుమారి, బాబు, స్వయం సహాయ సంఘ మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

డీఎస్పీ బాల సుందరరావు

మార్కాపురం రూరల్, మార్చి 20: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని మార్కాపురం డీఎస్పీ బాల సుందరరావు కోరారు. మండల పరిధిలోని పెద్దనాగులవరం గ్రామంలో బుధవారం కేంద్ర, రాష్ట్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలలో ఎవరికి వారు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకొనే వాతావరణం కల్పిస్తామన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. గ్రామంలో వర్గవిభేదాలు లేకుండా మీకు నచ్చిన వ్యక్తులకు ఓటు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, గ్రామీణ ఎస్ఐ వెంకటేశ్వర్ నాయక్, వైకేపీ ఏపీఎం రమేష్ బాబు, డీఆర్‌డీఏ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పెద్ద నాగులవరం గ్రామంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందరరావు

చాంపియన్‌షిప్ పోటీలు

గిద్దలూరు, మార్చి 20 : భీమవరం పట్టణంలో జరిగిన ఆల్ ఇండియా స్థాయి సీనియర్స్ టెన్నిస్ ర్యాకింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో గిద్దలూరుకు చెందిన కంచర్ల కోటయ్యగౌడ్ పాల్గొన్నారు. 65 ప్లస్ ఏజ్‌గ్రూప్ క్వాలిఫైయింగ్ పోటీలలో హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారులను 9-1 స్కోరు తేడాతో ఓడించి మెయిన్‌డ్రాకు అవకాశం పొందినప్పటికీ మొదటి రౌండ్‌లో రిటైర్డ్ అడిషనల్ ఏఎస్‌పీ రజాక్‌తో పోరాడి పరాజయం పొందారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

పట్టణంలోని మానసిక వికలాంగుల పాఠశాలకు చిన్ని సేవా సంస్థ ఆధ్వర్యంలో డి.బాలకృష్ణ దాత ద్వారా నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈకార్యక్రమంలో చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, యోగా గురూజీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న వీఓఏ శిరీష (వృత్తంలో)

వైసీపీ ప్రచారంలో వీఓఏ

ఒంగోలు, మార్చి 20: కొమరోలులోని బ్రాహ్మణ బజార్, సుంకరిబజార్‌లో బుధవారం నిర్వహించిన వైసీపీ ప్రచారంలో మండలంలోని రాజుపాలెం గ్రామసంఘ సభ్యురాలు (వీఓఏ) శిరీష పాల్గొని ప్రచారం చేశారు. రాజకీయ పార్టీల ప్రచారంలో ప్రభుత్వ, అనుబంధ సభ్యులతో నిర్వహిస్తున్న ఉద్యోగులు పాల్గొనకూడదని ఎన్నికల సంఘం పేర్కొంది. కొమరోలు ఐకేపీ ఏపీఎం తన సిబ్బందికి పలుమార్లు ఎన్నికల ప్రచారంలో ఎట్టిపరిస్థితుల్లోనూ పాల్గొనరాదని తెలియచేశామని కూడా తెలిపారు.

వ్యర్థాలతో నిండిన పంట కాలువలు

పేరుకుపోతున్న చెత్తాచెదారం

పంట కాలువలోకి మురుగుదొడ్ల కనెక్షన్లు

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కంభం, మార్చి 20 : చారిత్రాత్మక కంభం చెరువు నుంచి పంట పొలాలకు నీటిని అందించే సప్లై చానళ్ళు అన్నీ మురుగు కాలువలుగా మారాయి. చెరువు నుంచి సుమారు 20 ప్రధాన పంట కాలువలు ఉండగా వాటి నుంచి మరో 30కిపైగా సప్లై చానళ్ళు ఉన్నాయి. ఈ కాలువలన్నీ వ్యర్థాలతో నిండిపోయాయి. పట్టణంలోని వీధుల నుంచి ప్రవహించే ఈ కాలువల్లోకి ప్రజలు మురికినీటిని యథేచ్ఛగా పంట కాలువల్లోకి వదులుతున్నారు. మరికొంత మంది మరుగుదొడ్ల కనెక్షన్లు కూడా ఈ కాలువల్లోకే ఇచ్చారు. దీనితో చెత్తాచెదారం, వ్యర్థాలు పంట కాలువల్లో పేరుకు పోతున్నాయి. కాలుష్యం పెరిగి ముక్కులు అదిరేలా దుర్వాసన, దోమలు అధికంగా మారడంతో సమీప కుటుంబాల వారు రోగాల బారిన పడుతున్నారు. వీటిలో పందులు చేరి మరింత అపరిశుభ్రంగా మార్చుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు కాలువల శుభ్రత పేరుతో లక్షలు ఖర్చు చేసినా మురుగు ఎక్కడికక్కడే కనిపిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. రావిపాడుకు వెళ్ళే పంట కాలువ, వాసవి పాఠశాల వద్ద ఉన్న పంట కాలువల నిండా గుర్రపు డెక్క పెరిగి నీరు వెళ్ళడం లేదు. స్టార్ సినిమా హాలు, ఆర్టీసీ బస్టాండ్ ముందు వైపు తదితర పంట కాలువలన్నీ మురికి కాలువలుగా చెత్తాచెదారంతో పేరుకుపోయాయి. ఇరిగేషన్ అధికారులు ఈ పంట కాలువలను శుభ్రం చేయించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ పంట కాలువల్లోని నీటిలో చేతులు పెడితే బొబ్బలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు.


గుర్రపు డెక్కతో నిండిన సప్లై చానల్


మురుగు కాలువను తలపిస్తున్న ప్రధాన పంట కాలువ


గంగుపల్లిలో పట్టుకున్న గంజాయి గురించి వివరిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

గంగుపల్లిలో గుప్పుమన్న గంజాయి

● సాగు చేస్తున్న రైతు పొలంపై ఎస్‌ఈబీ దాడి

●282 మొక్కలను స్వాధీనం

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), మార్చి 20: మండలంలోని గంగుపల్లిలో గంజాయి సాగు గుట్టు రట్టు అయ్యింది. కొన్నాళ్ళుగా గుట్టుగా సాగు చేస్తున్న గంజాయి సాగు బయటపడింది. బుధవారం మండలంలోని గంగుపల్లిలో ఏస్‌ఈబీ అధికారులు దాడులు చేసి 282 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.ఎస్‌ఈబీ సీఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గంగుపల్లిలో గంజాయి సాగు చేస్తున్నారన్న ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు సర్వే నెం.359/2లో 5 ఎకరాలు భూమిలో కె. బ్రహ్మయ్య అనే రైతు కంది సాగు చేశాడు. అందులోనే కంది మొక్కల మధ్యలో 282 మొక్కలను నాటి అక్రమంగా సాగు చేస్తున్నాడని తెలిపారు. రైతును త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.గంజాయి పెంపకం తీవ్ర నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్ఐ, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం


కాలిపోతున్న పొగాకు బ్యారన్

పొదిలి, మార్చి 20 : మండలంలోని మాదాలవారిపాలెం గ్రామంలో పొగాకు బ్యారన్ దగ్ధమైంది. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నుగ్గు శ్రీనివాసులు అనే రైతు పొగాకు క్యూరింగ్ జరుపుతున్న సమయంలో ఉన్నట్లుండి ఒక్కసారిగా మంటలు ఎగసాయి. మొత్తం బ్యారన్‌లో 1,250 కర్ర కాలిపోయింది. నోటికాడికి వచ్చిన పొగాకు బుగ్గిపాలు కావడంతో రైతు ఆవేదనకు గురయ్యాడు. కనిగిరి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపు చేశారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

మార్కాపురం రూరల్, మార్చి 20: మండలంలోని వేములకోట గ్రామంలో బుధవారం అక్రమంగా అమ్ముతున్న పది మద్యం ఫుల్ బాటిళ్లను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఓ ఇంట్లో విక్రయం కోసం నిల్వ ఉంచిన కాసీం వలి అనే వ్యక్తి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు సెబ్ ఎస్ఐ గోపి తెలిపారు.

వడ్డీరాయితీ పొందాలి

గిద్దలూరు, మార్చి 20 : 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నుపై వడ్డీ రాయితీ ఉన్న దృష్ట్యా నెలాఖరులోగా పన్ను చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాలలో కూడా పన్ను చెల్లించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలపై పన్నులు, నీటి పన్ను చెల్లించి సహకరించాలని కోరారు.



నిర్మాణం పూర్తిగాని గ్రామ సచివాలయం (ఇన్‌సెట్లో) తలుపులు లేని పై అంతస్తు, ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి (ఫైల్)

రాజకీయ లబ్ధికోసమే.. అసంపూర్తి సచివాలయ ప్రారంభం

● నేటికీ ఎక్కడి పనులు అక్కడే

● ఇబ్బందులు పడుతున్నఉద్యోగులు, ప్రజలు

తర్లుపాడు, మార్చి 20: సచివాలయ నిర్మాణ పనులు పూర్తి కాకుండానే ప్రారంభించటం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. తర్లుపాడు సచివాలయం భవనం అసంపూర్తిగా ఉన్నా గత నెల 10న మార్కాపురం ఎమ్మెల్యే, ప్రస్తుత గిద్దలూరు వైసీపీ సమన్వయకర్త కుందురు నాగార్జునరెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. శిలాఫలకంలో అధికార పార్టీ నాయకుల పేర్ల కోసమే ఎమ్మెల్యే సచివాలయాన్ని ప్రారంభించారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. సచివాయలంలో కనీసం ఫ్లోరింగ్ లాగలేదు. విద్యుత్ పనులు చేయలేదు. తలుపులు, కిటికీలు బిగించకుండా సచివాలయాన్ని ప్రారంభించటంలో ఉన్న ఆంతర్యం ఏమిటంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గత 40 రోజుల నుంచి సచివాలయ నిర్మాణ పనులు ఎక్కడ గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. దీంతో సచివాలయ ఉద్యోగులు పాత డిపెప్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాలలో కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. దీంతో ఉద్యోగులు, వివిధ పనుల కోసం వెళ్లిన ప్రజలు ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి నెలకొంది.

వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రాభివృద్ధి

కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

పీసీపల్లి మండలంలో వైసీపీ నుంచి పలువురి చేరిక

పీసీపల్లి, మార్చి 20 : వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. మండలంలోని పెదఅలవలపాడు, పెదయిర్లపాడు, లింగన్నపాలెం గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో దివాలా తీసిందన్నారు. లెక్కకు మించి అప్పులు తెచ్చిన జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి పనులు చేయకుండా తన ఖజానాను నింపుకుని ప్రజలనెత్తిన రుణభారాన్ని మోపారని ఆరోపించారు. వస్తువుల ధరలు విపరీతంగా పెంచి అన్ని వర్గాల ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తే జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని రద్దుచేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్యపాననిషేధం చేస్తానన్న జగన్.. ఆ తర్వాత వ్యాపారిగా మారి నాసిరకం మద్యాన్ని విక్రయిస్తూ పేదల కుటుంబాల్లో చిచ్చురేపుతోందని చెప్పారు. రాష్ట్రంతో పాటు కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి సాధించాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు గడ్డం బాలసుబ్బయ్య, కొల్లా శ్రీరాములు, దేవరపు కొండపనాయుడు, కోటపాటి రామారావు, నాయకులు పువ్వాడి నాగరాజు, నాగార్జున, నాగోతు శ్రీనివాసులు, పువ్వాడి బ్రహ్మయ్య, వడ్డెంపూడి వెంకటసుబ్బయ్య, బండారు వెంకట్రావు, ఇంజనీరు రమణయ్య, వడ్డెంపూడి మాలకొండయ్య, రాయుడు, గోపిరెడ్డి నరసింహారెడ్డి, ఓంకారం, ఉప్పుగుండ్ల శివరామయ్య, వెంగళాయపల్లి, గుదేవారిపాలెం, నేరేడుపల్లి సర్పంచ్‌లు కరణం తిరుపతయ్య, కనపర్తి శ్యాంసన్, పల్లా మల్లికార్జున్, కనిరెడ్డి ఓబుల్‌రెడ్డి, యేల్చూరి బ్రహ్మయ్య, శివశంకర్, పరిమి మాలకొండయ్య, ములకా నాగేశ్వరరావు, వీరపనేని పెద్దన్న, ఏనుగంటి శ్రీను, ఏనుగంటి వెంకయ్య, నాగేంద్రబాబు, కోటపాటి మాల్యాద్రి, రంగస్వామి పాల్గొన్నారు.


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు

బాధిత కుటుంబానికి టీడీపీ నేత సహాయం


మృతుడి భార్యకు నగదు అందిస్తున్న వెంకన్నచౌదరి

దొనకొండ, మార్చి 20 : మండలంలోని భూమనపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మిరియాల వెంకటేశ్వర్లు గుండెపోటుకు గురై ఇటీవల మృతిచెందాడు. మండల టీడీపీ నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి బుధవారం భూమనపల్లిలోని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖర్చుల నిమిత్తం మృతుడు భార్య గురవమ్మకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుగ్గెంపూడి కోటేశ్వరరావు, విప్పర్ల శేషు, విప్పర్ల వెంకటరామయ్య, బత్తిన రామసుబ్బయ్య, యర్రగుంట్ల శ్రీరామయ్య, యర్రగుంట్ల సుబ్బయ్య పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన స్క్వాడ్ అధికారి

తాళ్లూరు, మార్చి 20 : మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను స్క్వాడ్ అధికారి నాగేంద్రకుమార్ బుధవారం తనిఖీ చేశారు. తూర్పుగంగవరం గ్రామంలోని జడ్పీ హైస్కూల్, జాహ్నవి హైస్కూల్ పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి కాపీయింగ్ జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాలలో బుధవారం 844 మంది విద్యార్థులకుగాను 826 మంది హాజరయ్యారని ఎంఈవో జి.సుబ్బయ్య చెప్పారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు, మార్చి 20 : తాళ్లూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రానున్న విద్యాసంవత్సరంలో ఆరు,ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ జి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40సీట్లు, 7, 9 తరగతులలో ఒక్కో సీటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 11వ తరగతి వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటర్ బైపీసీ గ్రూప్‌లో మొదటి సంవత్సరం 40 సీట్లు ఉన్నాయని, సమాచారం కోసం 9515838862, 9515322063 సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలి

దొనకొండ, మార్చి 20 : డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడేలా ప్రణాళికలతో ముందుకు సాగాలని గౌతమీ విద్యాసంస్థల డైరెక్టర్ నాగేంద్రబాబు సూచించారు. దొనకొండ గౌతమీ డిగ్రీ కాలేజీలో 2021-24 బ్యాచ్ విద్యార్థులకు ఫేర్‌వెల్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతోనే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ గోపి, అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని), అధ్యాపకులు రమేష్, వెంకటేశ్వరరెడ్డి, దేవదానం పాల్గొన్నారు.

25 నుంచి శ్రీభాగవత సప్తాహ కార్యక్రమం

పామూరు, మార్చి 20 : స్థానిక పాత పోస్టాఫీస్ ఎదురు శ్రీషిరిడి సాయిబాబా దేవస్థానంలో ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు శ్రీ భాగవత సప్తాహ కార్యక్రమం జరుగుతుందని దేవస్థాన కమిటీ చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవచన కర్తలు కురిమేటి బాలసుబ్రమణ్యం శాస్త్రిచే ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు పోతన భాగవతాన్ని ఉపదేశిస్తారని పేర్కొన్నారు. గ్రామంలో మొదటిసారిగా ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేశామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

అన్నదానానికి నేటితో నాలుగేళ్లు పూర్తి

పామూరు, మార్చి 20 : కరోనా సమయంలో యాచక, అనాథ, నిరుపేదలకు హ్యూమన్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మొదలుపెట్టిన అన్నదాన కార్యక్రమానికి గురువారంతో నాలుగేళ్లు పూర్తయిందని స్థానిక మదర్సా వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ మౌలానాషరీఫ్‌హుసేన్ చెప్పారు. ఇంటర్నేషనల్ హ్యాపీ డేస్ సందర్భంగా బుధవారం స్థానిక మదర్సా మసీదులో పలువురు వృద్ధులకు, అనాథలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ పండుగలో భాగంగా కొత్త దుస్తులు, కొంత నగదును అందజేశారు.

31న జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు

పామూరు, మార్చి 20 : స్థానిక పువ్వాడి కల్యాణ మండపంలో ఈ నెల 31న నిర్వహించనున్న టీడీపీ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్ అమీర్‌బాబు కోరారు. పట్టణంలో పలువురు ముస్లింలను కలిసి ఆత్మీయ సమావేశానికి తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ఖాజారహంతుల్లా, ఆర్ఆర్ రఫీ, షేక్ గౌస్‌బాషా, కోడిగంపల నాయబ్‌రసూల్, తెనాలి మస్తాన్, మాచర్ల రహిమాన్, పత్తు మస్తాన్, మాచర్ల మాబు పాల్గొన్నారు.

దొనకొండలో అధ్వానంగా పారిశుధ్యం

పట్టించుకోని పాలకులు.. ఇబ్బందుల్లో ప్రజలు


సైడుకాల్వల్లో నిలిచిన మురుగునీరు

దొనకొండ, మార్చి 20 : దొనకొండలో కొద్ది నెలలుగా పారిశుధ్యం అధ్వానంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదు. గ్రామంలోని సైడు కాల్వలను నెలల తరబడి శుభ్రం చేయకపోవటంతో మురుగునీరు పారుదల లేదు. కాలువల నుంచి దుర్వాసనలు వెదజల్లుతుండడంతోపాటు దోమలకు నిలయంగా మారాయి. రెండేళ్లుగా బ్లీచింగ్ తదితర పారిశుధ్య పనులు చేపట్టకపోవటం, దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవటం వంటి కారణాలతో దోమలు విజృంభిస్తున్నాయి. వీటి దాడులతో ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామ పంచాయతీ అధికారులకు రెండేళ్లుగా విన్నవించుకుంటున్నా నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ పాలకులు దొనకొండలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు

ఆర్డీవో జాన్‌ఇర్విన్


కోడ్ నియమావళిపై ఆర్డీవోతో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 20 : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన రాజకీయపార్టీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో జాన్‌ఇర్విన్ చెప్పారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నేతలతో బుధవారం జరిగిన సమావేశంలో ఎన్నికల కోడ్ అమలుతీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ పాటించాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఓట్లు రాబట్టుకునేందుకు కుల, మత, వర్గ భావాలను ప్రజలపై ఉపయోగించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, ఊరేగింపులు, సమావేశాలపై పూర్తి సమాచారంతో ముందుగానే అనుమతి పొందాలన్నారు. అదేవిధంగా ఎన్నికల కోడ్ ఉన్నందున ఒక పార్టీ వారు మరోపార్టీ వారిని బహిరంగంగా నిందించినా, ప్రాతినిధ్యం వహించే వ్యక్తులకు చెందిన చిత్రపటాలను దహనం కానీ ఆయా పార్టీల జెండాలను అవమానపరిచే విధంగా వ్యవహరించినా తీవ్రంగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒక పార్టీవారు నిర్వహించే సభలు, సమావేశాలను మరోపార్టీ వారు నేరుగా అడ్డుకున్నా వారిపై కూడా కోడ్ ఉల్లంఘన వస్తుందన్నారు. మైకులతో, ర్యాలీతో ఎలాంటి క్యాంపెయిన్ చేయరాదని చెప్పారు. రాజకీయ పార్టీ గుర్తులతో కూడిన హోర్డింగ్‌లు, బోర్డులు, బ్యానర్లు, జెండాలను బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించకూడదని చెప్పారు. సమావేశంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, వైసీపీ నాయకులు షేక్ అబ్దుల్‌గఫార్, దేవకి వెంకటేశ్వర్లు, వైఎం ప్రసాద్‌రెడ్డి, బీజేపీ, బీఎస్పీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకెంతో మేలు

15వ వార్డులో ఇంటింటి ప్రచారం చేసిన టీడీపీ నేతలు


సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేస్తున్న తెలుగుమహిళలు, నేతలు

కనిగిరి, మార్చి 20 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాసంక్షేమం కాంక్షించి రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకెంతో మేలు చేస్తాయని ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ తెలుగుమహిళా అధికార ప్రతినిధి కరణం అరుణ చెప్పారు. మున్సిపాల్టీలో బుధవారం 15వ వార్డులో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటినీ సందర్శించి టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటిని చక్కదిద్దే మహిళలకు మేమున్నామంటూ చంద్రబాబు రూపొందించిన పథకాలు ఎంతో భరోసా ఇస్తాయన్నారు. జగన్ అధికారంలోకి రాకముందు నిరుద్యోగ భృతి ఇస్తామని మాట తప్పారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ప్రజలకు తెలిపారు. టీడీపీ పాలనలో నిరుద్యోగులకు రూ.2వేలు అందించామని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఖర్చు కింద నెలకు రూ.3వేలు అందించనున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 అందజేస్తామన్నారు. వ్యవసాయరంగాభివృద్ధికి రైతులకు ఏటా రూ.20వేలు అందిస్తామని చెప్పారు. అదేవిధంగా ప్రతి ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంత మందికి ఏడాదికి రూ.15వేలు తల్లికి వందనం పథకం ద్వారా అందజేస్తామన్నారు. చిన్న, మధ్యతరగతి, చిరు వ్యాపారాలు చేసుకుని జీవించే వారి ఆర్థిక పురోగతికి బాటలు వేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, షేక్ ఫిరోజ్, క్రాంతి శ్రీనివాసులురెడ్డి, బ్రాక్, జక్రయ్య, తిరుపాలు, నరసింహ, ఏనుగు శ్రీనివాసులురెడ్డి, కేవీఎస్ గౌడ్, తెలుగుమహిళలు దొరసాని, వెంకటలక్ష్మమ్మ, నారాయణమ్మ, అమ్ములమ్మ, ధనలక్ష్మీ, స్వప్న పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులు అంకితభావంతో విధులు నిర్వహించాలి


నూతన సభ్యులను సన్మానిస్తున్న నేతలు

పామూరు, మార్చి 20 : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరూ అంకితభావంతో పనిచేసి సంస్థ బలో పేతానికి కృషి చేయాలని డిస్కం అధ్యక్షుడు రాచగర్ల సంజీవరావు, కార్యదర్శి నందిగామ శర్మ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ 1104 కనిగిరి డివిజన్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ నాయబ్‌రసూల్, సీహెచ్ హరికృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎల్ఎస్ అనిల్‌కుమార్, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ కృష్ణ, కోశాధికారిగా రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామూరు, మార్చి 20 : పామూరు విద్యుత్ సబ్ డివిజన్‌లోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ పరికరాల మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు మండలాలకు చెందిన వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పామూరులో నిత్యం ట్రాఫిక్ సమస్యే


మమ్మీడాడి సెంటర్‌లో రోడ్డు మార్జిన్‌పైనే ఏర్పాటు చేసిన బోర్డులు


మెయిన్‌రోడ్డుపై నిలిచిన ట్రాఫిక్

ఆక్రమణకు గురవుతున్న రోడ్డు మార్జిన్లు

రోడ్ల విస్తరణపై దృష్టి సారించని అధికారులు

పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా లేని రోడ్లు

పామూరు, ఫిబ్రవరి 20 : పామూరులో రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు ఎక్కువవుతున్నాయి. దుకాణదారులే రోడ్డు మార్జిన్లను సైతం ఆక్రమించి ఎంచక్కా అద్దెలకు ఇచ్చుకుంటున్నారు. దీంతో రోడ్లు కుచించుకుపోయి వాహన రాకపోకలకు ఇబ్బందులు తరచూ ఏర్పడుతున్నాయి. అటు ఆర్అండ్‌బీ గానీ, ఇటు పంచాయతీ పాలకులు గానీ పట్టించుకొన్న పాపాన పోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లు సరిగా లేవు. ఏళ్ల తరబడి రోడ్ల విస్తరణ పనులను అధికారులు చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ప్రధానంగా పామూరు-నెల్లూరు మెయిన్ రోడ్డులో ఉన్న మమ్మీడాడి సెంటర్‌లో సీఎస్‌పురం బస్టాండ్ సెంటర్ పరిసరాలలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. దీనికి తోడు రహదారులకు ఇరువైపులా ఉన్న మార్జిన్లను సైతం దుకాణదారులు ఆక్రమించుకొని తోపుడు, స్వీట్ బండ్లకు, పూల అంగళ్లకు, కొబ్బరిబొండాలు, చికెన్ దుకాణాలకు అద్దెలకు ఇచ్చారు. వారి నుంచి నెలనెలా అద్దెలు వసూలు చేస్తున్నారు. రోడ్లు ఇరుకుగా ఉండడంతో వాహనాలను రోడ్లపైనే నిలపడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఎదురెదురుగా రెండు వాహనాలు ఒకేసారి వచ్చినప్పుడు ట్రాఫిక్ తరచూ నిలిచిపోతుంటుంది. దాంతో వాహనాలు నిలిచిపోతుండటంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మార్జిన్లపై ఉన్న ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లీనింగ్ చేశారు.. బ్లీచింగ్ వేశారు..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చెత్తకుప్పలను తొలగించి చల్లిన బ్లీచింగ్

కనిగిరి, మార్చి 20 : కనిగిరి మున్సిపాలిటీలో మురుగుకాల్వల్లో చెత్త నిల్వలు నిలిచిపోయి దోమలు ప్రబలుతున్నాయి. మురుగుకాల్వల్లో చెత్తను తొలగించి నాలుగైదు రోజులపాటు రోడ్డు పక్కనే ఉంచటంతో ఆయా చెత్త కుప్పలనుంచి దుర్వాసనతో పాటు దోమలు ప్రబలుతున్నాయి. అదేవిధంగా వీధుల్లో ఎక్కడా బ్లీచింగ్, ఫాగింగ్ మచ్చుకైనా చేయటం లేదు. దీంతో దోమలు విజృంభించి నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి "పారిశుధ్యంపై నిర్లక్ష్యం" అనే కథనాన్ని ఆంధ్రజ్యోతి కనిగిరిలో బుధవారం ప్రచురితమైంది. దీంతో మున్సిపాలిటీ శానిటేషన్ అధికారులు స్పందించి చెత్తకుప్పలను తొలగించి ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించి పారిశుధ్య చర్యలు చేపట్టారు.

తొలిరౌండ్ పొగాకు అమ్మకాలు పూర్తి

కొండపి, మార్చి 20 : కొండపిలోని వేలం కేంద్రంలో తొలిరౌండ్ పొగాకు అమ్మకాలు బుధవారంతో పూర్తయ్యాయని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. రెండో రౌండ్ గురువారం నుంచి మొదలవుతుందన్నారు. అందులో బ్యారన్‌కు 4 బేళ్ల చొప్పున విక్రయాలకు అనుమతించామన్నారు. రైతులు గ్రేడింగ్ సరిగా చేసుకుని బేళ్లను వేలానికి తీసుకువచ్చి గిట్టుబాటు ధరలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఓటు వినియోగంపై అవగాహన ఉండాలి

టంగుటూరు, మార్చి 20 : ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని డ్వామా పీడీ బి.అర్జునరావు ఓటర్లకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సూరారెడ్డిపాలెంలో డ్వామా ఆధ్వర్యంలో బుధవారం ఓటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పీడీ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా ఓటు వేయాలన్నారు. ప్రతి కేంద్రంలో 100 శాతం పోలింగ్ జరిగేలా సహకరించాలని కోరారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీఎల్వోలంతా ఓట్ల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. ఈసందర్భంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డ్వామా ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ మేనేజర్ పి.వెంకటస్వామి, ఏపీవో సుభాషిణి, డ్వామా అధికారి మధుసూదనరావు, డ్వామా, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

మా ఊరి రాజకీయాల్లో మీకేం పని?

మంత్రి కొడుకు సమావేశం నిర్వహిస్తుండగా

వెలుపల గొడవపడిన వైసీపీ వర్గీయులు

కొండపికి చెందిన ఇద్దరిపై దాడి..

కె.ఉప్పలపాడులో ఘటన

కొండపి, మార్చి 20 : మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో ఉన్న కొత్త ఆదిఆంధ్ర కాలనీలో మంత్రి ఆదిమూలపు సురేష్ కొడుకు విశాల్ సమావేశం నిర్వహిస్తున్న సమయంలో వైసీపీ నాయకులు గొడవపడ్డారు. ఇద్దరు యువకులపై మరికొందరు చేయిచేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మంత్రి సురేష్ కొడుకు విశాల్ ఇటీవల మండలంలో పర్యటిస్తున్నారు. గ్రామాల వారీ ఆయా సామాజికవర్గాల వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో కె.ఉప్పలపాడులోని ఇరువర్గాల వైసీపీ నాయకులతో మాట్లాడుకొని గ్రామంలోని పాత ఆదిఆంధ్రకాలనీలో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే కొండపికి చెంది వైసీపీలో కీలకంగా పనిచేస్తున్న ఇద్దరు యువకులు జోక్యం చేసుకొని సమావేశాన్ని కొత్త ఆదిఆంధ్ర కాలనీకి మార్పించినట్లు తెలిసింది. ఆ ఇద్దరిలో ఒకరు సంవత్సరం క్రితం వరకు కొండపిలో డీలర్‌గా పనిచేసిన వ్యక్తి కాగా, మరొకరు వైసీపీకి చెందిన యువకుడు. గ్రామంలో జరిగే సమావేశ స్థలాన్ని కొత్త ఆదిఆంధ్రకాలనీకి ఉద్దేశపూర్వకంగా మార్చారని భావించిన పాత ఆదిఆంధ్రకాలనీకి చెందిన వారితోపాటు గ్రామానికి చెందిన మరికొందరు కొండపికి చెందిన యువకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా గ్రామంలో మీరు రాజకీయాలు చేస్తారా? ఇక్కడ మీకేం పని' అని నిలదీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా వాగ్వివాదం చోటుచేసుకొని ఇరువురిపై దాడిచేసినట్లు తెలిసింది. అయితే గొడవ మంత్రి కొడుకు సమావేశం నిర్వహిస్తున్న స్థలానికి కొద్దిదూరంలో జరిగినట్లు చెప్తున్నారు. గ్రామాల వారీ సమావేశాలు నిర్వహిస్తున్న మంత్రి సురేష్ కొడుకు విశాల్‌కు మండలస్థాయి నాయకుడు ఒకరు ముందుగానే తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారని తెలిసింది. గ్రామాల్లో పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో గ్రూపులు ఉన్న నేపథ్యంలో ఒక ఊరిలో జరిగే సమావేశాలకు ఇతర గ్రామాల వారిని తీసుకెళ్లవద్దని, ఒక గ్రామం వారు ఇంకో గ్రామ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కొడుకుతోపాటు ఐ ప్యాక్ సభ్యులకు ఆ నాయకుడు సలహా ఇచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ కె.ఉప్పలపాడు గ్రామంలోని సమావేశ స్థలం విషయంలో కొండపి యువకులు జోక్యం చేసుకోవడంతో గొడవ జరిగిందని తెలిసింది.


వలంటీర్లు ఏర్పాటు చేసిన సచివాలయాల గ్రూప్‌లకు నేటికీ కొనసాగుతున్న జగన్ ప్రొఫైల్ పిక్‌లు

ఉల్లంఘనలు.. దాడులు

- కోడ్ వచ్చినా తగ్గని వైసీపీ నేతలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెట్రేగిపోతోన్న వైసీపీ
- గుంటూరు, కొల్లిపరల్లో అభ్యర్థుల సమక్షంలోనే దాడి
- అధికారులు హెచ్చరిస్తోన్నా వైసీపీ ప్రచారంలో వలంటీర్లు
- పోలీసుల అండతో టీడీపీ సానుభూతి పరులపై వేధింపులు

అధికారం మాది.. మా ఇష్టం.. మమ్మల్ని ఎవరు ఏం చేస్తారు.. మనకు కూడా అనుమతులు అవసరమా.. మనపై కేసులు పెట్టే ధైర్యం అధికా రులకు ఉందా.. అని ఇంత కాలం వైసీపీ నాయకులు బరితెగించారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా వారు అదే పంథా కొనసాగి స్తున్నారు. ప్రత్యర్థులపై దాడులు.. అనుమతి లేకుం డానే సమా వేశాలు.. వలంటీర్లతో ప్రచారాలు.. పంపకాలకు ఎన్నికల తాయి లాలు సిద్ధం.. తదితరాలతో వైసీపీ నాయకులు చెలరేగి పోతు న్నారు. ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన అధికారులు పట్టిం చు కోకపోవడం.. అధికార పార్టీ నేతలను కట్టడి చేయా ల్సిన పోలీసు ల మౌనంతో వైసీపీ నాయకులు ఎక్కడి కక్కడ తమకు అడ్డే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నా రు. దాడులతో ప్రతిపక్ష పార్టీలను భయ బ్రాంతులకు గురి చేసి ఎన్నికలు జరుపుకో వాలనే ప్రయత్నాలు మొదలుపెట్టారన్న విమర్శలు, ఆరోపణలు వెల్లువె త్తుతున్నాయి. ఇక ఎన్నికల అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. ఇం దుకు బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరి ధిలో జరిగిన పలు ఘట నలు నిదర్శ నంగా కనిపి స్తున్నాయి.

గుంటూరు, బాపట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ వచ్చింది. ఇక అధికారులు కఠినంగా ఉంటా రు.. అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తకుండా వారి ఆగ డాలను కట్టడి చేస్తారు.. ఎన్ని కల సంఘం జోక్యంతో వైసీపీ నాయకులు కూడా తగ్గతారు.. అని అందరూ ఊహించారు. అ యితే అధికార పార్టీ నాయకులు తమ ధోరణి, పంథాను వీడటం లేదు. దాడులు.. దౌర్జన్యాలతో పెట్రేగి పోతున్నారు. ఎన్నికల్లో విజయమే కీలకంగా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అడ్డదారులను, ఓట్ల అక్రమాలతో ఎన్ని కల గండం గట్టెక్కాలనే నిర్ణయానికి పాలక పార్టీ వచ్చినట్లుగా వారి తీరును బట్టి అర్థమ వుతోంది. కోడ్ ఆంక్షలను కూడా లెక్క చేయ కుండా యథేచ్ఛగా దాడులకు దిగుతూ, వలంటీర్ల ను ఇష్టారీతిన వాడేస్తూ వ్యవస్థలకే సవాల్ విసిరే పనిలో వైసీపీ నిమగ్నమైందన్న విమర్శలు వస్తున్నాయి. మొన్న పల్నాడు జిల్లా మాచర్ల, బుధవారం గుంటూరు, కొల్లిపర తదితర ప్రాంతాల్లో దాడుల పరంపరను వైసీపీ కొనసాగిస్తోంది. మరోవైపు ఖాకీలను ఉపయోగించి టీడీపీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించిన ఘటన మొన్న అద్దంకి నియోజకవర్గ పరిధిలోని బల్లికురవలో జరి గింది. ఓటమి భయంతో వైసీపీ తొక్కని అడ్డదారులు లేవని టీడీపీ ఆరోపిస్తోంది. తాయిలాల పంపకాన్ని అడ్డుకున్నందుకు టీడీపీ శ్రేణులతో వైసీపీ కార్యకర్తలు వాగ్వాదానికి దిగిన ఘట న సత్తెనపల్లి పరిధిలో జరిగింది. ఈ ఘటనలన్నీ కూడా కోడ్ అమల్లోకి వచ్చాక జరిగినవే కావడం వైసీపీ నేతల్లో ఉన్న అస హనానికి సూచికగా కనబడుతోంది.

వలంటీర్ల వాట్సాప్ ప్రొఫైల్ పిక్‌లో జగన్ ఫొటో

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఐదు రోజులు గడిచినా ఇంకా వలంటీర్లు వైసీపీ వ్యామోహంలోనే ఉన్నారు. మండల /డివిజన్/గ్రామ స్థాయి నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. అంతేకాకుండా వలంటీర్లు ప్రాతినిధ్యం వహి స్తున్న క్లస్టర్ల పరిధిలోని కుటుంబాలతో గతంలో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపు ప్రొఫైల్ పిక్‌గా జగన్ బొమ్మని నేటికీ కొనసా గిస్తున్నారు. ఆ గ్రూపు ద్వారానే నిత్యం ప్రభుత్వ పథకాలు, వైసీపీ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని సభ్యులకు షేరింగ్ చేస్తున్నారు. తాము ప్రభుత్వ ఖజానా నుంచి గౌరవ వేతనం పొందు తున్నామన్న విషయం మరిచి వైసీపీ ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఈ రెండు నెలలు మాకోసం పని చేయండి... నెలకు రూ. 15 వేల చొప్పున ఇస్తాం. ఒకవేళ ఈసీ మిమ్మల్ని తీసేసినా తిరిగి అధికారంలోకి తామే వస్తామని, రాగానే మళ్లీ మీ పోస్టు మీకేనంటూ వైసీపీ నేతలు వారిని నమ్మిస్తున్నారు.

అనుమతి లేకుండా సభ

రేపల్లె: కోడ్ వచ్చిన నేపథ్యంలో సభలకు, సమా వేశాలకు అనుమతి తప్పనిసరి. అయితే రేపల్లెలో అధికార పార్టీ నాయకులు బరితెగించి అనుమతి లేకుండానే సభ నిర్వహించారు. అధికారులు అడ్డు కున్నా వారిని ఖాతరు చేయకుండా కొనసాగించారు. రేపల్లె 1వ వార్డు కృష్ణుని దేవాలయం వద్ద బుధ


కృష్ణుని గుడి వద్ద అనుమతి లేని ఎన్నికల సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి

వారం వైసీపీ అభ్యర్థి ఈవూరి గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశమే ఇందుకు నిదర్శనం. సభకు ప్రజల్ని మెప్మా సిబ్బంది, వలంటీర్లు పథకాలు రావ ని భయపెట్టి తీసుకురావడం విశేషం. విషయం తె లుసుకున్న ఎన్నికల డీటీ, రూట్ ఆఫీసర్ అను మతి తీసుకోకుండా జనాన్ని తరలించి సభను ఎలా నిర్వ హిస్తారని నిలదీశారు. తక్షణమే సభను ము గిం చాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే వారి మాట లను లెక్కచేయని అధికార పార్టీ నాయకులు సభను కొనసాగించారు. ఈ సభలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, మాజీ ఎమ్మెల్యే దేవినేని , వైసీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణ, చైర్‌పర్సన్ కట్టా మంగ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎన్నికల నిబం ధనల ఉల్లంఘనలపై కేసు నమోదు చేసినట్లు ఎన్ని కల రిటర్నింగ్ ఆఫీసర్ హేలా షారోన్ తెలి పారు.

గుంటూరు కమిషనర్ ఉత్తర్వులు బేఖాతర్

గుంటూరు(కార్పొరేషన్): గుంటూరు నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్‌ల వద్ద పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల ప్ర చారంలో పాల్గొనవద్దని కమిషనర్ కీర్తి ఆదేశాలు జారీ చేశారు. అయితే వాటిని పలువురు ఉద్యో గులు ఏమాత్రం ఖాతరు చేయడంలేదు. మే యర్ మనోహర్ నాయుడును చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థిగా ఉన్నారు. ఆయన ప్రతిరోజు చిలకలూరిపేట నియోజకవర్గంలో పర్యటిస్తు న్నారు. అయితే మేయర్ వద్ద పనిచేసే కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆయనతోపాటు ఎన్ని కల ప్రచారంలో పాల్గొంటున్నారు.

సత్తెనపల్లిలో ఎన్నికల చీరలు



సత్తెనపల్లి: సత్తెనపల్లిలో మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అనుచరుడైన కళ్లం విజయభాస్కరరెడ్డికి చెందిన కేవీఆర్ మార్టులో 1684 చీరలను బుధవారం ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో పంపిణీకి చీరలను సిద్ధం చేశారని టీడీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరా వులు నియోజకవర్గ ఎన్నికల అధి కారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు చెందిన నోడల్ అధి కారి కేవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం కేవీఆర్ మార్టులో తనిఖీలు చేశారు. తనిఖీల సమాచారంతో విజయభాస్కరరెడ్డి మార్టు వద్దకు రాగా అప్పటికే అక్కడ గుమికూడిన టీడీపీ నేతలను చూసి రెచ్చగొట్టేలా మాట్లాడారు. దీంతో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సీఐ శ్రీనివాసరావు ఇరువర్గాలను చెదర గొట్టారు. చీరల బాక్సులపై సీఎం జగన్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటోలున్నాయి. కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న చీరలను తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.


చీరల బాక్సులు

జనసేన నాయకుడి కారుపై దాడి

కొల్లిపర: కొల్లిపర మండలం వల్లభాపురంలో బుధవారం జనసేన నాయకుడు భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి కారుపై రాళ్లదాడి జరిగింది. జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గ్రామంలో నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. వేణుగోపాల్‌రెడ్డి తన కారును పార్కింగ్ చేసి సమావేశంలో పాల్గొన్నారు. వేణుగోపాల్ రెడ్డి ఇటీవల అధిక మంది కార్యకర్తలను జనసేన పార్టీలోకి చేర్చారు. దీంతో కక్షగట్టిన అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఆయన కారుపై రాళ్లు విసిరారు. దీంతో కారు అద్దాలు పగి లిపోయాయి. నాదెండ్ల మ నోహర్ కారును పరిశీలిం చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని వేణుగోపాల్‌రె డ్డికి సూచించారు.


ధ్వంసమైన కారును పరిశీలిస్తున్న మనోహర్

వలంటీర్ల ప్రచారాలు..





ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో వలంటీర్లను పార్టీ కార్యకర్తల్లాగా వాడుకుం టున్నారు. టీడీపీ సానుభూతి పరుల వివరాలను వారి ద్వారా సేక రిస్తున్నారు. వైసీపీకి ఓటే వేయకపోతే సంక్షేమ పథకాల అందవని లబ్ధిదారులను బెదిరిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా వైసీపీ నాయకులు వెనక్కి తగ్గ కుండా ఇష్టారీతిన వలంటీర్ల సేవలను వైసీపీ వినియోగించు కుంటోంది. మంగళవారం రాత్రి బల్లికురవ మండలం కొప్పెరపాడు లో మండల వైసీపీ కన్వీనర్ ఏర్పాటు చేసిన సమావేశంలో వలం టీర్ పాల్గొన్నాడు. అద్దంకి మండలం గోపాలపురంలోనూ వైసీపీ ఇన్‌చార్జితో కలిసి వలంటీర్ పాల్గొనడం బరితెగింపునకు నిదర్శనం. వినుకొండ మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటు, నరసరావుపేట పార్లమెంటు వైసీపీ అభ్యర్థి అనీల్ కుమార్‌యాదవ్ చేపట్టిన ఎన్నికల ప్రచారంలో గ్రామానికి చెందిన వలంటీర్లు వజ్జ రామకోటేశ్వరరావు, పిలికదుపుల నాగరాజు, గుమ్మ వెంకటేశ్వర్లు పాల్గొని సందడి చేశారు. బెల్లంకొండలో బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టిన నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి వలంటీర్ పర్వతం రాములు ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన ఓటర్లకు కరపత్రాల పం పిణీతో పాటు పార్టీకి అనుకూలంగా నినాదాలు కూడా చేశారు. దీనిపై టీడీపీ నాయకులు పెదకూరపాడు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి కారుపై దాడి


ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు కారుపై దాడి చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

గుంటూరు: ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి కార్యాలయంలో వలంటీర్లకు నగదు, తాయిలాలు పంచు తు న్నారనే సమాచారంతో అక్కడకు వెళ్లిన టీడీపీ అభ్యర్థి బూర్ల రా మాంజనేయులు కారుపై బుధ వారం వైసీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు. దీనిపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లగా అక్కడ పోలీసుల సాక్షిగానే మరోసారి వైసీపీ వర్గీయులు దాడికి ప్రయత్నించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ప్రత్తి పాడు వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ గుంటూరులోని జేకేసీ కళాశాల రోడ్డులో కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇందులో రెండు రోజులుగా వలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తూ వారికి నగదు, తాయిలాలు పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ అభ్యర్థి రామాం జనేయులుకు సమాచారం అందింది. దీంతో వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన ముఖ్య నేతలతో వైసీపీ అభ్యర్థి కార్యాలయం వైపు వెళ్లారు. అయితే వీరి రాకను గమనించిన వైసీపీ వర్గీయులు ఆయన కారును చుట్టుముట్టి అద్దాలు ధ్వంసం చేసి టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. సమాచారం అందుకుని అక్కడికి వచ్చిన నల్లపాడు పోలీసులు ఇరువర్గాలను సముదాయించి పంపారు. టీడీపీ నేతలు అక్కడకు వెళ్ళే సరికి కొంత మంది వలంటీర్లు పారిపోయారు. మరి కొందరు అక్కడే ఉండగా వారి వీడియోలను టీడీపీ నేతలు చిత్రీకరించి ఎన్నికల కమిషన్‌కు పంపారు. కాగా రామాంజ నేయు లు అక్కడి నుంచి నేరుగా నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వారి వెంటే వైసీపీ వర్గీయులు కూడా అక్కడకు చేరుకోగా అక్కడ పోలీసుల సాక్షిగా మరోసారి దాడికి దిగారు. తీవ్రస్థాయిలో హెచ్చరికలు, బెదిరించారు. వారిని పోలీసులు అదుపు చేశారు. ఆ తర్వాత బలసాని కిరణ్‌కుమార్ కూడా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ పార్టీ అభ్యర్థి కార్యాలయంపై దాడికి వచ్చి వలంటీర్లపై దౌర్జన్యం చేశారని రామాంజనేయులుపై గుంటూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి, తూర్పు వైసీపీ అభ్యర్థిని నూరి ఫాతిమా, జీడీసీసీ చైర్మన్ లాలు పురం రాము తదితరులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతల ఫిర్యాదు

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ వలంటీర్లకు తాయిలాలు పంచు తూ కులాలు, పార్టీల వారీగా ఓటర్లను గుర్తించేందుకు జరుగు తున్న ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన తమపై వైసీపీ వర్గీ యులు దాడికి దిగాయని వారిపై చర్యలు తీసుకోవాలని ప్రత్తి పాడు ఉమ్మడి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, నసీర్ అహ్మద్, కనపర్తి శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, ఎస్‌వీవీఎస్ వరప్రసాద్(బుజ్జి), వేములపల్లి శ్రీరాం ప్రసాద్, కల్లూరి శ్రీనివాసరావు తదితరులు అదనపు ఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు ఇచ్చారు. కిరణ్ కుమార్ కార్యాలయానికి సుమారు 200 మీటర్ల దూరంలో కార్యకర్తలతో మాట్లాడుతుండగా వైసీపీ వర్గీయులు సుమారు 30 మంది కారు మీద దాడి చేసి అద్దాలను పగలగొట్టి, మా కార్యాలయం వద్ద మీకేం పని అని కులం పేరుతో దూర్భాషలాడుతూ ఉద్దేశపూర్వ కంగా తనపై దాడి చేశారని రామాంజనేయులు తెలిపారు.

ఇరువర్గాలపై కేసులు : ఎస్పీ తుషార్ డూడీ

ప్రత్తిపాడు ఘటనలకు సంబంధించి నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. దర్యాప్తులో బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


అదనపు ఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేస్తున్న రామాం.నేయులు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు తదితరులు

ఖజానా ఖాళీ

- ఏప్రిల్ 1 తర్వాతే జీతాల బిల్లులు
- ట్రెజరీ శాఖ డైరెక్టర్ నుంచి ప్రత్యేక ఆదేశాలు
- ఖజానా వట్టిపోవటంతో వెబ్‌సైట్ పేరిట కాలయాపన
- 20 వేలమంది ఉద్యోగులు.. 22 వేల మంది పెన్షనర్లకు తిప్పలు



గుంటూరు సిటీ, మార్చి20: ఆర్థిక క్రమశిక్షణ లేని ప్రభుత్వ పాపాలు ఉద్యోగులు, పెన్షనర్ల పాలిట శాపాలుగా మారాయి. మార్చి నెల జీతం కోసం కూడా రోజుల తరబడి ఎదురు చూడా ల్సిందే. ఖజానా పూర్తిగా వట్టి పోవటంతో ట్రెజరీ శాఖ డైరెక్టర్ ఇచ్చిన తాజా ఉత్తర్వులు చర్చ నీయాంశంగా మారాయి. మార్చి నెల జీతాల బిల్లులు ఏప్రిల్ 1 తర్వాత అనుమతించాలని జిల్లా ఖజానా అధికారు లకు ఆదేశాలు అందాయి. ఏప్రిల్ 1 తరు వాత మాత్రమే ఆయా బిల్లులకు సీఎఫ్ ఎంఎస్ నుంచి బ్యాచ్ నెంబర్‌లు కేటాయి స్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బిల్లుల సమర్పణకు ఏప్రిల్ 1 ని గడువుగా నిర్ణ యించడం వలన జీతాలు పడటానికి చాలా సమయం పడుతుంది. కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభం కావడం వల్ల వెబ్‌సైట్‌లో మార్పుల వల్ల జీతాల బిల్లుల స్వీకరణకు సమయం పడుతుందని ట్రెజరీ శాఖ చెబుతున్నప్పటికీ వాస్తవాలు వేరేగా ఉన్నాయి. ఖజానాలో నిధులు పూర్తిగా అడుగంటడం తో ప్రభుత్వం వెబ్ సైట్ మార్పు వ్యవ హా రం సాగదీస్తున్నట్లు చెబు తున్నారు.

ప్రతి సంవత్సరం జరిగేదే..

ఆర్థిక సంవత్సరం ఆరంభం లో వెబ్‌సైట్ మార్పు అనేది ఎ ప్పుడూ జరుగుతూనే ఉం టుంది. అయినప్పటికీ అదం తా మార్చి 20వ తేదీ నాటికి జరిగిపోయేది. మార్చి 21 నుంచి యథా విధిగా జీతాల బిల్లులు అనుమతించి ఉద్యోగులు, పెన్షనర్లకు ఇబ్బంది లేకుండా చేసేవారు. ఈ సంవత్సరం అందుకు విరు ద్ధంగా జరిగింది. వెబ్‌సైట్ మార్పు అనేది సహజ ప్రక్రియలో భాగమే అయినా కావాలని కాలయాపనకు తెరలేపినట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

21న సమర్పిస్తే ఎప్పుడో పడేవి..

జగన్ ప్రభుత్వంలో ఉద్యోగులు, పెన్ష నర్ల జీతాలు, పెన్షన్లు ఏ నెల కూడా మొదటి తేదీన అందుకో లేదు. చివరకు ఆర్థిక సంవత్సరం ఆరంభంగా పిలిచే ఫస్ట్ క్వార్టర్‌లో కూడా సకాలంలో చెల్లింపులు జరగలేదు. ప్రతి నెల జీతాల బిల్లు లు 17వ తేదీ నుంచి 25 వరకు ఆయా డీడీ (డ్రాయింగ్ అధికారులు) ఆన్‌లైన్‌లో సం బంధిత ఖజానాకు పంపేవారు. అక్కడ అధికారులు పరిశీలించి వాటిని సీఎఫ్ ఎంఎస్‌కు పంపేవారు. నిధుల సౌలభ్యత ను బట్టి ప్రభుత్వం జీతాలు, పెన్షన్లు చెల్లిస్తూ వచ్చేది. ప్రతి నెల 1వ తేదీ నుంచి 25 తేదీ వరకు జీతాలు విడతల వారీగా జమ అవుతూ ఉండేవి. కాంట్రా క్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అయితే ఒక్కోసారి రెండు, మూడు నెలల తర్వాత కూడా చెల్లింపులు జరుగుతూ ఉండేవి.

వేలాదిమందికి ఇక్కట్లే..

గుంటూరు జిల్లాలో 20 వేలమంది ఉద్యోగులు, 22 వేల మంది పెన్షనర్లు వున్నారు. వీళ్ళు కాక కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరంతా మార్చి నెల జీతం కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్ప డటంతో ఆందోళన చెందుతున్నారు. బ్యాంక్ ఈఎంఐలు, ఇంటి అద్దెలు, ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందు తున్నారు.

ఎస్ఐ దాడిలో గాయపడిన వృద్ధుడు ఆస్పత్రికి

పరిస్థితి ఆందోళనకరం.. ఒంగోలు రిమ్స్‌కు తరలింపు


చికిత్స పొందుతున్న హనుమంతరావు

బల్లికురవ, మార్చి 20: బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి చేయి చేసుకోవడంతో అస్వ స్థతకు గురైన వృద్ధు డు శానంపూడి హను మంతరావు బుధవా రం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. వైద్యులు వెంటనే పో లీస్ స్టేషన్‌కు సమా చారం అందించినప్ప టికీ పోలీస్‌లు స్పం దించలేదని బాధితుని బంధువులు ఆరోపిస్తు న్నారు. ఎస్ఐ ఒత్తిడితోనే పోలీసులు ఉదాసీ నంగా వ్యవహరించి ఫిర్యాదు తీసుకునేందు కు రాలేదని ఆరోపించారు. హనుమంతరావు ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉండడం తో వైద్యుల సూచన మేరకు 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ నాగశివారెడ్డి మంగళ వారం రాత్రి బడ్డీ కొట్టులో ఉన్న హనుమంతరావుపై చేయి చేసుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్లడంతో ఆందోళనకు గురయ్యారు. గుండె సంబంధిత సమస్యతో ఉన్న హనుమంతరావు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో బంధువులు బుధ వారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పిం చారు. వృద్ధుడిపై ఎస్ఐ చేయి చేసుకో వడంతో పాటు బెల్ట్ షాపులో మద్యం అమ్మ కాలు చేస్తున్నట్లు హనుమంతరావుపై కేసు నమోదు చేశారు. దీంతో మరింత ఆందోళన చెంది హనుమంతరావు అనారోగ్యానికి గురై నట్లు బంధువులు ఆరోపిస్తున్నారు.

కట్టుకున్న వాడే కాలయముడు

- గ్రామ శివారు పొలాల్లోకి తీసుకెళ్లి హత్య
- అనుమానంతోనే ఘాతుకం..

నిందితుడి కోసం గాలింపు


పొలాల్లో లక్ష్మి మృతదేహం

వేటపాలెం(చీరాలటౌన్), మార్చి 20: అను మానం పెనుభూతంగా మారి జీవితాంతం తోడు గా ఉంటానని ప్రమాణం చేసి ఓ మహిళ జీవి తాన్ని కాల రాసిన భర్త ఉదంతమిది. బుధవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివ రాలు.. వేటపాలెం మండల పరిధిలోని రోశయ్యకాల నీకు చెందిన దేవర లక్ష్మీనారాయణ, నల్లగొండకు చెందిన లక్ష్మి(35) సుమారు 15 ఏళ్ల క్రితం ప్రే మించి పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వీరికి 13 ఏళ్ల వరుణ్ తేజ్, ఎనిమిదేళ్ల శరణ్య ఉన్నారు. లక్ష్మీనారాయణ ప్రైవేటు వాహన డ్రైవర్‌గా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెరిగి పలుమార్లు గొడ వలు పడ్డారు. ఈక్రమంలోనే రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పంచాయితీలు కూడా జరిగాయి. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం భార్యాభర్తలు గ్రా మ శివారు పొలాల్లోకి మాట్లాడుకోవాలని వెళ్లారు. పథకం ప్రకారం లక్ష్మి గొంతుకకు చున్నీ బిగించి హతమార్చాడు. అనంతరం కుమారుడికి ఫోన్ చేసి కొంచెం ఉప్పు, మంచినీళ్లు తీసుకురమ్మని చెప్పాడు. నేలకొరిగి ఉన్న తల్లిని చూసి అమ్మ ఎందుకు అలా పడుకుంది అని తండ్రిని ప్రశ్నించాడు. తర్వాత చెప్తాను వెళ్లిపొమ్మని పంపేశాడు. ఆ తర్వాత లక్ష్మీనా రాయణ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో కర్ర, పార, చున్నీ లను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీనారాయణ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

పెళ్లి అయితే ఓట్లు ఉండవు

ఇంకొల్లు, మార్చి 20: ఇంకొల్లు మండలంలో సుమారు 16 మంది పెళ్లిళ్లు చేసుకున్న ఆడపిల్లల ఓట్లను ఫారం-7తో అక్రమంగా తొలగించారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 16 మంది తమ ఓట్లు అక్రమంగా తొలగించారని జనవరిలో కోర్టును ఆశ్రయించగా కలెక్టరు కార్యాలయం నుంచి ఈ నెల 20న విచారణకు బాపట్ల రావాలని నోటీసులు అందజే శారు. ఈ నేపథ్యంలో ఓట్లు కోల్పోయిన ఆడపిల్లల తల్లిదండ్రులు బుధవారం కలెక్టర్ రంజిత్‌బాషాను కలిశారు. వారిని విచా రించి పెళ్లయిన ఆడపిల్లలకు ఓట్లు ఉండవని, వారు ఉండే చోటే ఓటు హక్కు పొందాలని చెప్పారు. దీంతో వారు నిరుత్సాహంతో వెనుదిరిగారు.


నోటీసులతో విచారణకు వెళ్లిన ఇంకొల్లు ప్రాంత వాసులు

రుణ రగడ

రైతుల పేరుతో బ్యాంకులో నేత వ్యవహారం

తిరిగి చెల్లించాలంటూ సిబ్బంది నోటీసులు

లబోదిబోమంటూ బ్యాంకు వద్ద బాధిత రైతుల ఆందోళన

నాగులుప్పలపాడు మార్చి 20: ఓ రాజకీయ నాయకుడు పలువురి రైతుల పేర్లతో బ్యాంకు నుంచి రుణాలు పొంది తిరిగి చెలించకపోవడంతో గందరగోళం నెలకొంది. బ్యాంకు అధికారులు రైతులకు హెచ్చరిక నోటీసులు అందజేయడంతో బాధితులంతా బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలిసి ఆ నాయకుడి అనుచరులు వచ్చి రైతులకు సర్ది చెప్పటంతో వెనుతిరిగారు. ఈ ఘటన నాగులుప్పలపాడులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే వేటపాలెంకు చెందిన ఓ రాజకీయ నాయకుడి సోదరుడు, ప్రస్తుతం ఓ కీలక పార్టీకి జిల్లాస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకుడు ఈ రుణ మేత వెనుక ఉన్నారు. గతంలో మండలంలోని అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం, దాసరివారిపాలెం, కనపర్తి తదితర గ్రామాల్లో తన సామాజికవర్గానికి చెందిన కొందరికి కనపర్తి ప్రాంతంలోని భూములను బినామీ పేర్లతో అప్పటి రెవెన్యూ అధికారులు అండదండలతో రికార్డులను సృష్టించారు. ఆయా భూములకు సంబంధించిన పత్రాలతో 2021లో ఎన్‌జీపాడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఒక్కో రైతుకు రూ.2లక్షల చొప్పున రుణాలను పొందారు. తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని బ్యాంకు అధికారులు పలుమార్లు సంబంధిత రైతులకు నోటీసులు జారీచేశారు. నోటీసులు తీసుకున్న రైతులు సదరు నాయకుని వద్దకు వెళ్లి విషయాన్ని ప్రస్తావించగా త్వరలోనే తిరిగి చెల్లించి మీపై ఒత్తిడి లేకుండా చేస్తానని హామీ ఇచ్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇప్పటికే పలుమార్లు నోటీసులు అందుకున్న రైతులు బుధవారం ఏం చేయాలో అర్థం కాక ఏపీజీబీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. దాంతో ఆ నాయకుడి అనుచరులు బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు చేరుకొని తీసుకున్న రుణాలను వడ్డీతో సహా గురువారం బ్యాంకుకు తిరిగి జమచేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగినట్లు తెలుస్తోంది.

1 తర్వాతే జీతాలు, పెన్షన్ బిల్లులు

ఒంగోలు(విద్య), మార్చి 20: మార్చి నెలకు సంబంధించిన జీతాలు, పింఛన్లు ఇతర చెల్లింపులకు సంబంధించిన బిల్లులు ఏప్రిల్ 1 తర్వాతే అనుమతించనున్నారు. ఆ మేరకు ఖజానా శాఖ అధికారులను ఆదేశిస్తూ ఆ శాఖ డైరెక్టర్ మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ లేదా ఆ తర్వాత చెల్లింపులు జరిగే బిల్లుల ఐడీ 2024 ఆర్థిక సంవత్సరంతో మాత్రమే అనుమతించాల్సి ఉన్నందున మార్చిలో జీతాలు, పింఛన్ల బిల్లులు అనుమతించవద్దని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీతాలు, పింఛన్లు, జీఐఏ జీతాలు, వర్క్‌చార్జ్‌డ్ ఎస్టాబ్లిష్‌మెంట్ జీతాలు, ప్రొఫెషనల్ సర్వీసెస్, ఇతర కాంట్రాక్టు సర్వీసులకు సంబంధించి బిల్లులు, పీడీ అకౌంట్స్, తదితర బిల్లులు ఏప్రిల్ 1 తర్వాతే చెల్లిస్తారు. 2023తో ప్రారంభమయ్యే ఐడీలతో అనుమతించవద్దని ఖజానా శాఖ ఏటీఓ, ఎస్‌టీఓ, డీటీఓలను ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

కారును ఢీకొన్న లారీ.. ఒకరు మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై బ్రహ్మనాయుడు

నాగులుప్పలపాడు మార్చి 20: కారును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన 216 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపిన వివరాల మేరకు మద్దిపాడు మండలం గుండ్లసముద్రం గ్రామానికి చెందిన కోవెలకుంట్ల శివకృష్ణ, బుధవారం తెల్లవారు జామున కారులో చీరాల నుండి ఒంగోలుకు వెళ్తూ ఉప్పుగుండూరు సమీపములోని నాగన్న వాగు మూలమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. కారు నడుపుతున్న శివకృష్ణ తీవ్ర గాయాలు పాలవడంతో ఒంగోలులోని కిమ్స్ కు తరలించారు. చికిత్స పొందుతూ శివకృష్ణ మృతి చెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజకీయ ప్రచారం చేస్తున్న వలంటీర్లను తొలగించాలి

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి లక్ష్మణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి


ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 20 : రాష్ట్రంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా జరగాలంటే అధికార పార్టీ ప్రచార కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్న వలంటీర్లను వెంటనే తొలగించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలులోని రంగాభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సుపరిపాలన వేదిక నాయకుడు సుంకర సాయిబాబు, నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు కొల్లా మధు, సుపరిపాలన వేదిక ఉపాధ్యక్షుడు కంచర్ల సుబ్బారావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆల్‌ఫ్రెడ్, కర్నూలు రోడ్డు షాప్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మారెళ్ళ సుబ్బారావుతో కలిసి లక్ష్మణరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ వేతనంతో పనిచేస్తున్న వలటీర్లు ఎన్నికల విధులలో భాగస్వామ్యులు కాకూడదని కేంద్ర ఎన్నికల కమిషన్, హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా స్థానిక అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం నేరంగా పరిగణించి అలాంటి వారిని తొలగించాలన్నారు. ముఖ్యమంత్రి ఫొటోలు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, 104, 108 వాహనాలు, పాస్ పుస్తకాలు, ప్రభుత్వ సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్ దస్తావేజులతో పాటు సర్వే రాళ్ళు చివరకు మధ్యాహ్న భోజనంలో అందించే చిక్కీలు, ప్రభుత్వ వైద్యశాలలో రిపోర్టులపై కూడా ఉండటం దురదృష్టకరమన్నారు. వాటన్నింటిని వెంటనే తొలగించాలన్నారు. సుపరిపాలనను అందించే నిజాయితీ పరులైన నేతలను ఓటర్లు ఎన్నుకోవాలని కోరారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ 15 మంది నిజాయితీ పరులైన మేధావులు, రిటైర్డ్ అధికారులతో ఏర్పడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు. అర్హత ఉండి ఓటర్ల జాబితాలో ఓట్లు లేని వారు వచ్చేనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు ఓటుకు వెయ్యి తీసుకుంటే ఐదేళ్ళలో రోజుకు 54 పైసలు చొప్పున లభిస్తాయని, అందువల్ల పవిత్రమైన ఓటుహక్కును డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకు అమ్ముకోవద్దని ఓటర్లను కోరారు. ఎన్నికల అక్రమాలపై స్పందించేందుకు సిటిజన్ ఫర్ డెమోక్రసి ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్లు 18004250264, వాట్సప్ నెంబర్ 879000557ను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఓట్ల కోసం చర్చిల వద్ద బోర్లు

అర్ధరాత్రి పనులు చేపట్టిన వైసీపీ నాయకులు

కోడ్ ఉండగా ఇదేమని ప్రశ్నించిన మరోవర్గం వారు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఎన్నికల అధికారులు



చర్చి వద్ద వేస్తున్న బోరు

అద్దంకిటౌన్, మార్చి 20 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ వైసీపీ నాయకులు ఓటర్లును ప్రలోభపెట్టే పనిలో పడ్డారు. స్థానిక పల్లెలో ఓ వర్గాన్ని లోబర్చుకొని చర్చిల వద్ద బోర్లు వేసే కార్యక్రమానికి వైసీపీ నేతలు తెరలేపారు. అద్దంకి మండలం ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణపురంలోని ఎస్సీ కాలనీలో ఉన్న చర్చి వద్ద బుధవారం రాత్రి గుట్టు చప్పుడు కాకుండా బోర్లను తవ్వారు. నాలుగు రోజుల కిందట నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి బంధువు కాలనీలోకి వచ్చి చర్చి వద్ద బోరు వేసుకునేందుకు కావాల్సిన ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారని స్థానికులు చెప్తున్నారు. దీంతో బుధవారం రాత్రి బోరు బండిని తెప్పించి చర్చి వద్ద బోరు వేశారు. ఈ విషయాన్ని పల్లెలోని మరోవర్గం ఇదేమని ప్రశ్నించడంతో వారి మధ్య వివాదం నెలకొంది. ఈ విషయాన్ని స్థానిక ఎన్నికల అధికారులు దృష్టికి తీసుకెళ్లినా వారు చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు బోర్లు వేస్తున్నా స్థానిక ఎన్నికల అధికారులు మిన్నకుండడంపై స్థానికులు విమర్శిస్తున్నారు.

కింకర్తవ్యం?

ఆ ముగ్గురు ఎమ్మెల్యేల దారెటు..?

పోటీలో దిగుతారా... సైలెంట్ అవుతారా.!

వైసీపీలో ఉంటారా .. బయటకు పోతారా...

ఆత్మీయ సమ్మేళనాన్ని వాయిదావేసిన మహీధర్

పోటీకి వచ్చే ప్రయత్నంలోనే వేణుగోపాల్

వేరే ప్రాంత పదవి ఇచ్చినా నియోజకవర్గంలోనే సుధాకర్

అధికార వైసీపీలో టికెట్ రాని ముగ్గురు ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటి? వారి రాజకీయ భవితవ్యంపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారు. ఇది ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రాజకీయ వర్గాలోన్లు, ప్రజల్లోను జరుగుతున్న చర్చ. ఉమ్మడి జిల్లాలో వైసీపీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉండగా వారిలో దర్శి, ఎస్‌ఎన్‌పాడు, కందుకూరు ఎమ్మెల్యేలకు మాత్రమే ఆ పార్టీ టికెట్ నిరాకరించింది. గెలిచిన అనంతరం ఆ పార్టీలో చేరిన చీరాల ఎమ్మెల్యే బలరాంకు బదులు కుమారుడికి సీటు ఇచ్చారు. దీంతో టికెట్ రాని ముగ్గురు ఎమ్మెల్యేల రాజకీయ భవితవ్యం ఏమిటి వారు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనే విషయం ఆసక్తిగా మారింది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)


జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు మినహా మిగిలిన వారికి వారు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల్లో కానీ వేరేచోట కాని టికెట్ ఇచ్చింది. టికెట్ రాని ముగ్గురు చివర్లో నయినా అధినేత జగన్ అవకాశం ఇస్తారనే నమ్మకంతో ఎదురుచూశారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దర్శి నుంచి జగన్ అవకాశం ఇవ్వడని ముందుగానే గ్రహించి ఆ పార్టీ నుంచే ఎంపీ టికెట్ ఆశించి విఫలం చెందారు. ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబు కూడా ఇక్కడ కాకపోయినా మరో చోటయినా అవకాశం ఇస్తారని ఎదురుచూశారు. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిదని మాత్రం అధిష్ఠానంలోని ఒకరిద్దరు నాయకులే చివరిదాకా వేచిచూడండని సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే సీఎం జగన్ మొత్తం నియోజకవర్గాల అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటించటంతో ముగ్గురికి ఇక ఆ పార్టీ నుంచి పోటీచేసే అవకాశం లేనట్లేనని అంచనా వేస్తున్నారు.

ఒత్తిడిలో మహీధర్

సీనియర్ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి తాను తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించే విషయంలో ఒత్తిడికి గురవుతున్నట్లు వెల్లడవుతుంది. చివరిక్షణం వరకు వేచిచూడమని ఆ పార్టీలోని కొందరు నాయకులు సూచించినట్లు సమాచారం. అయితే ముందుగానే పరిస్థితిని గ్రహించిన మహీధర్‌రెడ్డి వేరే పార్టీ నుంచి వచ్చిన ఆహ్వానాలపై కూడా కొంతకాలం దృష్టిసారించారు. ఒకదశలో టీడీపీలోకి తీసుకునేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. ఒకరిద్దరు ముఖ్యనాయకులు మహీధర్‌రెడ్డి మధ్య ఫోన్ సంభాషణల కూడా జరిగినట్లు సమాచారం. ఎవరు వెనకడుగు వేశారనే విషయం పక్కనపెడితే ప్రస్తుతం ఆయన టీడీపీలోకి వెళ్లే అవకాశం లేదని తేలిపోయింది. ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించి ప్రచారాన్ని కూడా ప్రారంభించింది. ప్రస్తుతం నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీపడుతున్న టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, సాయిరెడ్డిలకు కూడా ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. వారిద్దరు కూడా ఆయనను వేర్వేరుగా కలిసిపోయారు. అయితే విశ్వసనీయ సమాచారం మేరకు ఈ పర్యాయం ఎన్నికల సమరానికి దూరంగా ఉంటేనే మంచిదనే అభిప్రాయానికి ఆయన వచ్చినట్లు తెలుస్తోంది. అయితే 2014లో వలే పూర్తిగా దూరంగా ఉండాలా, పోటీలో ఉన్నవారికి మద్దతు ఇవ్వాలా అనే విషయంలో స్పష్టతకు రాలేదని సమాచారం. పూర్తిగా సైలెంట్ కావద్దని అనుచరులు ఆయనపై ఒత్తిడి తెస్తున్నారు. మండలాల వారీగా ఆయన అనుచరులు సమావేశమై ఏం చేయాలో చెప్పమని కోరుతున్నారు. ఆయన పోటీలో లేకపోతే కొందరు టీడీపీలోకి వెళ్లిపోనుండగా మరికొందరు వైసీపీలోనే ఉండే అవకాశం ఉంది. ఆ మేరకు అభ్యర్థులకు టచ్‌లో కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కందుకూరులో మహీధరరెడ్డి అనుచరులతో ఆత్మీయ సమావేశం ఉంటుందని ప్రకటించారు. అనూహ్యంగా మంగళవారం సాయంత్రం సమావేశం వాయిదా పడిందని మరో ప్రకటన విడుదల చేశారు. దీంతో మహీధర్‌రెడ్డి తన నిర్ణయాన్ని ప్రకటించే విషయంలో వత్తిడిలో ఉన్నారని పరిశీలకుల అంచనా.

పోటీ ప్రయత్నంలో మద్దిశెట్టి

దర్శి ఇవ్వకపోయినా ఒంగోలు ఎంపీ టికెట్ ఇవ్వాలని జగన్ నుంచి పలువురు ముఖ్యనాయకులు చుట్టూ మద్దిశెట్టి తిరిగారు. ప్రయత్నం ఫలించలేదు. ఒక దశలో ఈ పర్యాయం పోటీకి దూరంగా ఉండాలని భావించినట్లు తెలిసింది. అయితే నియోజవకర్గంలోని పరిస్థితి దృష్ట్యా వైసీపీ అభ్యర్థి బూచేపల్లికి సహకరించకూడదన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు కూడా వెల్లడైంది. ఆ మేరకు ఆయన కుటుంబసభ్యులు, అనుచరుల నుంచి కూడా పూర్తిస్థాయిలో వత్తిడి వచ్చింది. అలాగే ఆయన సోదరులు కూడా పోటీకి దూరమైతే రాజకీయంగా నియోజకవర్గంలో గ్యాప్ వస్తుందని, ఏదో పార్టీలో పోటీలో ఉండాలని ఆయనపై ఒత్తిడి చేశారు. 2009 నాటి సంబంధాలతో ఆయన అప్పటి పీఆర్పీ వ్యవస్థాపకులు చిరంజీవిని కలిసినట్లు సమాచారం. ఆయన సిఫార్సుతో జనసేన నేత పవన్‌కళ్యాణ్‌ను కూడా కలిసినట్లు ప్రచారంలో ఉంది. ఇంకోవైపు వ్యాపారపరంగా టీడీపీకి చెందిన ఒక మాజీ ఎంపీతో ఉన్న సన్నిహిత సంబంధాలతో ఆ పార్టీలో చేరేందుకు కూడా ప్రతిపాదన పంపినట్లు తెలిసింది. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్‌తో కూడా మద్దిశెట్టి పార్టీలో చేరే విషయం అధిష్ఠానానికి ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ఆ రెండు పార్టీల నుంచి ప్రారంభంలో సానుకూల స్పందన రాలేదని తెలిసింది. ఈ దశలో విదేశాలకు వెళ్లిన వేణుగోపాల్ బెంగళూరు చేరారు. గత రెండు రోజుల నుంచి ఆయన టీడీపీ లేక జనసేన నేతలకు టచ్‌లో ఉన్నారు. విదేశాల్లో ఉన్న ఆయన సోదరుడు అన్న టీడీపీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది మీరెవరు వేరే వైపు వెళ్లవద్దని నియోజవకర్గంలోని కొందరు నాయకులకు ఫోన్ చేయటం విశేషం. టీడీపీ కూడా ఐవీఆర్ సర్వేలో రోజుకొక నాయకుడు పేరుతో అభిప్రాయాన్ని తెలుసుకుంటోంది. దీంతో అభ్యర్థి ఎంపికలో టీడీపీ కసరత్తు చేస్తున్నందున వేణుగోపాల్ టీడీపీ చేరే అవకాశం ఉందనే ప్రచారం ముమ్మరమైంది.



మహీధర్‌రెడ్డి



వేణుగోపాల్



సుధాకర్

నియోజకవర్గం వీడని సుధాకర్

ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే సుధాకరబాబును శాంతపరిచేందుకు ఆ పార్టీ ఒంగోలు లోక్‌సభ డిప్యూటీ కోఆర్డినేటర్ పదవిని కట్టబెట్టింది. ఎస్‌ఎన్‌పాడు బాపట్ల లోక్‌సభలో ఉన్నందున ఆయనను ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఉపయోగించుకుంటూ, ఎస్‌ఎన్‌పాడులో పార్టీ అభ్యర్థికి సహకరించే విధంగా చేయాలని ఆ పార్టీ భావించింది. అయితే వేరే జిల్లాలో అయినా చివర్లో అయినా అవకాశం ఇస్తారని భావించిన సుధాకర్‌బాబు జాబితా అనంతరం డీలాపడ్డారు మధ్యలో వైసీపీలోని ఒక ప్రముఖ నాయకునితో కలిసి టీడీపీలోకి వెళ్లే ఆలోచన కూడా చేసినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం భవిష్యత్ కార్యాచరణపై దృష్టిపెట్టారు. సోమ, మంగళవారాలు కూడా ఆయన మల్లవరం గృహంలో అనుచరులతో మంతనాలు జరిపినట్లు తెలిసింది. ఇంతవరకు వైసీపీ అభ్యర్థికి మద్దతు ప్రకటించలేదు. నాగార్జున కూడా వెంటేసుకుని తిరిగేందుకు సిద్ధంగా లేరు. దీంతో తనను కలిసిన అనుచరులకు నాగార్జున గెలుపు కోసం కృషిచేయండని సుధాకర్ బాబు నేరుగా చెప్పకపోవటం గమనార్హం. కర్నూలు జిల్లాలో ఒక దళిత వైసీపీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో సుధాకరబాబు కూడా ఆ వైపు ఎందుకు దృష్టి పెట్టకూడదని అనుచరులు ఒత్తిడి చేస్తున్నారు. సుధాకరబాబు అంత సాహసం చేయలేకపోవచ్చు కాని నాగార్జునకు మాత్రం సహకరించడని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

టీడీపీలోకి వలసల జోరు.. వైసీపీ బేజారు

ఒంగోలు, ఎస్‌ఎన్‌పాడు సెగ్మెంట్లలో నిత్యం చేరికలు

మరింత జోష్‌లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు

ఒంగోలు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జంట నియోజకవర్గాలుగా ఉండే ఒంగోలు, సంతనూతలపాడులలో తెలుగుదేశం పార్టీశ్రేణులు జోష్ మీద కనిపిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే టీడీపీ తన అభ్యర్థులుగా ఒంగోలు నుంచి దామచర్ల జనార్దన్, ఎస్‌ఎన్‌పాడు నుంచి బీఎన్ విజయకుమార్‌లను ప్రకటించడంతో వారు ఎన్నికల ప్రచారం స్పీడ్ పెంచారు. ఈ సమయంలో నియోజకవర్గాల్లోని పలుప్రాంతాలు, వివిధ సామాజికవర్గాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నారు. నిత్యం భారీ చేరికలు ఉంటుండటంతో శ్రేణులు మరింత జోష్‌తో ముందుకు సాగుతుండగా వైసీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. గత పక్షంరోజులుగా ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతం, ఏదో ఒక సామాజికవర్గం వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతూనే ఉన్నారు. దీంతో స్థానికంగా పార్టీకి అండగా ఉన్న స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ కొత్తగా పార్టీలోకి వచ్చేవారిని పోటీచేయనున్న అభ్యర్థులు ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతం శుభకార్యాలు అధికంగా ఉన్న రోజులు కావడంతో నేతలు బీజీగా ఉన్నప్పటికి చేరికల కోసం కొంత సమయం కేటాయించక తప్పడం లేదు. పూర్తిగా గ్రామీణ ప్రాంతమైన ఎస్‌ఎన్‌పాడులో సహజంగానే క్షేత్రస్థాయిలో వర్గపోరు అధికంగా ఉంటుంది. అక్కడి ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బీఎన్ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు. అయితే అర్బన్ వాతావరణం అధికంగా ఉండే ఒంగోలులో అలాంటి వర్గపోరు పెద్దగా ఉండే అవకాశం లేకపోవడంతో ఇక్కడి ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆయా డివిజన్లు నుంచి పార్టీలో చేరేవారిని సాదరంగా ఆహ్వానిస్తున్నారు. దీంతో ఒంగోలులో వైసీపీ నుంచి టీడీసీలోకి వలసలు జోరు పెరిగింది. గత వారం పది రోజులుగా పరిశీలిస్తే ఒక్క చిలకలూరిపేట సభ జరిగిన రోజు మినహా నిత్యం పెద్దసంఖ్యలో టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలిచిన ఆర్యవైశ్యులు, మైనార్టీలు అధికంగా ఒంగోలులో టీడీపీలోకి వస్తున్నారు. కాగా గత రెండు, మూడు రోజులుగా రెండు నియోజకవర్గాలలో పరిశీలిస్తే.. ఒంగోలులో సోమవారం భారీగా టీడీపీలో చేరారు. నగరంలో 15వ డివిజన్ వైసీపీకి చెందిన ఆర్యవైశ్య నాయకులు కనమర్లపూడి హరిప్రసాద్ ఇతరుల నేతృత్వంలో పెద్దసంఖ్యలో జనార్దన్ సమక్షంలో టీడీపీలో చేరారు. అదేరోజు సాయంత్రం మూడవ డివిజన్‌లోని ప్రకాశం కాలనీకి చెందిన మైనార్టీ నాయకులు చేరారు. అలాగే బుధవారం నగరంలోని 50వడివిజన్ పరిధిలోని జయప్రకాష్‌కాలనీకి చెందిన వైసీపీ నాయకులు చేరగా వారిని జనార్దన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గం చూస్తే నిత్యం ఏదో ఒక గ్రామం నుంచి బీఎన్ విజయకుమార్ సమక్షంలో టీడీపీలో చేరుతూనే ఉన్నారు. చీమకుర్తి మండలం బూసరపల్లిలో ఎన్‌ఆర్‌ఐ తక్కెళ్ళపాటి రమేష్ సారథ్యంలో పెద్దసంఖ్యలో చేరికలు జరగ్గా ఈ సందర్భంగా భారీ సభను కూడా నిర్వహించారు. అలాగే బుధవారం రాత్రి ఎస్‌ఎన్‌పాడు మండలం తక్కెళ్లపాడులో బీఎన్ సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. ఈ పరిణామాలతో తెలుగు తమ్ముళ్లు మరింత జోష్‌తో ఉన్నారు.



బూసరపల్లిలో బీఎన్ సమక్షంలో టీడీపీలో చేరికలు



బూసరపల్లి సభలో మాట్లాడుతున్న బీఎన్

పది బార్ కోడింగ్ ప్రారంభం

ఒంగోలు(విద్య), మార్చి 20: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో గోప్యత పాటించేందుకు జవాబుపత్రాలకు బార్ కోడింగ్ ప్రక్రియ బుధవారం స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూలులో ప్రారంభమైంది. ఇద్దరు చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు, ఎనిమిది మంది అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లను ఇందుకోసం నియమించారు. ఇక్కడ మల్యాంకానికి వచ్చిన జవాబుపత్రాలు ఏ జిల్లా, ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థి అని తెలియకుండా ఉండేందుకు వాటికి పిన్ చేసిన విద్యార్థి వివరాలన్నీ ఓఎంఆర్ షిట్‌లోని పార్ట్-1ను వేరు చేసి వాటిని ట్రంకు పెట్టెల్లో పెట్టి భద్రపరిచి వాటికి తాళం వేస్తారు. జవాబుపత్రాలకు పిన్ చేసిన ఓఎంఆర్ షీట్ల పార్ట్-1లను వేరు చేసేందుకు మైనంపాడు జిల్లా విద్యాశాఖ సంస్థ(డైట్) విద్యార్థులను నియమించారు. డీఈఓ సుభద్ర, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే.శివకుమార్‌లు బార్ కోడింగ్ కేంద్రాన్ని సందర్శించారు. డీఈఓ సుభద్ర మాట్లాడుతూ బార్ కోడింగ్ ప్రక్రియను గోప్యతతో నిర్వహించాలన్నారు. వివరాలు బయటకు పొక్కకుండా చర్యలు తీసుకోవాలని ఆఫీసర్లకు సూచించారు.

1నుంచి మూల్యాంకనం

ఒంగోలు(విద్య), మార్చి 20: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి 8వతేదీ వరకు జరుగుతుంది. మొదట ఈనెల 31నుంచి మూల్యాంకనం ప్రారంభమవుతుందని షెడ్యూల్ ప్రకటించారు. తాజాగా ఈ షెడ్యూల్‌ను సవరిస్తూ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలు, రామనగర్‌లోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం జరుగుతుంది.

ఇచ్చేది నిజమేనా?

భరోసా పత్రాలు ఇచ్చి వెనక్కి తీసుకున్నారు

సగం పత్రాలు సచివాలయాల్లోనే..


ఒరిజినల్ పట్టాలు వీఆర్వోల బీరువాల్లో..

అసలు ఇస్తారా..? లబ్ధిదారుల్లో అనుమానం

ఇంతలో అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్

వలంటీర్ల ద్వారా గుట్టుగా పంపిణీకి వైసీపీ యత్నం

ఒంగోలులో ఇళ్ల పట్టాల పంపిణీపై గందరగోళం



జగన్ బొమ్మతో ముద్రించిన మరో పట్టా, తహసీల్దారు పేరుతో ఖాళీ పట్టా

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 19 : జగనన్న ఇంటి స్థలం పేరుతో పట్టాల పంపిణీకి వైసీపీ నేతలు చేసిన హడావుడి అంతాఇంతా కాదు. ఒంగోలులో 25 వేలమందికి ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పిన ఆ పార్టీ నేతలు పంపిణీ కార్యక్రమాన్ని పండుగులా నిర్వహించారు. అంతకు ముందు రిజిస్ట్రేషన్ పేరుతో సచివాలయాల్లో సాధారణ విధులన్నీ పక్కన పెట్టి లబ్ధిదారులను పిలిచి మరీ వేలిముద్రలు తీసుకున్నారు. పట్టాల కార్యక్రమానికి స్వయంగా సీఎం హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాత లబ్ధిదారులకు తెలిసిన విషయం ఏమిటంటే అవి పట్టాలు కాదు, కేవలం భరోసా పత్రాలు మాత్రమే అని తేలింది. దీంతో లబ్ధిదారుల్లో వీటిపై పలు అనుమానాలు రావడంతో తిరిగి వారి నుంచి వలంటీర్ల ద్వారా వెనక్కి తీసుకోవడంతోపాటు, ఒరిజినల్ పట్టాలు వేరే ఉన్నాయి. తహసీల్దారు సంతకంతో మరలా ఇస్తామని నచ్చచెబుతున్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పట్టాల వ్యవహారం గందరగోళంగా మారింది.

అన్ని సచివాలయాల్లోనే...

ఒకవైపు భరోసాపత్రాలు కట్టలు కట్టలుగా సచివాలయాల్లో మూలుగుతుండగా, ఖాళీ ఇంటిపట్టాల కట్టలు వీఆర్వోల బీరువాల్లో భద్రంగా దాచేశారు. దీంతో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అసలు తమకు ఇచ్చిన స్థల పట్టాలు వస్తాయా? రావా? అనే అనుమానం లబ్ధిదారుల్లో నెలకొంది. దీంతో తమ పరిధిలోని వలంటీర్లకు ఫోన్ చేసి అడగ్గా, ప్రస్తుతానికి కార్యాలయంలో ఉన్నాయి. పట్టాలు ఇచ్చే విషయమై తమకు ఎలాంటి ఆదేశాలు లేవని చెప్పడంతో అందరూ ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా, సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తే మీ పట్టాలు మీ ఇంటికే వస్తాయి ఎలాంటి కంగారు వద్దు అని భరోసా ఇస్తున్నారు. అందిన సమాచారం మేరకు ఇప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వలంటీర్ల ద్వారా గుట్టుగా కొందరు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిసింది. అధికారుల లెక్కల ప్రకారం 21,840 మంది లబ్ధిదారులను పట్టాలకు అర్హులుగా గుర్తించగా, ప్రస్తుతం 5వేల మంది లబ్ధిదారులకు ఒరిజినల్ పట్టాలు పంపిణీకి బ్రేకులు పడ్డాయి. దీంతో ఒకవైపు లబ్ధిదారులు మాకు ఇచ్చిన పట్టాలు సంగతేంటి? అనే అనుమానం వ్యక్తం చేస్తుండగా, వైసీపీ నేతలు మాత్రం ఇచ్చిన మాట ప్రకారం వాటిని పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వకుంటే ఎన్నికల్లో ఓట్లు అడిగేదెలా? అనుమానం వారిలో వ్యక్తమవుతోంది.

రెండు నెలల పాటు వలంటీర్లు విధులకు దూరం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వార్డు వలంటీర్లు అధికారిక విధులకు దూరంగా ఉండాలని ఆదేశించింది. ఇప్పటివరకు అందిస్తున్న ప్రభుత్వ పథకాల సేవల్లో వారి అవసరం లేదని కమిషన్ తేల్చిచెప్పింది. అయినప్పటికి సోమవారం వరకు వారు విధుల్లోనే కొనసాగారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ నంబరు, తంబ్ వేసే డివైస్ అన్నీ వారి వద్దనే ఉంచుకుని పనిచేస్తుండగా, ఇదేమని పలువురు ప్రశ్నించగా, ఇంటి పన్నుల వసూళ్ల కోసం పనిచేస్తున్నారంటూ సచివాలయ సెక్రటరీలు బుకాయించారు. దీనిపై కొందరు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలతో మంగళవారం నుంచి వారి సెల్ నెంబర్లు బ్లాక్ చేశారు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాల అందించే సేవలు ఇకపై వీరు ప్రజలకు చేరువ చేయడానికి వీలు లేదని, నాయకుల సేవల్లోనూ ఉండటానికి వీలు లేదని కమిషనర్ ఆదేశించారు. దీంతో మంగళవారం నుంచి డివిజన్లలో వలంటీర్ల సేవలు ఉండబోవు.

వలంటీర్లపైనే వైసీపీ నేతల దృష్టి

నియోజకవర్గంలో ప్రతి ఇంటి సమాచారం ఇప్పటికే వలంటీర్ల వద్ద ఉంది. దీంతో ఏ ఇంటిలో ఎన్ని ఓట్లు ఉన్నాయి. పథకాలు ఎన్ని అందాయి. ఎవరు ఎటువైపు ఉన్నారనే సమాచారమంతా వలంటీర్ల వద్ద ఉంది. త్వరలో జరిగే ఎన్నికలలో వలంటీర్లు కీలకం కానుండటంతో ఆ విషయాన్ని గుర్తించిన ఈసీ వారిని ప్రభుత్వ సేవల నుంచి దూరంగా ఉంచాలని నిర్ణయించి ఆదేశించింది. అయితే వలంటీర్లు దూరమైతే పార్టీకి నష్టం వాటిల్లుతుందని భావించిన వైసీపీ నేతలు వలంటీర్లను అనధికారంగా ఉపయోగించుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే నిలిచిపోయిన ఇళ్ల పట్టాలను వీరి ద్వారా గుట్టుగా లబ్ధిదారులకు అందించే ప్రయత్నాలు జరుగుతుండగా, మరోవైపు ఈ రెండు నెలలు వైసీపీ కోసం పని చేయండి, అవసరమైనవి అందిస్తామని ప్రలోభాలకు గురి చేస్తున్నారు. దీంతో వలంటీర్లపైనే ఆ పార్టీ నేతల ఆధారపడినట్లు తెలుస్తోంది.

ఈత.. కారాదు గుండెకోత..!

- తీరప్రాంతానికి పెరుగుతున్న పర్యాటకుల తాకిడి
- సుముద్ర స్నానాల్లో అప్రమత్తత అవసరం
- లేదంటే భారీ మూల్యం చెల్లించాల్సిందే


రామాపురం తీరంలో మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు, స్నేహితులు (ఫైల్)

చీరాల, మార్చి 20 : ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షలు పూర్తయ్యాయి. సెలవులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తీరప్రాంతంలో పర్యాటకుల తాకిడి పెరిగింది. సముద్ర స్నానాలకు పర్యాటకులు మక్కువ చూపుతుంటారు. అంతవరకు మంచిదే. ఆనందం, ఆహ్లాదంతో ఆటవిడుపు రోజులు ఉల్లాసంగా సాగేవిధంగా పర్యాటకులు ప్లాన్ చేసుకోవాలి. గతంలో తీరప్రాంతంలో సముద్రస్నానాల్లో జరిగిన అపశృతులను గుర్తెరిగి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే కొన్ని సందర్భాల్లో ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సి వస్తోంది.

చీరాల నియోజకవర్గంలో విస్తారంగా తీరప్రాంతం ఉంది. చీరాల మండలం వాడరేవు నుంచి వేటపాలెం మండలం రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెంల వరకు తీరంవెంట సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి గణనీయంగా ఉంటుంది. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. వేసవి సెలవులు నడుస్తున్నాయి. 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. అవి కూడా పూర్తయితే తీరానికి మరికాస్త తాకిడి పెరుగుతోంది. ఇక సెలవు రోజుల్లో పెద్దలు, పిల్లలు అనే తారతమ్యం లేకుండా తీరంలో ప్రధానంగా సముద్రస్నానాలకు పోటీ పడుతుంటారు. కొందరు ఈత సరదాను తీర్చుకుంటుంటారు. అంత వరకు బాగానే ఉంది. అయితే కొన్ని సందర్భాల్లో సమూహంగా వచ్చిన వారు ఒకరికంటే ఒకరు లోతుకు వెళ్లాలనే తలంపుతో పోటీ పడి అలలతాకిడికి గురై గల్లంతయిన సందర్భాల్లో అనేకం ఉన్నాయి. గల్లంతయిన వారిలో సింహ భాగం విగతజీవులుగా మారుతుంటారు. అయితే కొన్ని సందర్భాల్లో సముద్రం లోతుకు వెళ్లి అలలకు చిక్కుకున్న వారిని మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు రక్షించిన సందర్భాలు ఉన్నాయి. అయితే అన్ని వేళలు సాయం అందకపోవచ్చు. ఈ నేపథ్యంలో పర్యాటకంగా సముద్రస్నానాలకు, ఆటవిడుపుగా వచ్చేవారు ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలి

ప్రధానంగా పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు సముద్ర తీరప్రాంతాలలో అవసరమైనచోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి. దీంతో పాటు మెరైన్ పోలీసులు, పోలీసులు కూడా ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేయడం అవసరం. వచ్చిన పర్యాటకులలో కొందరు తీరంలో మద్యం సేవించడం పరిపాటి. అలాంటి సందర్భాల్లో మద్యం సేవించిన వ్యక్తులు సముద్రంలో దిగకుండా ఉంటే మంచిది. అందుకు అధికారులు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మొత్తం మీద సముద్రానికి ఆటవిడుపుగా వచ్చేవారిలో ఏ ఒక్కరు ఇబ్బంది పడకుం డా స్థానిక పంచాయితీ, రెవెన్యూ, పోలీస్, మైరైన్ పోలీస్ సమిష్టిగా ఉమ్మడి కార్యాచరణను అమలు పరచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.


బాధితుడిని పరామర్శిస్తున్న టీడీపీ బీసీ సెల్ నాయకులు

దాడికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలి

చీరాల,మార్చి 20 : రోడ్డు విషయంలో టీడీపీ కార్యకర్తపై దాడికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. ఆమోదగిరి పట్నంలో యర్ర రూపానందం అనే టీడీపీ కార్యకర్త ఇంటి ముందు వేసే సిమెంట్ రోడ్డు తన స్థలంలోకి వస్తుందని, దీనిపై సర్వే చేయించి తరువాత రోడ్డు వేయాలని అడిగినందుకు వైసీపీకి చెందిన సాధు రాఘవ, మరికొందరు అతనిపై దాడిచేసి గాయపరిచారని టీడీపీ బీసీ సెల్ నాయకులు తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలకు పట్టుబట్టారు. బుధవారం బాధితుడు రూపానందంను వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు డోల శివకుమార్, గుత్తి వీరప్రసాద్, బొగ్గుల పార్థసారథి, చప్పిడి వెంకట్రావు, చెన్నంశెట్టి ప్రసాద్, అంగిరేకుల వెంకటేశ్వరరావు, కోసూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాలేటితో కొండయ్య భేటీ


భేటీ అయిన కొండయ్య, పాలేటి

చీరాల,మార్చి 20 : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రా మారావును మర్యాద పూర్వకంగా కలిసి భేటీ అయ్యారు. పాలేటి హాస్పిటల్‌లో వారిద్దరూ మంతనాలు సాగించారు. భవిష్యత్ రాజకీయ అడుగులపై చర్చ జరిగినట్లు స మాచారం.

పది పరీక్షలలో అలసత్వం వద్దు


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివకుమార్

చీరాలటౌన్, మార్చి 20 : పది పరీక్షల విధుల్లో సిబ్బంది అలసత్వం ప్రదర్శించవద్దని ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలో సుమారు మూడు రోజుల నుంచి పది పరీక్షలు జరుగుతున్నాయి. ఈక్రమంలో సంబంధిత అధికారులు మండలంలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 1643 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 40 మంది విద్యార్థులు బుధవారం గైర్హాజరు అయ్యారు. ఈ విషయమై పోలీసులు కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే బుధవారం ఈపూరుపాలెం ఎస్సై స్టేషన్ పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకుని విధి నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

పకడ్బందీగా పరీక్షలు

సంతమాగులూరు : సంతమాగులూరు మండలంలో పదో తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం నిర్వహించిన పరీక్షలకు 655 మంది విద్యార్థులకుగాను 10 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. సంతమాగులూరు మండలంలో చవిటిపాలెం హైస్కూలులో 2, సంతమాగులూరు హైస్కూలులో 4, ఏల్చూరు హైస్కూలులో 2, మక్కెనవారిపాలెం హైస్కూలులో 2 మొత్తం 10 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఎంఈవో తెలిపారు.

వైభవంగా అభయాంజనేయ విగ్రహావిష్కరణ


అభయాంజనేయుని విగ్రహం

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 20: యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో బుధవారం అభయాంజనేయ స్వామి సుధా విగ్రహ ఆవిష్కరణ కార్యక్ర మం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండవీటి జ్యోతిర్మయి విచ్చేశారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ట అనంతరం జ్యోతిర్మయి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సభా వేదికపై జ్యోతిర్మయి అన్నమాచార్యుల సంకీర్తనలను పాడి, వాటి గొప్పతనాన్ని భక్తులను అలరించారు. వెంకటేశ్వరస్వామి వారి ప్రాసస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో బాలికలు వేసిన కోలా టం ఆకట్టుకున్నది. అనంతరం భక్తులకు భారీగా అన్న సంతర్పణ చేశారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

అద్దంకి, మార్చి 20 : అద్దంకి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రి భద్రపరిచేందుకు పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌ను బుధవారం అధికారులు పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునిల్ కుమార్, చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, తహసీల్దార్ మహబూబ్ సుభాని, సీఐ కృష్ణయ్య, ఆర్ఐ శంకర్ ఉన్నారు.


స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న

తిరునాళ్లకు కోడ్ ఆంక్షలు

- ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌లకు అనుమతి లేదు
- చీరాల డీఎస్పీ ప్రసాద్


మాట్లాడుతున్న చీరాల డీఎస్పీ ప్రసాద్

అద్దంకి, మార్చి 20 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున సింగరకొండ తిరునాళ్ల నిర్వహణపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ సూచించారు. శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్ల ఈనెల 25వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ ప్రభలపై ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌లకు అనుమతులు లేవని తెలిపారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే వ్యక్తులు పార్టీల జెండాలను కట్టవద్దన్నారు. తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు సుమారు 750 నుంచి 800 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న పనులను అధికారులు వివరించారు. ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల ఈవోలు సుభద్ర, కోటిరెడ్డి, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, సీఐ కృష్ణయ్య, ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు పాల్గొన్నారు.

వాసవీమాత విగ్రహానికి ఊరేగింపు


అమ్మవారిని ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

మార్టూరు, మార్చి 20: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహానికి బుధవారం పురవీధులలో ఊరేగించారు. అనంత రం దేవాలయం వద్దకు తీసుకు వచ్చారు. శుక్రవారం బొడ్డురాయి సెంటరు సమీపంలో కన్యకా పరమేశ్వరి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మహాబలిపురంలో వాసవీ మాత విగ్రహాన్ని ప్రత్యేక నిపుణుల ద్వారా తయా రు చేయించారు. మార్టూరుకు చేరిన అమ్మవా రి విగ్రహాన్ని ఓంకార్ మినరల్స్ నుంచి ఆర్యవైశ్య యువకులు, కమిటీ సభ్యులు ఊరేగింపుగా దేవస్థానానికి తీసకొచ్చారు. మహిళలు వార్లుపోసి పూలతో పూలతో అమ్మవారికి స్వాగతం పలికారు. గురువారం ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.

తొలిరౌండ్ పొగాకు అమ్మకాలు పూర్తి

కొండపి, మార్చి 20 : కొండపిలోని వేలం కేంద్రంలో తొలిరౌండ్ పొగాకు అమ్మకాలు బుధవారంతో పూర్తయ్యాయని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. రెండో రౌండ్ గురువారం నుంచి మొదలవుతుందన్నారు. అందులో బ్యారన్‌కు 4 బేళ్ల చొప్పున విక్రయాలకు అనుమతించామన్నారు. రైతులు గ్రేడింగ్ సరిగా చేసుకుని బేళ్లను వేలానికి తీసుకువచ్చి గిట్టుబాటు ధరలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


గ్యారేజీ నుంచి బయటకు వస్తున్న హనిమిరెడ్డి

బస్టాండ్‌లో హనిమిరెడ్డి ప్రచారం

ఆర్టీసీ గ్యారేజీలో కలియతిరిగిన వైసీపీ నేతలు

అద్దంకి, మార్చి 20 : వైసీపీ అద్దంకి అభ్యర్థి పాణెం హనిమిరెడ్డి బాపట్ల జిల్లా అద్దంకి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ వైసీపీ కండువా వేసుకొని గ్యారేజ్‌లో కూడా తిరగడం విమర్శలకు తావిచ్చింది. పాణెం హనిమిరెడ్డి బుధవారం అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తూ వైసీపీ కండువా వేసుకొని గ్యారేజీలోకి వెళ్లి డీఎం రామ్మోహనరావుతో చర్చించారు. అదేసమయంలో గ్యారేజీ ఆవరణలో కార్మికులు కూడా విధులు నిర్వహిస్తున్నారు. గ్యారేజీలో కార్మికులు ఉన్న సమయంలో హనిమిరెడ్డి మెడలో కండువా వేసుకొని ఉండగా ఆయన వెంట మిగిలిన వైసీపీ నేతలు కూడా ఉన్నారు. వైసీపీ కండువాలతో గ్యారేజ్‌జీ తిరగడం చర్చనీయాంశంగా మారింది.

సువిధ పోర్టల్, సీ-విజిల్‌పై అవగాహన

కొండపి, మార్చి 20 : ఎన్నికల నేపథ్యంలో సువిధ పోర్టల్, సీ-విజిల్ యాప్‌లపై రాజకీయ పార్టీల నాయకులకు ఈఆర్వో ఎ.కుమార్ అవగాహన కల్పించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, పార్టీలు ఏవైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న విషయాలను సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గ్రామస్థులు కలసికట్టుగా కదిలారు

- కల సాకారానికి శ్రీకారం
- హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి అడుగులు



భూమిపూజ చేస్తున్న డిప్యూటీ కలెకర్టర్ రమేష్ నాయుడు, గ్రామస్థులు

పర్చూరు, మార్చి 20: శ్మశాన వాటిక అభివృద్ధికి గ్రామస్థులు కలసికట్టుగా కదిలారు. ఆ పనులకు వెనువెంటనే శ్రీకారం చుట్టారు. పర్చూరులోని హిందూ శ్మశాన వాటిక డంపింగ్ యార్డులను తలపిస్తోంది. ఎక్కడ చూసినా చిల్లచెట్లు, వ్యర్థాలతో ప్రాంగణం అధ్వానంగా మారింది. శ్మశాన వాటికలోని మంచినీటి కొలను సైతం వ్యర్థాలతో కలుషితంగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో అంత్యక్రియల నిర్వహించే సమయంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క చెత్తాచెదారం మరో పక్క కంపుతో అంత్యక్రియలు నిర్వహించుకునే సమయంలో తీవ్ర ఇక్కట్లు పడాల్సిన దుస్థితి ఉంది. పల్లెల్లో సైతం శ్మశాన వాటికలను అభివృద్ధి పరిచి సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నా నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో మాత్రం హిందూవ శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోక పోవడం పర్చూరు వాసులను కలచివేసింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో డంపింగ్ యార్డును తలపిస్తున్న పర్చూరు శ్మశాన వాటిక అనే శీరిర్షకన కథనం వెలువడింది. దీంతో శ్మశాన వాటిక దుస్థితిపై గ్రామస్థులు స్పందించారు. గ్రామానికి చెందిన కొంత మంది కమిటీగా ఏర్పాటు చేసుకొని శ్మశాన వాటికను అభివృద్ధి పరిచే విధంగా కార్యాచరణ చేపట్టారు. అందులో భాగంగా బుధవారం భూమిపూజ నిర్వహించి ఎక్స్‌కవేటర్ సహాయంతో చిల్లచెట్లను తొలగించే విధంగా పనులు చేపట్టారు. అభివృద్ధి కార్యక్రమంలో గ్రామస్థులు ముందుకు రావడం అభినందనీయమని తిరుమలతోని హాదిరాంజీ మఠం డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన కఠారి రమేష్ నాయుడు, జనసేన నాయకులు ఆలా అనిల్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్ర, మంగళగిరి కోటేశ్వరరావు, తులసి శివనాగేశ్వరరావు, గోవిందరావు, మల్లా శ్రీను, గడ్డిపాటి శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి నరసింహం, తులసి భువనేశ్వరరావు, రంగిశెట్టి ఆంజనేయులు, రామాంజనేయులు, కంచనపల్లి రమేష్, ఒగ్గిశెట్టి కృష్ణారావు, తులసి భాస్కర్, చెందు లక్ష్మీ పాల్గొన్నారు.

భారమైన డిజిటల్ సంతకం

- సాగని భూముల ఆన్‌లైన్
- రైతుల ఆవేదన



పంగులూరు, మార్చి 20 : రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయ భూములు ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో డిజిటల్ సంతకం భారంగా మారిందని ముప్పవరం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ముప్పవరం, కొండమూరు గ్రామ రెవెన్యూ పరిధిలో తమకు పూర్తి హక్కు కలిగి గతంలో ఆన్‌లైన్ చేసిన వ్యవసాయ భూమి నేడు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదన్నారు. సంబంధిత భూములను ఆన్‌లైన్ చేసేందుకు తగిన ధ్రువపత్రాలను కార్యాలయంలో ప్రొసీజర్ ప్రకారం సమర్పించి రోజులు గడుస్తున్నా డిజిటల్ సంతకానికి నోచుకోక ఇబ్బంది పడుతున్నామని ముప్పవరం గ్రామ రైతులు వేల్పుల కోటయ్య, బోడెంపూడి ప్రమీల, గరిమిడి రాఘవమ్మలు ఆరోపించారు. జేవీ పాలెం ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘంలో మూడేళ్లుగా తమపేరున ఉన్న వ్యవసాయ భూమిపై 1బీని సమర్పించి వ్యవసాయ రుణం పొందుతూ తిరిగి చెల్లిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రుణం పొందేందుకు మూడేళ్ల క్రితం సమర్పించిన 1బీ ధ్రువపత్రం చెల్లదని, మళ్లీ సమర్పించాలని పీఏసీఎస్ అధికారులు కోరడంతో 1బీ పొందేందుకు ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఆన్‌లైన్‌లో తమ పేరున భూమి నమోదై లేదని రైతులు అంటున్నారు. తమ భూమిని తిరిగి ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు రెవెన్యూ అధికారులకు తమ భూమికి సంబంధించిన పత్రాలను వీఆర్వో, ఆర్ఐల ద్వారా కార్యాలయంలో సమర్పించి రోజులు గడుస్తున్నా డిజిటల్ సంతకం పేరుతో జాప్యం చేస్తున్నట్లు ఆరోపించారు. తమకు హక్కు కలిగి ఉన్న వ్యవసాయ భూమిని వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపరచి తగిన ధ్రువపత్రం (1బీ) పొందేలా చర్యలు చేపట్టి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.


సత్రానికి భూమిపూజ చేస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

రామకూరు కొండపై సత్రానికి శంకుస్థాపన

పంగులూరు, మార్చి 20 : మండలంలోని రామకూరు గ్రామంలో కొండపై కొలువుదీరిన శ్రీ గంగా బాలాత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి దివ్య సన్నిధిలో నిర్మించనున్న ఆర్యవైశ్య నూతన సత్రం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.3కోట్ల వ్యయంతో ఈ సత్రాన్ని నిర్మించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామలింగేశ్వరస్వామి సన్నిధిలో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో సత్రాన్ని నిర్మిస్తామని ఆర్యవైశ్య ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాళ్లపాలెం శివస్వామి, ఒంగోలు మున్సిపల్ మాజీ చైర్మన్ యక్కల తులశీరావు హాజరయ్యారు. శాస్త్రోక్తంగా జరిగిన పూజా కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్యులు, ఎక్కల వంశస్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముఖద్వారం నిర్మాణానికి పూజ

పర్చూరు, మార్చి 20: పర్చూరులోని వైజంక్షన్‌లో రూ.3కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన శ్రీ అభయాంజనేయస్వామివారి ఆలయానికి ముఖద్వార నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. విగ్రహదాత ప్రవాసాంధ్రుడు చిమటా శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో రూ.7లక్షల వ్యయంతో ముఖ ద్వార నిర్మాణం చేయనున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, రంగిశెట్టి ఆంజనేయులు, కోటా శ్రీనివాసరావు, లగడపాటి శంకర్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రంగిశెట్టి రామాంజనేయులు, చిమటా పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి భూమి పూజ


గోమాతకు గ్రాసం తినిపిస్తున్న వెంకటేష్

చీరాల,మార్చి 20 : శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం గోశాల నూతన నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి కరణం వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోమాతలకు గ్రాసం తినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏడు గడ్డివాములు దగ్ధం


కాలిపోతున్న గడ్డి వాములు

చీరాలటౌన్, మార్చి 20 : ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలు కారణంగా ఏడు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈఘటన బుధవారం స్థానిక హరిప్రసాద్ నగర్‌లో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న చీరాల, బా పట్ల అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక దర్శి కొండపై మంటలు


కొండపై కనిపిస్తున్న మంటలు

మార్టూరు, మార్చి 20 : ఇసుక దర్శి కొండపై బుధవారం రాత్రి మంటలు కనిపించాయి. ఈ కొండపై ఎర్ర మట్టిని తవ్విన గుంతలు ఉన్నాయి. ఇంకా చెట్లు చేమలు ఉన్నాయి. అయితే సాయంత్రం ఈ కొండపై మంటలు ప్రజలకు కన్పించాయి. కొండపై ఎవరైనా కావాలనే నిప్పు పెట్టారా లేదా అనుకోకుండా మంటలు చెలరేగాయా అని ప్రజలు అంటున్నారు. రాత్రి సమయానికి కొండకింది నుంచి వ్యాపించిన మంటలు కొండపైకి చెలరేగాయి. మేకలను కొండపైకి మేపుకోవడానికి వెళ్లినవారు పొరపాటున సిగిరెట్ లేదా బీడీని పడేసి ఉంటారా. ఇంకేమైనా జరిగి నిప్పు రాజుకుందా అని ఇసుకదర్శి గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. రాత్రి 8 గంటల సమయంలో మంటలు కన్పించాయి.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

చీరాలటౌన్, మార్చి 20 : రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో 65 సంవత్సరముల వృద్ధురాలు మృతిచెందిన సంఘటన బుధవారం చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. ఆ వృద్ధురాలు వంగపువ్వు రంగు జాకెట్, బులుగు రంగుపై ఎరుపు ఆకుపచ్చ రంగు డిజైన్ చీర ధరించి ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

రోటావేటర్‌లో పడి రైతుకు గాయాలు

అద్దంకి, మార్చి 20 : దున్నేందుకు సిద్ధమైన రోటావేటర్‌లో పడి రైతు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చినకొత్తపల్లికి చెందిన మానం తిరుపతయ్య తన పొలాన్ని దున్నేందుకు బుధవారం ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్లారు. రోటావేటర్‌తో పొలం దున్నేందుకు సిద్ధమవుతున్న తరుణంలో తిరుపతయ్యకు ఫోన్ రావడంతో మాట్లాడేందుకు తిరుపతయ్య పక్కకు వెళ్లారనుకొని డ్రైవర్ ట్రాక్టర్‌ను ముందుకు కదిలించాడు. దీంతో తిరుపతయ్య రోటావేటర్‌లో పడడంతో గాయపడ్డారు. విజయవాడ సమీపంలోని ఆసుపత్రికి ఒక కాలి పాదాన్ని తొలగించారు. రెండవ కాలి పాదం కూడా నుజ్జునుజ్జయింది.


రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

కారంచేడు(పర్చూరు), మార్చి 20 : కారంచేడు గ్రామంలోని శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి 26 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి : సీఐ

పంగులూరు, మార్చి 20 : సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి కోరారు. మండలంలోని రామకూరు, ఆరికట్లవారిపాలెం గ్రామాలలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సందర్భంగా సెంట్రల్ ఫోర్స్ సిబ్బందితో కలసి పురవీధులలో బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


కవాతు చేస్తున్న పోలీస్ అధికారులు



ఉత్తరకాలువకు నీటి విడుదల తగ్గింపు



అనంతసాగరం : సోమశిల డ్యాంలో నీటిమట్టం పడిపోతుండటంతో ఉత్తర కాలువకు నీటిని కుదించారు. డ్యాంలో బుధవారం 11.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 600 క్యూసెక్కులు ఇస్తుండగా 50 క్యూసెక్కులకు కుదించారు. డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్ (గురువారం) : 6.22 | సహరి (శుక్రవారం) : 4.53

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 34.0 25.4 | కావలి : 33.0 26.0 | కందుకూరు : 33.0 26.0 | ఆత్మకూరు : 32.0 20.0 | ఉదయగిరి : 34.0 22.0

'అధికార' దాసోహంపై

ఈసీ కన్నెర్ర!

● వలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లపై వేటు



సంగం : ఎంపీపీ గదికి వేసిన తాళం

సంగం : అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతూ ప్రచారంలో పాల్గొంటున్న ఫీల్డు అసిస్టెంట్లు, వీఆర్వోలు, వలంటీర్లపై ఎన్నికల సంఘం కన్నెర్రజేసింది. విధుల నుంచి వారిని తొలగించడంతోపాటు పోలీస్‌స్టేషన్లలో కేసుల నమోదుకు ఉత్తర్వులు జారీ చేసింది. సంగం సచివాలయం-3లో వలంటీరు నీరుకట్టు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి ఎమ్పీడీవో కార్యాలయంలోని ఎంపీపీ గదిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వలంటీరు జన్మదిన వేడుకలు జరుపుకున్న విషయం విదితమే. ఇది ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకమైనందున ఎన్నికల రిటర్నింగ్ అధికా మధులత ఆదేశాల మేరకు ఎంపీడీవో శేషగిరిరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి వలంటీరు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే ఎంపీపీ గదికి ఎంపీడీవో తాళం వేశారు.

● **కలిగిరి :** ఈసీ ఆదేశాలను ధిక్కరించిన కలిగిరి సచివాలయ పరిధిలోని వలంటీరు కుట్టుబోయిన పవన్‌కుమార్‌ను సస్పెండ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఉదయగిరి ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. సదరు వలంటీరు వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

● **ఆత్మకూరు :** ఏఎస్‌పేట మండలం చౌటభీమవరం గ్రామంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీరుపై వల్లభ్ ప్రసాద్‌ను విధుల నుంచి తొలగించినట్లు రిటర్నింగ్ అధికారి మధులత తెలిపారు.

● **పరికుంటపాడు :** అధికార పార్టీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు ఉపాధి హామి పథకం క్షేత్రసహాయకులు, ఓ ఎండీయూ వాహన ఆపరేటర్‌పై బుధవారం వేటు పడింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అధికార దాసోహం కథనంపై ఉన్నతాధికారులు విచారించారు. పెద్దిరెడ్డిపల్లి, నార్త్‌కొండాయపాళెం, తూర్పుకొండారెడ్డిపల్లి వీఆర్వోలు ఏ సిసింద్ర, సీహెచ్ భాస్కర్, వై చెంచురెడ్డిలతో సహా కాంచెరువు గ్రామానికి చెందిన ఎండీయూ వాహన డ్రైవర్ నరసింహారావులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు అందాయి. అలాగే క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోనూ కేసు నమోదు చేయడం గమనార్హం.



విద్యా వెలుగుల రత్నం ఇకలేరు!

అనారోగ్యంతో నెల్లూరులో మృతి

మాజీ ఉపరాష్ట్రపతి విచారం, ప్రముఖుల నివాళి

విద్యారంగానికే వన్నెతెచ్చి, లక్షలాదిమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన విద్యావేత్త రత్నం మాస్టారు ఇకలేరు. జిల్లా కీర్తిని దశదిశలా ఇనుమడింపచేసిన రత్నం విద్యాసంస్థల అధినేత కొర్రపాటి వెంకటరత్నం (కేవీ రత్నం 82) అనారోగ్యంతో బుధవా రం మధ్యాహ్నం కన్నుమూశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యను, క్రమశిక్షణతో కూడిన బోధనను విద్యార్థులకు అందించారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితం గా విద్యనందించారు. ఆయన విద్యాసంస్థల్లో చదివిన ఎందరో నేడు ప్రపంచవ్యాప్తంగా అత్యున్నతస్థానాల్లో ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతున్న ఆ యన ఇటీవల కోలుకున్నారు. ఈ క్రమంలో బుధవారం మరోసారి తీవ్ర అస్వస్థతకు గురై హరనాథపురంలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త విని ఎంతోమంది శిష్య బృందం శోకసంద్రంలో మునిగారు. పూర్వపు ఉపరాష్ట్రపతి వెంక య్యనాయుడు రాజకీయ నాయకులు, తదితరులు నివాళులర్పించారు.



రత్నం భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు



రంగడి బ్రహ్మోత్సవాలు ఆరంభం

నెల్లూరు (సాంస్కృతికం) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని అర్చక బృందం శాస్త్రోక్తంగా నిర్వహించింది. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, ధ్వజపట పూజ, అంకురార్పణ, హోమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోడ్ కూసినా.. కళ్లు తెరవరేం!

యథేచ్ఛగా క్వార్ట్జ్ దోపిడీ

రూ.కోట్లు విలువైన ప్రజా సంపద లూటీ

మంత్రి కాకాణి, మాజీ మంత్రి అనిల్‌పై ఆరోపణలు

ఒక మంత్రి.. ఒక మాజీ మంత్రి నేతృత్వంలో జిల్లాలో వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ (తెల్లరాయి) సంపద కొల్లగొట్టబడుతోంది. అనుమతుల్లేని క్వారీల్లో ప్రతి రోజూ టన్నుల కొద్దీ తెల్లరాయి తరలిపోతున్నా జిల్లా యంత్రాంగానికి చీమకుట్టినట్లయినా లేదు. ఒకరు తాజా, మరొకరు మాజీ మంత్రుల సారథ్యంలో అధికార పార్టీ రౌడీల పర్యవేక్షణలో నిరాటంకంగా సాగుతున్న తవ్వకాలపై ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



సైదాపురం మండలం జోగిపల్లిలో క్వార్ట్జ్ తవ్వకాలు

నెల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామ లెక్కదాఖలాలో సుమారు వంద ఎకరాల్లో క్వార్ట్జ్ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ భూములు ప్రైవేటు వ్యక్తులవి కావు. పట్టా భూములూ కావు. రెవెన్యూ, అటవీ శాఖలకు చెందిన భూమి. ఈ క్వారీకి లీజు ఉందా అంటే అదీనూ లేదు. ఈ క్వారీ లీజు కోసం ఇప్పటివరకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. కానీ తవ్వకాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికి సుమారు రూ.100 కోట్ల విలువైన క్వార్ట్జ్ ఎటువంటి అనుమతి లేకుండా, ప్రభుత్వానికి పైసా పన్ను కట్టకుండా చెన్నైకి తరలిపోయింది. గత రెండు నెలలుగా రోజుకు 30 లోడ్లకు తక్కువ లేకుండా జిల్లా సరిహద్దులు దాటించేస్తున్నారు. లోడ్డుకు 50 నుంచి 60 టన్నులు చొప్పున రోజుకు 1500 నుంచి 1800 టన్నులు క్వార్ట్జ్ అక్రమ రవాణా జరుగుతోంది. ప్రస్తుతం టన్ను ధర రూ.40-65వేలు పలుకుతోంది. సాధారణంగా ఇంకెవరైనా అయితే టన్ను సరుకును రూ.7వేలకు మాజీ మంత్రికి ఇచ్చేయాలి. కానీ ఇది మంత్రి ఇలాకా కదా! వీరు స్వతంత్రంగా చెన్నైకి ఎగుమతి చేసి టన్ను 40-65 వేల రూపాయలకు అమ్ముకొంటున్నారు. ఈ లెక్కన రోజు కోటి రూపాయల క్వార్ట్జ్ దోపిడీ చేస్తున్నారు. ఇది కాకుండా ఇదే మండలంలోని వరదాపురం రుస్తుం మైన్స్ మరుపూరులోని మరో క్వారీ నుంచి కూడా అక్రమంగా కోట్లాది రూపాయల సరుకు రవాణా అవుతోంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ దోపిడీ దొంగలకు నాయకుడని, ఈ మూడు క్వారీల నుంచి సుమారు రూ.1500 కోట్ల విలువైన క్వార్ట్జ్ కొల్లగొడుతున్నాడని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపిస్తున్నారు.

ఇక సైదాపురం మండలం జోగిపల్లిలో క్వార్ట్జ్ దోపిడీ కొనసాగుతూనే ఉంది. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఈ దోపిడీకి నాయకత్వం వహిస్తున్నారని ప్రతిపక్షాలు, క్వారీలకు హక్కుదారులు ఆరోపిస్తున్నారు. జోగిపల్లి సర్వే నెం.42,42,43, 1, 2, 3, 55-1లో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలు నిరాటంకంగా సాగుతున్నాయి. ఈ భూముల్లో కొంత ఆలయ భూములు, పట్టా, ప్రభుత్వ భూములు ఉన్నాయి. ప్రైవే టు భూముల్లోని క్వారీలపై యాజమాన్య హక్కుకు సంబంధించి కోర్టు వ్యాజ్యాలు నడుస్తున్నాయి. తవ్వకాలు జరపకూడదని, అన్ని క్వారీల మీద స్టే ఆర్డర్లు ఉన్నాయి. అయినా రాజకీయ పలుకుబడితో ఈ క్వారీల మీద పడి దౌర్జన్యంగా దోచుకొంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అధికారులు ఏం చేయ లేక మౌనంగా ఉండిపోయారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో ఇప్పుడైనా అధికా రులు కళ్లు తెరుస్తారేమోనని ఈ భూముల హక్కుదారులు ఆశపడ్డారు. కోడ్ వచ్చినా అవినీతి అధికారుల తీరు మారలేదు. జిల్లా ఉన్నతాధికారులు కళ్లకు కట్టుకున్న బలవంతపు గంతలను విప్పలేదు. వందల కోట్ల రూపాయల విలువైన ప్రజా సంపద దోపిడీకి సంబంధించి జిల్లాకు చెందిన మంత్రి కాకాణి, మాజీ మంత్రి అనిల్‌లను బాధ్యులను చేస్తూ ఆరోపణలు వెల్లువెత్తడం గమనార్హం.



ధ్వజస్తంభం పై గరుడ పటాన్ని ఎగరేస్తున్న అర్చకులు

పరివార దేవతలకు ఆహ్వానం

● ప్రసన్నుడి ఆలయంలో వేడుకగా ధ్వజారోహణ

బిట్రగుంట, మార్చి 20 : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్నుడికి జరిగే కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు గరుత్మంతుడు ధ్వజారూరుడైన ఘట్టాన్ని యాగ్నికులు పంరాంకుశ ప్రసాదాచార్యులు భక్తులకు వివరించారు. అనంతర ధ్వజపటాన్ని ఎగురవేశారు. ఉదయం తిరుమంజనం, స్వామివార్లకు నూతన వస్త్రాల సమర్పణ, స్వస్తివాచనం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఈవో రాధాకృష్ణ సంప్రదాయకంగా ఉభయకర్తలను ఆహ్వానించారు.

● **కొడిముద్దల కోసం బారులు**

గరుడాళ్వారుకు అందచేసే నైవేద్యాన్ని కొడిముద్దలుగా సంతానం లేనివారికి అందచేస్తారు. ఈ కొడిముద్దల కోసం భక్తులు బారులు తీరారు. బుధవారం రాత్రి కృష్ణావతారంలో స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

● **నూతన ఆభరణాల బహూకరణ**

నెల్లూరుకు చెందిన నటుకుల సుబ్బారావు శ్రీవారికి నూతన ఆభరణాలను బహూకరించారు. ఆభరణాల సంప్రోక్షణ అనంతరం ఈవో, వేద పండితులు, భక్తులు వాటిని ఆలయంలోకి చేర్చారు. కాగా విశ్వనాథరావుపేట తాళ్లూరు పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలోని శ్రీవారి పాదాల వద్ద బ్రహ్మోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు శ్రీరాంగోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు ఎన్నికల దెబ్బ

- వడ్డీ మాఫీకి పదిరోజులే గడువు
- మార్చి 31 దాటితే వడ్డీతో చెల్లించాల్సిందే!



విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆత్మకూరు మార్చి 20: పన్నుల వసూలుపై ఎన్నికల దెబ్బ పడింది. కోడ్ రాకముందు కూడా ఆత్మకూరు మున్సిపాలిటీలో అధికారులు పన్నుల వసూలుపై శ్రద్ధ చూపినా ఆశించిన మే ర వసూలు కాలేదు. పన్నుల వడ్డీ మాఫీకి 10రోజులే గడువుంది. మార్చి 31 దాటితే వడ్డీతో చెల్లించాల్సిందే. గడువు దాటకముందే పన్నులు చెల్లించాలని అధికారులు ప్రచారం చేస్తూ.. మరోవైపు విద్యుత్ కనెక్షన్లు కట్ చేస్తున్నారు. పన్నులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్లు తొలిగించడం ఏమిటని బకాయిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాల్టీలో ఏటా సక్రమంగా పన్నులు చెల్లించని వారికి కూడా వడ్డీ పడుతూ వస్తోంది. ఈ భారంతో కొంతమంది సంవత్సరాలుగా పన్నులు చెల్లించడం లేదు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం ఇటీవల వడ్డీమాఫీ నిర్ణయం తీసుకుంది. వడ్డీమాఫీతో మున్సిపాలిటీకి సంబంధించి కోర్టు కేసుల అసెస్‌మెంట్‌తో పాటు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు సంబంధిత పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకుంటారని అధికారులు భావించారు. అంత ఆశాజనకంగా పన్నుల చెల్లింపులు జరగలేదు. ఈ ఏడాది ఎన్నికల విధుల నేపథ్యంలో అధికారులు కూడా ఏటా మాదిరి పన్నుల చెల్లింపులపై కూడా ప్రత్యేక దృష్టిసారించ లేకపోతున్నారు. ఆత్మకూరులో ఆస్తిపన్ను అసెస్‌మెంట్‌లు 8,220 ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3.10కోట్లు పన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.2.5 కోట్లు మాత్రమే వసూలైంది. నీటిపన్ను రూ.70లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బకాయిదారులు స్పందించి పన్నులు చెల్లిస్తే ప్రయోజనం చేకూరుతుంది.

వడ్డీరాయితీని సద్వినియోగం చేసుకోవాలి

-షేక్ ఫజులుల్లా, మున్సిపల్ కమిషనర్

ఆస్తిపన్ను బకాయిలకు ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీ అవకాశాన్ని పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31లోగా వీలై నంత త్వరగా పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలి. సెలవు రోజులలోనూ మున్సిపల్ కార్యాలయంలో పన్నుల వసూలు కేంద్రం పనిచేస్తుంది. మీసేవా, ఆన్‌లైన్ పద్ధతు ల్లో పన్నులు చెల్లించవచ్చు.

అందరి సహకారంతో విజయం సాధిస్తా

- టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి కాకర్ల సురేష్

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): ఈ సార్వత్రిక ఎన్నికల్లో అందరి సహకా రంతో అఖండ విజయం సాధించి ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగురవేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. బుధవారం దుత్తలూరు సెంట ర్‌లోని భారత్ పెట్రోల్ బంకు ఆవరణలో టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వ ర్యంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి పరిచయ కార్యక్రమం నిర్వహిం చారు. ట్రస్టు ఆధ్వర్యంలో రెండేళ్లుగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని పేదలకు ఆరోగ్య, ఆర్థికప రంగా సేవా కార్యక్రమాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటా నన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయడం, అక్రమ కేసులు బనాయించడం, భూములు లాక్కొని ఆర్థికంగా నష్టపర్చడం దారుణమన్నారు. కార్యకర్తల జోలికొస్తే ఊరుకుండే ప్రసక్తే లేదన్నారు. ఎం.గురవయ్యనాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు ఉన్నారు.



కంభం, కాకర్లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

తెల్లరాయి తరలింపు టిప్పర్ పట్టివేత



పోలీసులకు పట్టుబడిన టిప్పర్

సంగం: ఎలాంటి లైసెన్సు, అనుమతి లేకుండా తెల్లరాయిని తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం సంగం పోలీసులు స్థానిక బస్టాండ్‌లో గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కలిగిరి వైపు నుంచి గూడూరు వైపు తెల్లరాయి లోడుతో వెళ్తుండగా తనిఖీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కమనీయం..చెన్నకేశవుడి కల్యాణం



కలవాయి: స్వామి కల్యాణంలో పాల్గొన్న మాదాసు గంగాధరం దంపతులు

కలువాయి, మార్చి 20: స్థానిక చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ, మాదాసు యజ్ఞపవన్, అపర్ణ దంపతులు వ్యవహరించారు. ఉదయం పంచామృతాభిషేకం, అగ్నిప్రతిష్ఠాపన, శాంతిహోమం, రాత్రికి గరుడవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వలంటీర్లకు సెల్‌ఫోన్ల అప్పగింత

కలువాయి: వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల గ్రామ సచివాలయాల సిబ్బంది పలువురు వాలంటీర్ల వద్ద నుంచి ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లు, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కొందరు వాలంటీర్లు వారి వద్ద నున్న సెల్‌ఫోన్లు సచివాలయ సిబ్బందికి స్వాధీనం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లన్నీ తిరిగివారికి ఇచ్చేశారు. ఈ విషయమై ఎంపీడీవో ప్రభాకర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందితే తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు.

పొగాకు రైతును ఆదుకోవాలి

ఆత్మకూరు: టి.ముస్తాపురంలో రెండురోజుల కిందట నాదెళ్ల సుబ్బారావుకు చెందిన పొగాకు బ్యారెన్ దగ్ధం అయ్యింది. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి, పొగాకు బోర్డు మాజీ వైస్‌చైర్మన్ చెరుకూరు రమణయ్యనాయుడు బుధవారం పొలానికి చేరుకుని దగ్ధమైన పొగాకు బ్యారెన్‌ను పరిశీలించారు. బాధిత రైతుకు రూ.10లక్షల వరకు నష్టం అందజేయాలని డిమాండ్ చేశారు. డీసీపల్లి పొగాకు బోర్డు ఛైర్మన్, ఇన్సూరెన్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వారివెంట డీసీపల్లి పొగాకు బోర్డు రైతు సంక్షేమ నాయకుడు గాలి నరసపనాయుడు, కొల్లి శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో సమీక్ష

ఉదయగిరి రూరల్, మార్చి 20: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం మండలంలోని బూత్ లెవల్ అధికారులతో వీఆర్వో నెహ్రూబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గతంలో మాదిరిగా కాకుండా నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఫెసిలిటీ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వేయాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన సిబ్బంది ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బీఎల్‌వోలు సర్పంచ్, ఉప సర్పంచ్ ఓట్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో సరి చూసుకోవాలన్నారు.

జనసైనికుల సంబరం

సీతారామపురం, మార్చి 20: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశీరావు ఆధ్వర్యంలో బుధవారం జనసేన కార్యాలయంలో పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి, వేములపాటి అజయ్ కుమార్ జన్మదినం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసైనికులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు, శిరల నారాయణ, కాశీరత్తయ్య, బండి సురేష్, బండి మధు, పవన్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న భోగినేని కాశీరావు

జగన్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారు ..!

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి

వరికుంటపాడు: అగమ్యగోచరంగా పరిపాలన సాగించి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం తథ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 400సీట్లతో కేంద్రంలో బీజేపీ అధి కారం చేపట్టడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఏనుగ ప్రభాకర్‌రెడ్డి, వంశీరెడ్డి, మూలె బాలకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, మాల్యాద్రి పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

వింజమూరు: ఎస్సీల వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్య సాధనలో భాగంగా మంగళవారం తక్కెళ్లపాడులో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించి జాతి బిడ్డల భవిష్యత్‌కు పూలబాట వేయాలని, జిల్లాలోని ప్రతి మండలంలో గ్రామస్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ప్రతి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శక్తివంచన లేకుండా కృషిచేయాలని, ఎస్సీ వర్గీకరణకు అండగా నిలిచిన వారికి మనం తోడుగా ఉండాలన్నారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంకి వెంకటేష్ మాదిగ, అంకి బాలరాజు, అంకి తిరుపాలు, అంకి రామయ్య, గవ్వల ఇశ్రాయేల్ మాదిగ, మంగళ కిషోర్, పవన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు చేరిన సర్టిఫికెట్లు

సీతారామపురం, మార్చి 20: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం ప్రభుత్వ లోగోలతో కూడిన సర్టిఫికెట్లు మండల కార్యాలయానికి చేరినట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముఖ్యమంత్రి ఫొటో లేకుండా నూతన సర్టిఫికెట్లు అందజేస్తున్నామని తెలిపారు. మండలంలోని తొమ్మిది సచివాలయాలలో ఇకనుంచి వివిధ ధ్రువీకరణ పత్రాలకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఉదయగిరి, మార్చి 20: ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్ ప్రేమకుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉదయగిరి మండల సెక్టార్ బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యోగులు రాజకీయ పార్టీలకు ప్రచారం నిర్వహించిన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్న, బహుమతులు తీసుకున్న ఉపేక్షించేది లేదన్నారు. కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి కే నెహ్రూ బాబు పాల్గొన్నారు.

వెంగమాంబ హుండీల లెక్కింపు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 20: నర్రవాడ శ్రీవెంగమాంబ పేరంటాల అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ కరుణాకర్‌బాబుల ఆధ్వర్యంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి జే.శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీలు హుండీల లెక్కింపు ప్రారంభించారు. నాలుగు నెలల 2రోజుల్లో ఆలయంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించారు. రూ.16,81,545ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత స్టేట్‌బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఉదయగిరి రూరల్, మార్చి 20: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలకు క్షేత్ర సహాయకులు వసతులు కల్పించాలని ఏపీవో శ్రీనివాసులు సూచిం చారు. బుధవారం నేలటూరు, శకునాలపల్లిల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి కూలీలు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో కూలీలకు నీడ, నీటి వసతులు కల్పించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేసేలా చూడాలన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు...



కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నీటితొట్టి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): రోజు రోజుకు ఎండలు మండుతున్నాయి. గుక్కెడు నీటి కోసం మూగజీవాలు, పక్షులు విల విలలా డుతున్నాయి. దుత్తలూరు తహసీల్దారు కార్యా లయ సిబ్బంది తహసీల్దారు యశోద ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో ఓ నీటి తొట్టిని ఏర్పాటు చేసి వాటి దాహార్తి తీర్చేందుకు నీటితో నింపారు. కార్యాలయ ఆవరణలో ప్రతిరోజు పక్షులు, కోతులు, ఇతరత్రా జీవాలు నీటి కోసం పడుతున్న కష్టాలను కళ్లారా చూసి తాము ఈ కార్య క్రమం చేపట్టామన్నారు. కార్యాలయ అధికా రులు, సిబ్బంది తీసుకొన్న నిర్ణయంపై స్థానికులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ఎస్‌డీ గులాం పాల్గొన్నారు.

భారంగా పశుగ్రాసం



ట్రాక్టర్లలో వరిగడ్డిని తెచ్చుకుంటున్న మెట్ట రైతులు

ఉదయగిరి: ఉదయగిరి, సీతారామ పురం ప్రాంతంలో ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవక రైతులు వరి సాగు చేపట్టలేదు. వరిగడ్డి కొనుగోలు భారమవుతుండడంతో పశుపోషకులు లబోదిబో మంటున్నారు. పశుపోషణపై జీవించే పశుపోషకులు సుదూర ప్రాంతాలైన రుద్రకోట, కావలి ఆత్మకూరు, జలదంకి, సంగం, కోవూరు, కలిగిరి ప్రాంతాల నుంచి ఎండు గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్ల లో తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి బాడుగతో సహా ట్రాక్టర్ గడ్డి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై పశుగ్రాసాన్ని పంపిణీ చేయాలని యజమా నులు కోరుతున్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వెంటాడుతున్న వర్షాభావం!

- పూర్తిగా నిండని రాళ్లపాడు ప్రాజెక్టు
- చెరువులకు అరకొరగా చేరిన నీరు
- బీడుగా మారిన భూములు



రాళ్లపాడు ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

లింగసముద్రం, మార్చి 20 : మండలాన్ని తీవ్ర వర్షాభావం వెంటా డుతోంది. సరైన వర్షాలు లేకపోవడంతో రాళ్లపాడు ప్రాజెక్టుకు పూర్తి సామర్థ్యం నీరు చేరడం లేదు. దీంతో ప్రాజెక్టు పరిధిలోని భూములు బీడుగా మారాయి. గత ఏడాది నవంబరులో కురిసిన వర్షాలకు 21 అడుగుల పూర్తి సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులోకి కేవలం 14 అడుగుల నీరు చేరింది. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువ పరిధిలో అధికారికంగా ఉన్న 16,600 ఎకరాలలో, అనధికారికంగా ఉన్న మరో 8 వేల ఎకరాలలో రైతులు వరి పైరు సాగు చేయలేదు. అలాగే మండలంలోని లింగసముద్రం కొత్త, పాత చెరువులు, విశ్వనాథపురం, వీఆర్ కోట, చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం, మొగిలిచెర్ల చెరువులకు కూడా గత ఏడాది నీరు అరకొరగా చేరడంతో వీటి ఆయకట్టు కింద ఉన్న సుమారు 3000 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేయలేదు. మండలంలో అరకొరగా బోర్ల కింద పత్తి, శనగ, మినుము, వరి పైర్లు సాగుచేశారు. దీంతో మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. మేకలు, గొర్రెలకు పశుగ్రాసానికి ట్రాక్టర్ వరిగడ్డి ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.12 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు.



నీరు లేక ఎండుతున్న పత్తి పంట

ఎండిన మన్నేరు వాగు

ఎండిన మన్నేరు వాగు : మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉండడంతో దిగువన ఉన్న మన్నేరు వాగు ఎండిపోయింది. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మన్నేరు పరివాహక ప్రాంతంలోని చీమలపెంట, తూనుగుంట, అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, అంగిరేకులపాడు గ్రామాల రైతులు మన్నేరుకు ఇరువైపులా పత్తిపైరు సాగు చేశారు. మన్నేరులో రైతులు వేసుకొన్న బోర్లకు నీరు సరిగా అందక పత్తిపైరు వాడుముఖం పడుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు మన్నేరును ఇసుకాసురులు తోడేస్తుండడంతో మన్నేరులోని భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని చెబుతున్నారు.

రోజుకు వెయ్యి మందికే 'ఉపాధి' : మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో రోజుకు 5 వేల మందికి ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా 14 పంచాయతీలలో రోజుకు 1000 మందికి పనులు కల్పిస్తున్నారు. దీంతో ఉపాధి లేక రైతు కూలీలు అవస్థలు పడుతున్నారు.

వైసీపీ మాజీ కౌన్సిలర్ టీడీపీలో చేరిక



మదన్‌మోహన్ రెడ్డికి కండువా వేస్తున్న కావ్య

కావలి, మార్చి 20: కావలి పట్టణం 29వ వార్డు వైసీపీ మాజీ కౌన్సిలర్ సురే మదన్ మోహన్ రెడ్డి, ఆ వార్డు వైసీపీ ముఖ్యనాయకులు వింతా క్రిష్ణారెడ్డి, శారదమ్మలు ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీలో చేరారు. అలాగే పోలీస్‌హౌసింగ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి సోదరుడు, మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచు మెట్టుకూరు అమరజీవిరెడ్డి కూడా టీడీపీలో చేరారు. వారికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

- అల్లూరు మండలంలోని గ్రద్దగుంటకు చెందిన వైసీపీ నాయకులు తోట శ్రీహరి, చెముకుల చెంగయ్య, ఇస్రాయేలు ఆధ్వర్యంలో 15 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి స్థానిక పార్టీ కార్యాలయంలో బీద గిరిధర్ పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో-2

కొండాపురం, మార్చి 20: కింది తరగతుల నుంచే విద్యార్థుల్లో అన్నిరకాల నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఈవో-2 ఆనందరావు సూచించారు. బుధవారం మండలంలోని చింతలదేవి పంచాయతీలోని పలు ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించి వారి నైపుణ్యాలను పరీక్షించారు. అదేవిధంగా వేసవి కాలం దృష్ట్యా ఒంటిపూట బడుల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

దగదర్తి(చిట్రగుంట), మార్చి 20: దగదర్తి మండలం అనంతవరంకు చెందిన ఇద్దరు దివ్యాంగులు మహేంద్ర, యశ్వత్‌లకు స్థానిక టీడీపీ నాయకుడు మాలేపాటి భానుచందర్‌నాయుడు బుధవారం ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు కే.వెంకటకృష్ణ, పొడమేకల కొండయ్య, యలమందయ్య, హరిబాబు, వినయ్, మస్తాన్, శ్రీహరి, తేజ, అనిల్ పాల్గొన్నారు.

సచివాలయం మిద్దెపై వైసీపీ జెండా!



కావలిలో 2వ సచివాలయంపై మిద్దెపై ఎగురుతున్న వైసీపీ జెండా

కావలి, మార్చి 20: కావలి పట్టణం పాతూరులోని ఉర్దూ స్కూల్ వీధిలో ఓ భవనంలో కిందిపోర్షన్‌లో సచివాలయం-2 ఉండగా దానిపైన ఉన్న ఇంట్లో వైసీపీ జెండా రెపరెపలాడు తోంది. ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చినా ఆ జెండాను ఎన్ని కల సిబ్బంది తొలగించలేదు. స్వయాన సచివాలయంపైనే వైసీపీ జెండా రెపరెపలాడుతుంటే అక్కడ ఉన్న సచివాలయ ఉద్యోగులు ఎందుకు దానిని తొలగించలేదో వారికే తెలియాలి. సచివాలయంపై ఉన్న ఇంటిపై వైసీపీ జెండా కట్టి ఉండటంతో అందరూ సచివాలయంపై వైసీపీ జెండా కట్టారేమిటని చర్చించుకుంటున్నారు. ఒకవేళ అధికారుల అనుమతులు తీసు కుని ఇంటి యజమాని కట్టుకోవాలన్నా దాని కిందనే సచివాలయం ఉన్నందున దానికి అనుమతులు ఇచ్చేందుకు అవకాశాలు లేవంటున్నారు. ఎన్నికల అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న నూడల్ అధికారి వెంకటేశ్వర్లు

కావలి రూరల్, మార్చి 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమించితే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని గౌరవరం సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఎన్నికల నిబంధనలపై సచివాలయ సి బ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వో అనుమతి లేకుండా రాజకీయపార్టీలు గ్రామాల్లో ఎలాంటి ప్రచారాలు, సమావేశాలు నిర్వహించకూడ దన్నారు. నివాసాలపై పార్టీ జెండాలు పెట్టుకోవాలన్నా ఆర్వో అనుమతులు తప్పనిసరి అన్నారు. పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభించవద్దన్నారు. వలంటీర్లు పార్టీ కార్యక్రమాల్లో తిరిగినా, ప్రచారాలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో నేతల విగ్రహాలకు ఏర్పాటు చేసిన ముసుగులు, ఫ్లెక్సీలు తొలగించటం, శిలాఫల కాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి అఖిల, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందిద్దాం : ఆర్టీసీ డీఎం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం శ్రీనివాసరావు

కావలి, మార్చి 20: బోగోలు మండలం కొండబిట్రగుంటలో జరుగుతున్న ప్రసన్నుడి బ్రహ్మోత్సవాల కు వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల ద్వారా ప్ర యాణికులకు మెరుగైన సేవలు అందిద్దామని కావలి ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు తెలిపారు. డీఎం చాంబరులో బుధవారం ఆర్టీసీ అధికారులు, కార్మిక నాయకులతో నిర్వహించిన సమావేశంలో తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఆర్టీసీ పరంగా అందించవలసిన సేవలు, ఏర్పాట్లపై ఆయన చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు శుక్ర, శని, ఆదివారాలలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నందున 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావలి, ముంగమూరు తోటలు, అల్లూరు, కొండబిట్రగుంట రైల్వే గేట్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వలంటీర్లు, సిబ్బందిని భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. తాగునీటి వసతి కల్పించామన్నారు. భక్తులు సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజరు కేవీఆర్ బాబు, ఏతఈ ఖాజామొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్, సూపర్ వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంలో యువత చేరిక



వైసీపీని వీడి టీడీపీలో చేరిన యువతతో ఇంటూరి

కందుకూరు, మార్చి 20: మండలంలోని మాచవరంలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆపార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ నాగేశ్వరరావు పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చదలవాడ నరేష్, సేలం విశ్వేశ్వరరావు, తేలప్రోలు శ్రీకాంత్, జింకా శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో యువకులు అధికసంఖ్యలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో సాదినేని మాల్యాద్రి, చదలవాడ వెంకటేశ్వర్లు, దండే తిరుమలనాయుడు, బ్రహ్మయ్య, కోటి, బోలిగర్ల సురేష్, తేలప్రోలు యలమంద, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

21వ వార్డులో ఇంటూరి సౌజన్య ప్రచారం

పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని పడమర మంగళిపాలెం, బైపాస్‌రోడ్డు ప్రాంతాలలో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య బుధవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు లక్ష్మీరాజ్యం, నాదెండ్ల సుబ్బులు, నాదెండ్ల లక్ష్మీరాజ్యం, పాకల రమాదేవి, భాగ్యలక్ష్మి, చిలకపాటి మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయానికి విరాళం

కందుకూరు, మార్చి 20: కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం అనివెట్టి మండపం నిర్మాణానికి బుధవారం సాలిపేటకు చెందిన కవర్తపు నవీన్, కావ్య దంపతులు రూ.25వేలు విరాళం అందజేశారు. దాతలు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ఆలయ కమిటీ సభ్యుడు కొడాలి కోటేశ్వరరావుకు నగదు అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మహీధరరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం తలమానికంగా నిర్మాణం జరుగుతున్నందున మావంతు భాగస్వామ్యంగా ఈ కానుక సమర్పించుకున్నామన్నారు.